www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
19-01-2025
సంపుటి : 01 । సంచిక : 257 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ
CMD

# రేషన్‌కార్డులది నిరంతర ప్రక్రియ



- అర్హులకు అందేవరకు ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది
- జాబితాలో పేర్లు రానివారు ఆందోళన చెందొద్దు
- దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ కార్డులు జారీ చేస్తాం
- ఎవరికైనా రాకపోతే గ్రామ సభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

**విశ్వంభర, హైదరాబాద్:** రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అర్హులకు రేషన్ కార్డులు అందేవరకు ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రానివారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కులగణన, సామాజిక, ఆర్థిక సర్వే వివరాల ఆధారంగా, పాత రేషన్ కార్డుల సమాచారం మిగతా2లో...



## హైదరాబాద్‌లో ఏఐ ఆధారిత
# డేటా సెంటర్

## రాష్ట్రంలో రూ.3500కోట్ల పెట్టుబడులు పెడతాం

- ముందుకొచ్చిన ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్
- రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చకున్న కంపెనీ
- ప్రపంచానికి హైదరాబాద్ డేటా హబ్‌గా మారుతుంది: శ్రీధర్ బాబు
- తెలంగాణతో కలిసి పనిచేయటం గౌరవంగా ఉంది: సీఈవో బ్రూనో లోపెజ్
- త్వరలోనే హైదరాబాద్ డేటా సెంటర్లకు రాజధానిగా అవతరిస్తుంది: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో సాగుతోన్న తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం రెండో రోజు సింగపూర్ పర్యటన విజయవంతమైంది. మొత్తం రూ. 3500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరిగినట్టు తెలుస్తోంది. రెండో రోజు సింగపూర్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి మిగతా2లో...

సీఎం రేవంత్ రెడ్డి ప్రతినిధి బృందం సింగపూర్ పర్యటనలో పెట్టుబడుల సాధనలో ముందడుగు పడింది. ఎస్‌టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్.. తెలంగాణలో రూ.3,500కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో ఏఐ ఆధారిత అత్యాధునిక డేటా సెంటర్ ఏర్పాటుకు ఎంఓయూ కుదుర్చుకుంది. హైదరాబాద్.. డేటా సెంటర్లకు రాజధానిగా మారుతోందని సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు.

## కశ్మీర్ కొండల్లో ‘మిస్టరీ’ మరణాలు

స్పందించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

- కారణాలు తెలుసుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేయాలని ఆదేశాలు
- నేటినుంచి దర్యాప్తు ప్రారంభించనున్న బృందం


2

## హిమాచల్ ప్రదేశ్ హౌసింగ్ మినిస్టర్‌తో మంత్రి పొంగులేటి భేటీ

- వివిధ అంశాలపై చర్చించిన ఇద్దరు మంత్రులు
- గృహ నిర్మాణ పథకాలు, ఫోర్త్ సిటీ తదితర విషయాలను వివరించిన పొంగులేటి


2

## హైదరాబాద్‌లో దాశరథి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



- శతజయంతి ఉత్సవాల ను ఘనంగా నిర్వహించాలి
- గూడూరు గ్రామంలో స్మృతి వనం ఏర్పాటు చేయాలి
- దాశరథి గ్రంథాలయానికి ప్రభుత్వం నూతన భవనం నిర్మించాలి
- మంత్రి జూపల్లికి ఎమ్మెల్సీ కవిత లేఖ

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ సాయుధ పోరాటానికి జవసత్వాలు నింపిన ప్రజాకవి, పీడనపై అగ్నిధారను కురిపించిన కలం యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి ఉత్సవాల ను ఘనంగా నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మిగతా2లో...



ఉగాదికి గద్దర్ అవార్డుల
## అందజేత

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..
- అవార్డుల కమిటీ సభ్యులతో జరిగిన సమావేశం
- అవార్డు లోగో, విధి విధానాలు, నియమ నిబంధనలపై చర్చ
- సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మారుస్తామని డిప్యూటీ సీఎం భట్టి హామీ

2

## పాత చట్టానికే ‘హైడ్రా’ అని పేరు పెట్టింది

- కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉంది
- కేసీఆర్ తెలంగాణను అప్పుల రాష్ట్రంగా చేశారు
- అదే విధానాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోంది
- మెట్రో రెండో దశకు కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తుంది
- స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఒక్క బీజేపీకి మాత్రమే ఉంది
- కాంగ్రెస్ రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన తీరును ప్రజలకు వివరిస్తాం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి


11



## సెమీ కండక్టర్ పరిశ్రమలో కీలక పెట్టుబడులు

సెమీ కండక్టర్ పరిశ్రమలో కీలక పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ రాష్ట్రం మరో ముందడుగు వేసింది. తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, అనుకూలమైన విధానాలు సింగపూర్ పారిశ్రామిక వేత్తలను ఆకర్షించాయి. సింగపూర్ భాగస్వామ్యం తెలంగాణ రాష్ట్రంలో కొత్త ఉద్యోగాల కల్పనతో పాటు, ఆర్థికాభివృద్ధికి దోహద పడనుంది. మంత్రి శ్రీధర్ బాబు సింగపూర్‌లో సెమీ కండక్టర్ పరిశ్రమ అసోసియేషన్‌తో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మిగతా2లో...

### తెలంగాణ రాష్ట్రం మరో ముందడుగు

- సెమీకండక్టర్ అసోసియేషన్‌తో సమావేశమైన శ్రీధర్‌బాబు
- రాష్ట్రంలో పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను వివరించిన మంత్రి

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 117 | ₹ 139 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 202 | ₹ 229 |

తెలంగాణలో టీడీపీని
## పునర్‌నిర్మిస్తాం



- ఆ దిశగా చర్చలు జరుపుతున్నా
- త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం
- తెలంగాణలో టీడీపీపై ప్రజలకు ఎంతో ప్రేమ ఉంది
- ఏపీ మంత్రి నారా లోకేశ్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో తెలుగుదేశం పార్టీని మళ్లీ విస్తరిస్తామని ,ఆ దిశగా చర్చలు జరుపుతున్నామని మంత్రి లోకేష్ అన్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్ వద్ద నారా లోకేశ్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1.60 లక్షల మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారని, పార్టీపై తెలంగాణ ప్రజలకు ప్రేమ, మిగతా2లో...


## రాష్ట్రంలో కొత్త బస్ డిపోలు, బస్టాండ్లు ఏర్పాటు

ప్రస్తుతం ఉన్నవాటి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
మహాలక్ష్మి స్కీమ్ కారణంగా ఆర్టీసీ బస్సుల్లో పెరిగింది
దీనికనుగుణంగా బస్ స్టేషన్లను విస్తరిస్తాం
టీజీఎస్ఆర్టీసీ బోర్డు సమావేశం అనంతరం మీడియాతో పొన్నం

2

## బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు తెలంగాణ కీలక నేత మృతి

- మావోయిస్టు తెలంగాణ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న బడే చొక్కారావు


2

రుణమాఫీ పేరిట చేసిన
## మహామోసం

- అన్నదాత నిండు జీవితం బలి
- రైతు జాదవ్ దేవ్‌రావ్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం
- దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- పదేళ్లపాటు రాజుగా బతికిన రైతన్న ఇందిరమ్మ రాజ్యంలో అవస్థల పాలవుతూ అరిగోస పడుతున్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అన్నదాతలను పట్టించుకోవడం లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు

2



## కశ్మీర్ కొండల్లో 'మిస్టరీ' మరణాలు..

**ఢిల్లీ:** కశ్మీర్ కొండల్లో చోటు చేసుకుంటున్న మిస్టరీ మరణాలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. దర్యాప్తు చేసి కారణాలు తెలుసుకునేందుకు తక్షణమే కేంద్ర బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హోంశాఖకు చెందిన సీనియర్ అధికారి ఈ బృందానికి నేతృత్వం వహించనున్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, వ్యవసాయశాఖ, ఎరువులు, రసాయనాల శాఖ, జలవనరుల శాఖకు చెందిన నిపుణులు ఈ బృందంలో సభ్యులుగా ఉంటారు. వీరికి పశుపోషణ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సహకరిస్తారు. స్థానిక అధికారులతో కలిసి ఆదివారమే ఈ బృందం దర్యాప్తు ప్రారంభించనుంది. బాధితులకు తక్షణ సాయం అందించడంతోపాటు, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై కసరత్తు చేస్తుందని హోం మంత్రిత్వ శాఖ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ తరహా ఘటనలపై అధ్యయనం చేసేందుకు దేశంలోని అత్యంత ప్రముఖ సంస్థల నుంచి నిపుణులను కూడా కేంద్రం సిద్ధం చేసింది. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ ప్రాంతంలో గత 45 రోజుల వ్యవధిలో 16 మంది అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. జ్వరం, ఒళ్లు నొప్పులు, వికారం, స్పృహ కోల్పోవడం లాంటి సమస్యలతో అక్కడి ప్రజలు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. కొన్ని రోజుల్లోనే మరణిస్తున్నారు. ఈ అంతుచిక్కని మరణాలకు గల కారణాలను గుర్తించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ముమ్మర ప్రయత్నాలు చేసింది. బాధితుల నుంచి నమూనాలను సేకరించి దేశవ్యాప్తంగా ఉన్న అత్యున్నత ల్యాబ్‌లకు పంపించింది. ఎన్ఐవీ (పుణె), ఎన్‌సీడీసీ (దిల్లీ), ఎన్ఐటీఆర్ (లఖ్‌నవూ), డీఆర్‌డీఈ (గ్వాలియర్)తోపాటు చండీగఢ్, జమ్మూలలో ఉన్న పరిశోధక ల్యాబ్‌లలో పరీక్షించినప్పటికీ వైరస్ లేదా బ్యాక్టీరియా కారకాలు లేవని తేలింది. ఐఐటీఆర్ (టాక్సికాలజీ రీసెర్చ్) నిర్వహించిన విశ్లేషణలో మాత్రం ఆ నమూనాల్లో విషపూరిత పదార్థాలు ఉన్నట్లు గుర్తించింది. దీంతో మరింత అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది.

## హిమాచల్ ప్రదేశ్ హౌసింగ్ మినిస్టర్‌తో మంత్రి పొంగులేటి భేటీ

**విశ్వంభర, హైదరాబాద్:** హిమాచల్ ప్రదేశ్ గృహనిర్మాణ శాఖమంత్రి రాజేష్ ధర్మానితో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వం చేపడుతున్న గృహ నిర్మాణ పథకాల గురించి మంత్రి పొంగులేటి, హిమాచల్ ప్రదేశ్ హౌసింగ్ హౌసింగ్ మినిస్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన.. ఔటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు మధ్యలో మధ్య తరగతి ప్రజానీకం కోసం కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు తరహాలో ఇండ్ల నిర్మాణాల కోసం స్థలం కేటాయించనున్నామని తెలిపారు.కనీసం వంద ఎకరాలలో ఈ టౌన్ షిప్ల ను నిర్మించి మధ్య తరగతి ప్రజానీకానికి అందుబాటులోకి తేవాలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు శాశ్వత గృహాలు నిర్మించాలన్న సంకల్పంతో వచ్చే నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. హైదరబాద్ నగరం వేగంగా విశ్వ నగరంగా అభివృద్ధి చేయడానికి హైదరబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ మూడు సిటీలు ఉండగా ఫోర్త్ సిటీగా 15 వేల ఎకరాలలో ఫ్యూచర్ సిటీ నిర్మాణం, వివిధ అంశాల పై మంత్రి చర్చించారు.

## సెమీ కండక్టర్ పరిశ్రమలో కీలక పెట్టుబడులు

**మొదటిపేజీ తరువాయి**

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏఎస్ఐఏ ఛైర్మన్ బ్రియాన్ టాన్, వైస్ ఛైర్మన్ టాన్ యూ కాంగ్, సెక్రటరీ సి.ఎస్. చుహ తదితర ప్రతినిధులతో రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు.

**భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు..**

తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను మంత్రి శ్రీధర్ బాబు వారికి వివరించారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వాతావరణం, ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను మంత్రి తెలియజేశారు. సెమీ కండక్టర్ పరిశ్రమను రాష్ట్రానికి తీసుకు రావడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలు భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు సహకరిస్తాయని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు.

**ఈ ఏడాది చివర్లో హైదరాబాద్‌కు ఏఎస్ఐఏ...**

హైదరాబాద్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడంలో సింగపూర్ భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా సెమీ కండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రం కీలకమైన కేంద్రంగా నిలుస్తుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానానికి ఏఎస్ఐఏ ప్రతినిధులు సానుకూలంగా స్పందించడంతో పాటు సెమీ కండక్టర్ల పరిశ్రమల పెట్టుబడులకు ఆసక్తి కనపరిచారు. ఈ ఏడాది చివర్లో తమ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌ను సందర్శించి, పరిశీలన జరుపుతుందని ఏఎస్ఐఏ వెల్లడించింది.

## రాష్ట్రంలో కొత్త బస్ డిపోలు, బస్టాండ్లు ఏర్పాటు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో పలు కొత్త బస్ డిపోలు, బస్ స్టేషన్ల నిర్మాణం, విస్తరణకు టీజీఎస్ఆర్టీసీ అనుమతినిచ్చింది. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. హైదరాబాద్ బస్ భవన్‌లో శనివారం జరిగిన ఆర్టీసీ బోర్డు సమావేశం ముగిసిన అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త డిపోల ఏర్పాటుతో పాటు ప్రస్తుతం ఉన్న 97 డిపోలు, బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మహాలక్ష్మీ స్కీమ్ కారణంగా ఆర్టీసీ బస్సుల్లో పెరిగిందని.. దీనికి అనుగుణంగా కొత్త బస్ స్టేషన్ల నిర్మాణంతో పాటు ఉన్న వాటిని విస్తరిస్తామని పేర్కొన్నారు. బోర్డు అనుమతి లభించిన నూతన డిపోలు, బస్ స్టేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులను మంత్రి ఆదేశించారు.

## ఉగాదికి గద్దర్ అవార్డుల అందజేత

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వంమరో కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఈ ఉగాది పండుగకు గద్దర్ అవార్డులు ప్రకటించి.. అవార్డు గ్రహితలకు అందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం స్పష్టం చేశారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో గద్దర్ అవార్డుల కమిటీ సభ్యులతో ఈ సమావేశం జరిగింది. దీనికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో పాటు.. ప్రభుత్వ కీలక అధికారులు, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, గద్దర్ అవార్డుల కమిటీ సభ్యులు హాజరయ్యారు. అనంతరం అవార్డు లోగో, విధి విధానాలు, నియమ నిబంధనలపై ఈ సమావేశంలో చర్చించారు. ఇందులో భాగంగా తెలుగు భాషలో నిర్మించిన ఉత్తమ చిత్రాలను మాత్రమే గుర్తించి గద్దర్ అవార్డును అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మారుస్తామని హామి ఇచ్చారు. అలాగే ఉగాది కానుకగా ఇచ్చే గద్దర్ అవార్డుల ద్వారా.. మానవతా విలువలతో కూడిన చిత్రాలు, సాంస్కృతిక, విద్య, సామాజిక ఔచిత్యం కలిగిన సినిమాలను ప్రోత్సహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. కాగా గతంలో నంది అవార్డులను అందించగా నంది అవార్డు స్థానంలో ఈ గద్దర్ అవార్డులను అందజేస్తామని తెలంగాణ ప్రభుత్వం గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే.

# విషాదసాగరంలో కొండగడప

- నలుగురి మృతదేహాలకు ఒకేసారి అంత్యక్రియలు
- తల్లికి తలకొరివి పెట్టిన ప్రేమలత కూతురు శ్రవంతి
- మనవడు వైద్విక్ మృతదేహాన్ని ట్రాక్టర్లోకి ఎత్తుతూ కంటతడి పెట్టిన తాతలు కృష్ణమూర్తి, రమేష్
- మృతదేహాలను చూసేందుకు వచ్చి గుండెపోటుతో మృతిచెందిన కళ్లెం పెదరాములు
- ఆయనకు అదే ప్రాంతంలో అంత్యక్రియలు









**విశ్వంభర, మోత్కూరు:** మహారాష్ట్రలోని ఔరంగాబాద్ వద్ద గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. యాత్రికులతో వెళ్తున్న తుఫాన్ వాహనం.. అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదాద్రి జిల్లా మోత్కూరు మండలం కొండగడపకు చెందిన అక్కడికక్కడే నలుగురు ప్రాణాలు కోల్పోయారు.మరో పదిమందికి గాయాలయ్యాయి. శనివారం నలుగురి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడంతో మోత్కూరు పురపాలిక పరిధిలోని కొండగడప గ్రామం విషాదసాగరంలో మునిగిపోయింది.. మహారాష్ట్రంలోని ఔరంగాబాద్ నాసిక్ మధ్యన జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండగడప గ్రామానికి చెందిన నలుగురు మృతిచెందడంతో వారికి శనివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నలుగురు మృతదేహాలను చూసేందుకు వచ్చి గుండెపోటుతో మృతిచెందిన స్థానికుడైన కళ్లెం పెద్దరాములుకు కూడా ఆదే సమయంలో అంత్యక్రియలు చేపట్టారు. దీంతో గ్రామం నడిబొడ్డున ఉన్న కృష్ణమూర్తి ఇంటి ముందరకు పెద్దఎత్తున చేరిన గ్రామస్తులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆయన బంధువుల రోధనలతో ఆ ప్రాంతం. కన్నీటిసంద్రమయ్యింది. ఆటు జంగాలకాలనీలోనూ ఇదే పరిస్థితి చోటుచేసుకుంది. శామిశెట్టి ప్రేమలతకు తలకొరివి పెట్టాల్సిన కొడుకు ఔరంగాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆమె చిన్న కూతురు తొల్పునూరి శ్రవంతి తలకొరివి పెట్టడాన్ని చూసి స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. తొల్పునూరి ప్రసన్నలక్ష్మికి భర్త రాంబాబు తలకొరివి పెట్టాల్సి ఉండగా ఆయన కూడా ఔరంగాబాద్ వద్ద బాధితులకు వైద్యసేవలు అందించే క్రమంలో అక్కడే ఉన్నారు. దీంతో వృద్ధుడైన ప్రసన్నలక్ష్మి మామ సత్యనారాయణ తలకొరివి పెట్టారు. మూడు శవాలకు కాష్టం పేర్చగా, వైద్విక్ను.. పూడ్చిపెట్టారు. సన్నివేశాన్ని చూసిన స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. అటు కళ్లెం పెద్దరాములుకు కూడా అదే ప్రమాగంలో కొండగడప గ్రామానికి చెందిన నలుగురు మృతిచెందడంతో వారికి శనివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నలుగురు మృతదేహాలను చూసేందుకు వచ్చి గుండెపోటుతో మృతిచెందిన స్థానికుడైన కళ్లెం పెద్దరాములుకు కూడా అదే సమయంలో అంత్యక్రియలు చేపట్టారు. దీంతో గ్రామం నడిబొడ్డున ఉన్న మూర్తి ముందరకు పెద్దఎత్తున చేరిన గ్రామస్తులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆయన బంధువుల రోధనలతో ఆ ప్రాంత కన్నీటిసంద్రమయ్యింది. అటు జంగాల కాలనీలోనూ ఇదే పరిస్థితి చోటుచేసుకుంది. శామిశెట్టి ప్రేమలతకు తలకొరివి పెట్టాల్సిన కొడుకు ఔరంగాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆమె చిన్న కూతురు తొల్పునూరి శ్రవంతి తలకొరివి పెట్టడాన్ని చూసి స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. తొల్పునూరి ప్రసన్నలక్ష్మికి భర్త రాంబాబు తలకొరివి పెట్టాల్సి ఉండగా ఆయన కూడా ఔరంగాబాద్ వద్ద బాధితులకు వైద్యసేవలు అందించే క్రమంలో అక్కడే ఉన్నారు. దీం వృద్ధుడైన ప్రసన్నలక్ష్మి మామ సత్యనారాయణ తలకొరివి పెట్టారు. మూడు శవాలకు కాష్టం పేర్చగా, వైద్విక్ను పూడ్చిపెట్టారు. ఆ సన్నివేశాన్ని చూసిన స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. అటు కళ్లెం పెద్దరాములుకు కూడా అదే ప్రాంతంలో అంత్యక్రియలు పూర్తిచేశారు.

## రుణమాఫీ పేరిట చేసిన మహామోసం

**విశ్వంభర, హైదరాబాద్:**

ఆదిలాబాద్ రైతు జాదవ్ దేవ్‌రావ్ ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యతని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేయకపోవడంతో ఆదిలాబాద్ జిల్లా బేల మండలం రేణిగూడకు చెందిన రైతు జాదవ్ దేవ్‌రావ్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరిట రుణం ఉన్న బ్యాంకులోనే పురుగుల మందు తాగి ఆ రైతు బలన్మరణానికి పాల్పడ్డాడంటే.. ఆ రుణభారం రైతన్నను ఎంత మానసిక వేధనకు గురిచేసిందో అర్థమవుతుందన్నారు. ఆ అన్నదాత నిండు జీవితం బలికావడానికి రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పేరిట చేసిన మహామోసంతోపాటు రైతు వ్యతిరేక విధానాలే ప్రధాన కారణమన్నారు. పదేళ్లపాటు రాజుగా బతికిన రైతన్న ఈ రోజు ఇందిరమ్మ రాజ్యంలో అవస్థల పాలవుతూ అరిగోస పడుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అన్నదాతలను పట్టించుకోవడం లేదన్నారు.అప్పులు తీరక అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడుతున్నా కనికరం లేని కాంగ్రెస్ సర్కారులో ఏమాత్రం చలనం లేదన్నారు. అధికారంలోకి రాగానే రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి మాట తప్పడం.. రైతు భరోసా ఎత్తకొట్టడం వల్లే నాగోరావ్ అనే రైతు అన్యాయంగా బలయ్యారన్నారు. ఇది ఆత్మహత్యకానే కాదని.. ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యగానే తెలంగాణ రైతాంగం భావిస్తుందన్నారు. నాగోరావ్ మరణానికి కారణమైన ఈ ప్రభుత్వంపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతు కుటుంబానికి కనీసం రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి.. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రుణమాఫీ కాక దిక్కుతోచని స్థితిలో ఉన్న లక్షలాది మంది రైతుల అప్పులను వెంటనే మాఫీ చేసి, ప్రభుత్వం వారిని రుణవిముక్తులను చేయాలన్నారు. ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. పదేళ్లపాటు తెలంగాణలో గుండెలపై చేయి వేసుకుని హాయిగా బతికిన రైతుల జీవితాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పూర్తిగా అధికారం అలుముకుందన్న కేటీఆర్, ఒకప్పుడు సాగులో, పంట దిగుబడిలో నెంబర్ వన్‌గా ఉన్న తెలంగాణ, ఇప్పుడు అన్నదాతల ఆత్మహత్యల్లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉండడం కాంగ్రెస్ సర్కారు చేతకానితనానికి నిలువెత్తు నిదర్శనమని విమర్శించారు. అన్నదాతలారా.. దయచేసి ఆత్మహత్యలు చేసుకోవద్దు అంటూ కేటీఆర్ రైతన్నలకు విజ్ఞప్తి చేశారు. నమ్మించి మోసం చేసిన ఈ నయవంచక కాంగ్రెస్ సర్కారును నిలదీద్దాం.. హామీలు అమలయ్యే దాకా కొట్లాడి ముఖ్యమంత్రి మెడలు వంచుదాం.. తప్ప మీ ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదంటూ కేటీఆర్ పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో ఏఐ ఆధారిత డేటా సెంటర్

**మొదటిపేజీ తరువాయి**

రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు సింగపూర్‌లోని ఎస్టీటీ గ్లోబల్ డేటా సెంటర్ ఆఫీస్ ను సందర్శించారు. కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమక్షంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్ టీటీ గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్ పలు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

**అత్యాధునిక సౌకర్యాలతో ఏఐ ఆధారిత డేటా సెంటర్**

సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పెట్టుబడులపై పలు కంపెనీలతో ఒప్పందాలు చేసుకునే పనిలో పడ్డారు. ఈ క్రమంలో రాష్ట్రంలో రూ. 3,500 కోట్ల పెట్టుబడులకు ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చింది. అందులో భాగంగా హైదరాబాద్ లో ఏఐ ఆధారిత అత్యాధునిక డేటా సెంటర్ ను నెలకొల్పేందుకు చర్చలు సఫలమయ్యారు. ఈ క్యాంపస్ ను ముచ్చర్ల సమీపంలోని మీర్ఖాన్ పేటలో స్థాపించేందుకు ఈ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (MoU) చేసుకుంది. 100 మెగావాట్ల సామర్థ్యంతో హైదరాబాద్ లో ఏర్పాటు చేయనున్న ఈ అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ ను ఈ కంపెనీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పనుంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డేటా సెంటర్ సామర్థ్యాన్ని పెంచుకునే సదుపాయం కల్పించనుండగా.. ఇది నెరవేరితే దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్లలో ఇది ఒకటిగా నిలుస్తుందని భావిస్తున్నారు. దాదాపు రూ. 3,500 కోట్ల పెట్టుబడులతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నందున తెలంగాణలో ఉన్న మౌలిక సదుపాయాలను, ప్రపంచస్థాయి అనుకూలతలను మరింత మెరుగుపర్చనున్నారు.

**డేటా సెంటర్లకు హైదరాబాద్ రాజధానిగా అవతరిస్తుందన్న సీఎం**

ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. త్వరలోనే హైదరాబాద్ డేటా సెంటర్లకు రాజధానిగా అవతరిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల నిర్ణయం తీసుకున్నందుకు ఎస్టీటీ గ్లోబల్ కంపెనీ ప్రతినిధులను అభినందించారు. ఈ క్రమంలోనే ఎస్టీటీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్స్ ప్రెసిడెంట్, గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్ మాట్లాడుతూ.. తెలంగాణతో కలిసి పని చేయటం గౌరవంగా ఉందని చెప్పారు. మౌలిక సదుపాయాలతో పాటు తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రగతిశీల విధానాలు, సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహకంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందించే సహకారంతో ఆర్థిక వృద్ధితో పాటు ఉపాధి కల్పన, స్థిరమైన డిజిటల్ భవిష్యత్తు నిర్మించాలనే ఉమ్మడి లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.

**డేటా హబ్ గా మారనున్న హైదరాబాద్**

ప్రపంచానికి హైదరాబాద్ డేట్ హబ్ గా మారనుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ ఆధారిత రంగంలో వస్తోన్న వినూత్న మార్పుల్లో హైదరాబాద్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఆ తర్వాత శ్రీధర్ బాబు సెమీ కండక్టర్ అసోసియేషన్ సమావేశమై, ప్రతినిధులతో చర్చించారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వాతావరణం, ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు. సెమీ కండక్టర్ పరిశ్రమకు తెలంగాణ కేంద్రంగా నిలుస్తుందన్నారు.

## రేషన్‌కార్డులది నిరంతర ప్రక్రియ

**మొదటిపేజీ తరువాయి**

ప్రకారం అర్హుల పేర్లు నమోదు చేసినట్లు చెప్పారు. అర్హులని భావించినవారు.. ఎవరికైనా కార్డులు రాకపోతే గ్రామ సభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన నాలుగు పథకాలకు అర్హులను గుర్తించే పనిలో వేగంగా ముందుకు వెళ్తుతుంది. ఈక్రమంలో రేషన్‌కార్డులకు సంబంధించిన జాబితా ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రచురించడంతో అర్హులుగా ఉన్నవారి పేర్లు రాకపోవడంతో చాలా మంది లబ్దిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ జాబితా ఎక్కడ నుంచి, ఏవిధంగా రూపొందించారో ఎవరికి అర్థకావడం లేదు. తాము గతంలో పలు మార్లు దరఖాస్తు చేసుకున్న ఎందుకు రాలేని పంచాయతీ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ సర్కార్ తమకు రేషన్‌కార్డులు ఇస్తుందనే ఆశపడితే కొత్త జాబితాలో రాకపోవడంపై స్థానిక రాజకీయ నేతలు తమ రాకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. వీరికి ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు తోడై రాజకీయంగా వచ్చిన అవకాశం వదలకుండా లోకల్ అధికార పార్టీ నేతలు అర్హులకు రాకుండా అడ్డుపడుతున్నారని ఆరోపణలు చేస్తున్నారు. వారి మాటలు నమ్మి అమాయక ప్రజలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. నిజమైన లబ్ధిదారులకు ఇచ్చేవరకు ఆందోళన చేపడుతామని హెచ్చరిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యేలు, మంత్రులు జోక్యం చేసుకోని అర్హులైన పేదలంతా రేషన్ కార్డుల విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిరంతరంగా కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని, ఈనెల 26 తరువాత కూడా దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారందరికి ఇస్తామని హామీ ఇస్తున్నారు. దీంతో గొడవలు సర్థుమణిగి మరోసారి దరఖాస్తులు ఇచ్చేందుకు సిద్ధమైతున్నారు.

**దరఖాస్తు చేసుకున్న ప్రతీ అర్హుడికీ రేషన్ కార్డు..**

రాష్ట్రంలో అర్హులైన ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందే వరకు ప్రక్రియ కొనసాగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అర్హత కలిగిన చివరి వ్యక్తికి ఇచ్చే వరకు రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతూనే ఉంటుందని, ప్రస్తుతం కొత్త రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రాని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.కులగణన, సోషల్‌ఎకనమిక్ సర్వే, పాత రేషన్ కార్డుల ఆధారంగా పేర్లు నమోదు చేయడం జరిగిందన్నారు. వీటిల్లో ఎవరికైనా కార్డులు రాని పక్షంలో గ్రామ సభలలో మళ్ళీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి రేషన్ కార్డు తప్పకుండా ఇస్తామని, ఎవరు ఇప్పుడు కార్డు రాలేదని ఇబ్బందులు పడాల్సిన పని లేదన్నారు. రాష్ట్రంలో రేషన్ కార్డులు అర్హులు అందరికి అందజేయలన్నదే మా ప్రభుత్వ లక్ష్యమని తేల్చి చెప్పారు.

## హైదరాబాద్‌లో దాశరథి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి..

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర సాంస్కృతిక, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కవిత లేఖ రాశారు. హైదరాబాద్‌లోని ప్రముఖ కూడలిలో దాశరథి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించుకోవాలని కోరారు. దాశరథి జన్మించిన మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు గ్రామంలో స్మృతి వనం ఏర్పాటు చేయడంతో పాటు గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న దాశరథి గ్రంథాలయానికి ప్రభుత్వం నూతన భవనం నిర్మించాలని సూచించారు. దాశరథి సమగ్ర సాహిత్యాన్ని ప్రభుత్వమే ముద్రించి గ్రంథాలయంలో ఉంచడంతో పాటు అందరికీ అందుబాటులోకి తేవాలని సూచించారు. దాశరథి శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వం పక్షాన అధికారికంగా సంవత్సరం పొడవునా నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని.. కానీ, ఆ దిశగా పెద్దగా కార్యక్రమాలు జరిగిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. శత జయంతి సందర్భంగా సంవత్సరం పొడవునా కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. శతజయంతి ఉత్సవాల ముగింపు వేడుకలను ప్రభుత్వం పాఠశాలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పెద్ద ఎత్తున జరపాలని పేర్కొన్నారు. దాశరథిని కారాగారంలో ఉంచిన నిజామాబాద్ జిల్లా పాత జైలును ఇప్పటికే తాను కొంత నిధులను వెచ్చించి దాశరథి స్మారక ప్రాంగణం ఏర్పాటుకు పనులు చేపట్టామని, దాన్ని అందరికీ అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం నుంచి కూడా పూనుకొని మరిన్ని ఏర్పాట్లు, మరమ్మతులు చేసి ప్రముఖ పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని కోరారు. మహాకవి దాశరథి స్ఫూర్తిని కొనసాగించేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు నేతృత్వంలోని తెలంగాణ తొలి ప్రభుత్వం 2015 నుంచి దాశరథి జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ వచ్చిందని గుర్తు చేశారు. దాంతో పాటు 'దాశరథి సాహితీ పురస్కారం'ని ఏర్పాటు చేసి రవీంద్ర భారతి వేదికగా సన్మానించి రూ.1,01,116 నగదును అందిస్తూ రావడం జరిగిందని చెప్పారు. అలాగే మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని ఆడిటోరియంకు దాశరథి ఆడిటోరియంగా పేరు పెట్టడంతో పాటు ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు వారి కుమారుడికి గత తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వడం జరిగిందని వివరించారు. 'తెలంగాణ విముక్తి పోరులో ప్రజల పక్షాన నిలవడమే కాక అనేక రచనా ప్రక్రియలలో సాహితీ సృష్టి చేసిన సృజనకారులు.

ఈ నేల అస్మితను ఆకాశమంత ఎత్తున నిలిపిన ఆ మహనీయుని శత జయంతి ఉత్సవాలు తెలంగాణ తన మూలాలను నెమరువేసుకునే చారిత్రక సందర్భం. దాశరథి గారి స్ఫూర్తిని ముందుతరాలకు చాటే దిశగా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తమరిని సవినయంగా కోరుతున్నాను' అని లేఖలో పేర్కొన్నారు. కవిత్వం, నాటికలు, కథలు, యాత్రా చరిత్ర వంటి ప్రక్రియలతో తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన మహాకవి దాశరథి అని కొనియాడారు. అద్భుతమైన సినిమా పాటల రచయితగా జోతలందుకున్న తెలంగాణ బిడ్డ దాశరథి కృష్ణమాచార్య అని, ఆయన శత జయంతి తెలంగాణ ప్రజలందరికీ పెద్ద పండుగ. ఈ శత జయంతి సంవత్సరాన్ని ఘనంగా నిర్వహించడం ప్రభుత్వం విద్యుక్త ధర్మమని ఎమ్మెల్సీ కవిత గుర్తు చేశారు.

## బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు తెలంగాణ కీలక నేత మృతి

**విశ్వంభర, హైదరాబాద్:** రెండ్రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్- మారేడుబాక అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో తెలంగాణకు చెందిన మావోయిస్టు కీలక నేత మృతిచెందారు. మావోయిస్టు తెలంగాణ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న బడే చొక్కారావు అలియాస్ దామోదర్ పోలీసు కాల్పుల్లో మృతి చెందినట్టు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. దామోదర్‌పై గతంలో రూ.50లక్షల రివార్డు ఉంది. బడే చొక్కారావు (దామోదర్) స్వస్థలం ములుగు జిల్లా కాల్వపల్లి. బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు మావోయిస్టు పార్టీ ప్రకటించింది.గురువారం జరిగిన ఎన్‌కౌంటర్ అనంతరం భద్రతా బలగాలు మావోయిస్టుల ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంతోపాటు భారీ బంకర్‌ను గుర్తించాయి. ఇందులో సొరంగల్ దేశవాళీ రాకెట్ లాంచర్లు, పెద్దఎత్తున యంత్రాలు, మందుగుండు సామగ్రి, విద్యుత్తు లైన్ నిర్మించే సిల్వర్ వైర్లు లభించాయి.

## తెలంగాణలో టీడీపీని పునర్‌నిర్మిస్తాం..

**మొదటిపేజీ తరువాయి**

ఆశ ఉందంటూ వ్యాఖ్యానించారు. ఇక్కడ పార్టీని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని చెప్పారు.తెలంగాణలో టీడీపీపై ప్రజలకు ఎంతో ప్రేమ ఉన్నదని, స్వచ్ఛందంగా 1.6 లక్షల మంది సభ్యత్వాలు పొందడమే దానికి ఉదాహరణ అని చెప్పారు. తమకు ఇక్కడ ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోయినా ఇంతమంది సభ్యత్వం తీసుకున్నారని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఇక్కడ కూడా పార్టీ కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు.

# మహిళా ఉద్యోగులు స్వేచ్ఛగా పనులను చేసుకునే విధంగా ఉండాలి

- అందరికీ పోష్ యాక్ట్-23 గురించి అవగాహన పరచాలి
- అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్




**విశ్వంభర, సూర్యాపేట:** జిల్లాలో పనిచేసే మహిళలపై ఎలాంటి లైంగిక వేధింపులకు గురి అయిన వారు అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జరిగిన పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ నిషేధ పరిష్కార చట్టంపై జిల్లా సమైక్య మహిళలకు మండల సమైక్య మహిళలకు ఎన్జీవోలకు మహిళా ఉద్యోగులకు మహిళా శిశు సంక్షేమ శాఖ లోని మహిళా సాధికారత కేంద్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ మాట్లాడుతూ మహిళలు స్వేచ్ఛగా తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలన్నారు. పదిమంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్న ప్రభుత్వ ప్రైవేటు సంఘటిత అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు నిరోధించడానికి మహిళలు ధైర్యంగా వారి పనులు వారు చేసుకోవడానికి అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ప్రతి శాఖ అధికారి హెూటల్స్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ హాస్పిటల్స్ నన్ను కూడా కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 10 మంది కంటే తక్కువ ఉన్న ప్రభుత్వ , ప్రైవేట్ సంస్థలలో పని చేసేవారు ఎలాంటి వేధింపులు జరిగిన జిల్లా స్థాయిలో ఉన్న స్థానిక ఫిర్యాదుల కమిటీ లో ఫిర్యాదు చేసుకొనవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీవాణి మాట్లాడుతూ మహిళ ఉద్యోగి ఇష్టానికి వ్యతిరేకంగా ఉండే ఎటువంటి లైంగిక చర్య అయిన పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల కిందికి వస్తుందని సెక్రటరీ శ్రీవాణి తెలిపారు. మహిళలు తమ ఫిర్యాదులను అంతర్గత ఫిర్యాదుల కమిటీ కి అందజేయాలని తెలిపారు. వేధింపులకు గురైన మహిళల దరఖాస్తులను 90 రోజులలో ఐసీ కమిటీ మెంబర్లు పరిష్కరించడం జరుగుతుందని సెక్రటరీ తెలిపారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఉండి (ప్రభుత ,ప్రైవేటు) అధికారి ద్వారా జరిగిన లైంగిక వేధింపులకు గురి అయిన ఎడల స్థానిక ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఫిర్యాదు చేసే మహిళల యొక్క ప్రతి విషయాన్ని గోపయ్యగా ఉంచబడతాయని ఆమె తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే ఫిర్యాదు చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీ యొక్క సభ్యుల బాధ్యతలను వివరించడం జరిగింది. వేధింపులకు గురి అయిన మహిళ మూడు నెలల కాలం లోపు ఫిర్యాదు చేసుకోవాలని ఆమె తెలిపారు. జిల్లాలో ఉన్న ఎన్జీవోలు అందరూ జిల్లా మహిళా సమైక్యలు కూడా మహిళా చట్టాలపై మహిళలందరికీ అవగాహన పరచాలని ఆమె తెలిపారు. మహిళలకు వికలాంగులకు పిల్లలకు ఉచిత న్యాయ సేవలు అందించబడతాయని దానికి టోల్ ఫ్రీ నెంబర్ 15100 ఫోన్ చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు అమ్మాయిలు తెలియని వ్యక్తులతో అస్సలు మాట్లాడవద్దని సోషల్ మీడియా ఇది వాడు రావట్లే సోషల్ మీడియా ఇంస్టాగ్రాము లలో వచ్చే ఫేక్ సమాచారాలకు సమాధానం ఇవ్వవద్దని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ నరసింహారావు, ఏసీడీపీఓ రూప, స్థానిక ఫిర్యాదుల కమిటీ ఛైర్మన్ శిరీష, సభ్యులు లత ,అనసూయ, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ చైతన్య నాయుడు ,జండర్ స్పెషలిస్టులు రేవతి, వినోద్, తేజస్విని, క్రాంతి, సఖి సిబ్బంది ,ఎన్జీవోలు, డీఎల్ఎస్ఏ సభ్యులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు వికాస సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

**విశ్వంభర, జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం లో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు పెండ్యాల విజయభాస్కర్ అధ్వారంలో సమాచార హక్కు వికాస సమితి క్యాలెండర్ ను అవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఫిలిం ఛాంబర్ కామర్స్ ఈసీ మెంబర్ కోదమూరి దయాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మోహన్ రావు, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

**విశ్వంభర, తంగళ్ళపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో అంకుసాపూర్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించడం జరిగింది. ఈ క్రికెట్ పోటీలను తంగళ్ళపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జలగం ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. జిల్లా స్థాయిలోని పలు గ్రామాల నుండి క్రీడాకారులు పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. క్రీడలతో శారీరకంగా ఆరోగ్యంగాను, ఉత్సాహంగాను ఉంటారని, యువత ముందుకు వచ్చి జిల్లా స్థాయిలో క్రీడలలో పాల్గొనాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇట్టి టోర్నమెంట్ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మునిగల రాజు, గుగ్గిళ్ళ భరత్ గౌడ్, తిరుపతి పొన్నాల లక్ష్మణ్ గౌడ్, మీరాల శ్రీనివాస్ కంకణాల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బీసీ మహాసభ పట్టణ అధ్యక్షునిగా హరి ప్రసాద్ చారి

**విశ్వంభర, బషీర్ బాగ్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని, కులవృత్తులను కాపాడుకోవాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మెట్టుకాడి శ్రీనివాస్ అన్నారు. శనివారం బీసీ మహాసభ సమావేశంలో బీసీ సభ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. పాలమూరు పట్టణ అధ్యక్షునిగా హరిప్రసాద్ చారి, ప్రధాన కార్యదర్శిగా అశోక్ నాయి, కోశాధికారిగా జీకే రమేష్, కో ఆర్డినేటర్ గా వి.బిక్షపతి చారి లను, ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెట్టుకాడి శ్రీనివాస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కనుమూరి బ్రహ్మయ్య లు హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు కుమ్మరి రామచంద్రయ్య అధ్యక్షత వహించగా కోడూరు బిక్షపతి చారి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా పట్టణ అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ కు హరిప్రసాద్ చారి కృతజ్ఞతలు తెలిపారు. పభుత్వ పథకాలను నిర్ధాత్మకమైన కార్యాచరణతో అందిపుచ్చుకోవాలని మెట్టుకాడీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు.

## పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపిన సమంత

**విశ్వంభర, మహేశ్వరం/కందుకూరు :** రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ఆధ్వర్యంలో ఎన్నికైన జిల్లా అధ్యక్షులు కమిటీ సమావేశంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్ ఎన్నుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షురాలుగా కందుల సమంత ప్రకాష్ ను నియమించడం జరిగింది. నాపై నమ్మకంతో గొప్ప బాధ్యతలు ఇచ్చిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు పార్టీ బలోపేతానికి మహిళా కాంగ్రెస్ బలపడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలుగా సమ%శీ%త ప్రకాష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సమత మాట్లాడుతూ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతా రావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భారత్ ఆధ్వర్యంలో గాంధీభవన్లో నియామక పత్రం అందుకోవడం జరిగిందని తెలిపారు. నియామక పత్రం తర్వాత నియోజకవర్గం పెద్దలకు నియోజకవర్గ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డికి దేప భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి చల్ల నరసింహారెడ్డి, పారిజాత నర్సింహారెడ్డి, తీగల అనిత రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు, మహిళా నాయకురాల్లకు, శ్రేయోభిలాషులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శిగా వెంకన్న

**విశ్వంభర, ఇనుగుర్తి:** ఇనుగుర్తి మండల కేంద్రం ఇనుగుర్తి మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శిగా ఆవుల వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వద్దిరాజు రైస్ మిల్లు లో శనివారం మామిడి శోభన్ అధ్యక్షతన జరిగిన కుల సమావేశంలో తనను ఈ మేరకు ఎంపిక చేసినట్లు చెప్పారు. కులస్తుల సహకారంతో సంఘం సమస్యలు పరిష్కరిస్తామన్నారు. తన ఎంపికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలి

**విశ్వంభర, సూర్యాపేట:** 76వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం ఐడీఓసీ ప్రధాన సమావేశ మందిరం నందు జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 76వ గణతంత్ర వేడుకలను స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు నిర్వహించుటకు అధికారులు ముందు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల పై స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులతో సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, అధికారులకు, సిబ్బందికి ఉత్తమ ప్రశంసా పత్రాలు ఇచ్చుటకు గాను సంబంధిత శాఖాధిపతులు తమ సిబ్బంది పేర్లను 21తేది కల్లా పంపించాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయుచున్న 6 గ్యారంటీ పథకాల ప్రచారంపై శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, మున్సిపల్ శాఖ త్రాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జనార్దన్ రెడ్డి , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025



**విశ్వంభర, సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్ర పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025 సందర్భంగా వివిధ క్రీడల్లో జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించాల్సిన పోలీసు క్రీడాకారుల ఎంపిక లో భాగంగా జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు మెన్ అండ్ ఉమెన్ పోలీసు క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలో భాగంగా వాలీబాల్, కబడ్డీ, హై జెంప్, లాంగ్ జంప్, హై జంప్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షార్ట్ పుట్, కోకో, బ్యాట్మెటేన్, వివిధ పరుగు పందెం క్రీడల్లో జిల్లా జట్లను ఎంపిక చేసినారు. జిల్లా జట్లుగా ఎంపిక కాబడిన నల్గొండ, సూర్యాపేట జిల్లాల పోలీసు క్రీడాకారుల కు పోటీలు నిర్వహించి 5వ జోనల్ పోలీసు జట్ల ఎంపిక చేస్తారు. 5వ జోనల్ పోలీసు క్రీడాకారుల ఎంపిక కోసం 20వ తేదీ సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, డీఈఓ అశోక్, ఏఆర్ డీఎస్పీ నరసింహ చారి, ప్రభుత్వ పాఠశాలల పీటీ లు ఎంపిక ను పర్యవేక్షణ చేశారు. ఆర్ఐ నరసింహ, ఆర్ఎస్ఐ లు రాజశేఖర్, సురేష్, ఎమ్.అశోక్, కే.అశోక్, సాయిరాం, సిబ్బంది ఉన్నారు.

## సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



విశ్వంభర, రామన్నపేట: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సీపీఎం తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని సీపీఎం మండల కార్యాలయంలో రాష్ట్ర మహాసభల గోడపత్రికను రామన్నపేట మండల నాయకత్వంతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పోరాటాల సారథి సీపీఎం రాష్ట్ర మహాసభలు ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి కేంద్రంలో జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాలకు పోరాట కార్యాచరణ చేయడం జరుగుతుందని అన్నారు మహా సభల ప్రారంభ సూచికగా 25న జరిగే బహిరంగ సభకు రామన్నపేట మండలం నుండి అధిక సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బల్గూరి అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు కందుల హనుమంతు, కల్లూరి నాగేష్, మండల కమిటీ సభ్యులు గొరిగి సోములు, పట్టణ శాఖ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్, నాయకులు నీల అయిలయ్య, నాగటి లక్ష్మణ్, పల్లె సత్య నారాయణ, మేడి ముకుంద, బీంపాక ప్రశాంత్, గంజి అశోక్, కుందూరి వెంకటేశం, తరిగొప్పుల వెంకట్ రెడ్డి, గుంజ సైదులు పాల్గొన్నారు.

## నారాయణఖేడ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా


– ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** నారాయణఖేడ్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. టి.యు.ఎఫ్.డి.సి ద్వారా 50 లక్షల రూపాయల నిధులతో 3, 4 వార్డులలో పాత డి.ఎస్.పి కార్యాలయం, అలాగే టి.యు.ఎఫ్.డి.సి ద్వారా 50 లక్షల రూపాయల నిధులతో 9వ వార్డులో సాయిబాబా మందిరం, నూతన సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపెడతానని, గత పాలకుల నిర్లక్ష్యం వలన నారాయణఖేడ్ పట్టణానం పూర్తిగా అభివృద్ధికి నోచుకోలేదని, మా ప్రభుత్వంలో నారాయణఖేడ్ పట్టణాన్ని అభివృద్ధి చేసి ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మిస్తామని ఎమ్మెల్యే అన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చేస్తామని అన్నారు. పట్టణా అభివృద్ధికి మున్సిపల్ ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ , మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కర్, వైస్ ఛైర్మన్ దారం శంకర్ సెట్ వివేకానంద, రాజేష్, మాజీద్, నర్సింలు, హనుమాన్లు, సద్దాం, రామకృష్ణ, కౌన్సిలర్లు, ఈశ్వరప్ప, వీరన్న, వెంకటేష్, నాయక్ పాల్గొన్నారు.


## కార్పొరేట్ స్థాయి దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఆదర్శంగా వడియారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిలుస్తుందన్నారు. శనివారం చేగుంట మండలం వడియారం జిల్లా పరిషత్ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ముందుగా జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణాన్ని, త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, తరగతి గదులు, కిచెన్ డైనింగ్ హాల్స్ ను కలెక్టర్ పరిశీలించారు. తరగతి గదులలో ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థినీ విద్యార్థులకు పాఠాలు బోధించి సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాఠశాల వసతులు కల్పనకు సేగల్ ఫౌండేషన్ వారి సేవలు అభినందనీయమని తెలిపారు. పాఠశాలకు సెగల్ ఫౌండేషన్ వారు 40 లక్షల రూపాయలు అందించడం అభినందనీయమని అన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులను తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రశాలకు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. హాజరు శాతం మెరుగుపడితే దానికి అనుగుణంగా ఫలితాలు ఉంటాయన్నారు. ప్రణాళికమైన ప్రత్యేక తరగతులు, ఫెయిల్ అయ్యే స్టూడెంట్స్ పై ప్రత్యేక శ్రద్ధ, 10/10 సాధించే విద్యార్థుల సంఖ్య పెంపు యావరేజ్, బిలో యావరేజ్ స్టూడెంట్ పై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రణాళికలు రూపొందించడం ద్వారా ఉత్తమ విద్యా బోధన అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వడియారం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల అర్హుల సర్వే పై జిల్లా కలెక్టర్ సమీక్ష



**విశ్వంభర, భూపాలపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించడానికి క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న సర్వేపై శనివారం రెవెన్యూ, పంచాయతీ రాజ్, మండల ప్రత్యేక అధికారులతో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో తప్పులు లేకుండా భాద్యతగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి లబ్ధిదారుని వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైన డేటాను సక్రమంగా నమోదు చేయాన్నారు. క్షేత్ర స్థాయి విచారణలో సమగ్రమైన ఖచ్చితమైన సరైన డేటాను సేకరించాలని అన్నారు. టీములు ప్రజలతో నేరుగా మమేకమై సమగ్ర సమాచారం సేకరించాలని, ప్రజలకు ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకూరేలా చూడటమే మన కర్తవ్యమని కలెక్టర్ సూచించారు. రైతు భరోసా పథకం ద్వారా చిన్న, సన్న కారు రైతులకు వ్యవసాయ యోగ్యమైన భూములకు ఆర్థిక సహాయం అందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన రైతులకు లబ్ధి చెకూర్చేందుకు సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టాయని తెలిపారు. వ్యవసాయానికి పనికిరాని భూముల వివరాలను నమోదు చేయాలన్నారు. సర్వే 20 వరకు పూర్తి చేయాల్సి ఉన్నదని, వేగం పెంచాలని సూచించారు. సర్వే పూర్తిగా పారదర్శకంగా ఉండాలన్నారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చూడాల్సిన భాద్యత మనపై ఉందని జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రానున్న రెండు రోజులు మండల ప్రత్యేక అధికారులు సర్వే పై మరింత ఫోకస్ చేయాలని సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ల అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, భూపాలపల్లి ఆర్డీఓ రవి, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు తహసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**విశ్వంభర, భీమదేవరపల్లి:** భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వీరభద్రస్వామి ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే కి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు వేద మంత్రోచరణలతో స్వామి వారి ఆశీర్వచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే స్వగృహానికి మల్లికార్జున అప్పాజీ



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహానికి కర్ణాటక రాష్ట్ర ప్రసిద్ధి చెందిన శ్రీ మల్లికార్జున్ అప్పాజీ విచ్చేసి ప్రవచనాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పాజీ మన నారాయణఖేడ్ నియోజకవర్గానికి రావడం ఎంతో సంతోషంగా ఉందని వారి ఆశీస్సులు మన నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని వారిని కోరుతున్నా మని అన్నారు. అర్ధరాత్రి అయినా అప్పాజీ కోసంభారీ ఎత్తున ప్రజలు వేచి ఉన్నందుకు ప్రజలకు యువకులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్లోళ్ల అనుపమ సంజీవరెడ్డి దంపతులు, పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సుధాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల లోకేష్ రెడ్డి, యువ నాయకులు, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పాల్గొని అప్పాజీ కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గం లోని అప్పాజీ భక్తులు, ఎమ్మెల్యే అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పెద్ద ఎత్తున పాల్గొనీ అప్పాజీ ఆశీర్వాదం తీసుకున్నారు.

## అయ్యగారు పల్లి మున్నూరు కాపు సంఘం ఎన్నిక

**విశ్వంభర, ఇనుగుర్తి:** ఇనుగుర్తి మండలంలోని అయ్యగారి పల్లి గ్రామ కాపు సంఘం అధ్యక్షులుగా మలిశెట్టి రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బోళ్ల కృష్ణ, మెట్టు రాజు, ప్రధాన కార్యదర్శి చీకటి స్టాలిన్, సహాయ కార్యదర్శి మామిడి కిరణ్, కోశాధికారి మలిశెట్టి శోభన్ లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవ సలహాదారుగా మామిడి శోభన్, మద్దికుంట్ల వెంకన్న, మలిశెట్టి శ్యామ్,మామిడి జనార్ధన్, సోషల్ మీడియా కన్వీనర్ గా మలిశెట్టి నాగార్జున, సంఘం యూత్ అధ్యక్షులుగా మద్దికుంట్ల శ్రీకాంత్, పెండెం శేఖర్లను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రవి మాట్లాడుతూ.. సంఘం సమస్యలను అందరి సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తన ఎంపికకు సహకరించిన గాయత్రి గ్రూప్స్ అధినేతలు వద్దిరాజు కిషన్, ఎంపీ రవిచంద్ర, సోదరులకు, జిల్లా, మండల అధ్యక్షులతో పాటు నాయకులు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ఎమ్మెల్యే కసిరెడ్డి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, ఆమనగల్లు:** కల్వకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. మొదటగా కర్మాంఘాట్ లోని హనుమాన్ దేవాలయంలో సతీ సమేతముగా దర్శనం చేసుకొని నియోజకవర్గంలోని కడ్తాల్ మండలంలోని మైసిగండి మైసమ్మ దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కడ్తాల్, తలకొండపల్లి, కల్వకుర్తి, వెల్దండ, ఆమనగల్లు, మాడుగుల మండల కేంద్రాల్లో పర్యటించి కార్యకర్తల మధ్య కేకు లు కట్ చేసి పేదలకు పండ్లు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పడకల్ గ్రామంలో, కల్వకుర్తి క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఆమనగల్లు పట్టణంలో పేదలకు దుప్పట్లు, రగ్గులు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు చూపుతున్న ఆదరాభిమానులను జీవితంలో మరువలేనని తన జీవితం కల్వకుర్తి ప్రజలకే అంకితం అని నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, మార్కెట్ ఛైర్మన్ మనీలా సంజీవ్ కుమార్, యాట గీత నరసింహ, సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి, బట్టు కిషన్ డ్డి, బిచ్చ నాయక్, జగన్, మంగ్లీ రాములు మాజీ ఎంపీపీ అనిత విజయ్, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలుగు సాహిత్యంలో రాధేయ కలం పేరుతో ప్రసిద్ధుడైన కవి రాచమళ్ళ దేవయ్య . రాధేయుని వలనే సాహిత్య యుద్ధభూమి లో మనువాద భావజాలంపై పోరాడిన సాహితీయోధుడు. తాను వృత్తిరీత్యా వ్యవసాయ శాఖలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేసి రిటైర్ అయ్యారు. నల్లగొండ సమీపంలోని నర్సింగ్ భట్ల అనే గ్రామంలో 25 అక్టోబర్, 1943 సంవత్సరంలో లచ్చమ్మ లచ్చయ్య దంపతులకు జన్మించారు. వీరు బాల్యం నుండే పద్య కవిత్వం రాస్తున్నారు.ప్రవృత్తి రీత్యా ఎం.ఏ తెలుగు చేసి సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో మేలిమి రచనలు చేసి చిరస్థాయిగా నిలిచిపోయారు.

# నిత్య చైతన్యం రాధేయ సాహిత్యం

వీరు ఉదయరాగం (గేయ కవితలు ) , సులోచన (పద్య కావ్యం ),నగ్న సత్యాలు (మినీ కవితలు), మాతృమూర్తి (పద్య కావ్యం ), అంబేద్కర గీత (పద్య గేయ వచన కవితల సమ్మేళనం ), పద్య మణిమాల (రాధేయ పద్య కవితలు), భారతరత్న అంబేద్కర్ శతకం, అంబేద్కర మహా బౌద్ధ యానం మొదలైన రచనలు చేశారు. 1979లో తన తొలి గ్రంథం 'ఉదయరాగం ' ఆవిష్కరించారు. వీరు పాఠశాల స్థాయిలోనే పూరి గుడిసెలో పుట్టిన వాడా / ఊరికి వెలుపల ఉండేవాడా / చదువుకుంటే సౌఖ్యమురో రన్నో చిన్నన్న / మన అంబేద్కరుడే సాక్ష్యంరో రన్నో పెద్దన్నా " అంటూ రాసిన తొలి గీతమే ఎంతో ప్రసిద్ధి చెందింది.

మాతృమూర్తి పట్ల గౌరవభావంతో పద్య కావ్యాన్నే రాయడం వల్ల తెలుగు సాహిత్యంలో మాతృకవిగా ప్రసిద్ధుడయ్యాడు. తన తల్లి లచ్చమ్మ పేరుతో ప్రతి సంవత్సరం స్మారక పురస్కారాన్ని సాహిత్యంలో కృషి చేసిన వారికి ప్రదానం చేసేవాడు. ఇప్పుడు ఆ బాధ్యతను కుటుంబ సభ్యులు నిర్వర్తిస్తున్నారు.

తాను జీవించినంత కాలం సాహిత్య సృజనకే అంకితం అయ్యారు. వీరు నిత్య సాహిత్య కృషీవలురు. జీవితాంతం అంబేద్కరిస్టుగా ఉండి తన సాహిత్య రచనల ద్వారా అంబేద్కర్ భావాజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాడు. అందుకే అంబేద్కర్ పై మూడు గ్రంథాలను వెలువరించారు. ఈ మూడు గ్రంథాలు కూడా బహుముఖ ప్రజ్ఞాశాలి , జ్ఞాన భాస్కరుడు అంటూ తన ఆత్మీయతను చాటుతూ అంబేద్కర్ భావజాలానికి అంకితమైన ఆచార్య ఎం. ఎన్ భూషి గారికి అంకితం ఇచ్చారు. ముఖ్యంగా భారతరత్న అంబేద్కర శతకాన్ని పుస్తకాన్ని పరిశీలిస్తే ఇది 2005 సంవత్సరంలో ప్రచురింపబడింది. తెలుగు సాహిత్యంలో శతక సాహిత్యానికి వందల ఏళ్ళ చరిత్ర కలిగి ఉంది. శతకం ప్రజల్లోకి సులభంగా వెళ్లగలదు. వేమన శతకం ఆనాటి సమాజ పరిస్థితులకు దర్పణం అయ్యింది. ఈ శతక పద్యాలను వినని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి ఏమాత్రం కాదు. సుమతీ శతకం, బద్దెన శతకం ఇంకా అనేక శతకాలు చిరస్థాయిగా నిలిచిపోయాయి.కొన్ని శతకాలు సమాజ చైతన్యానికి దోహదపడ్డాయి. అలాంటి కోవలోకి చెందినదే ' భారతరత్న అంబేద్కర శతకం ' . ఇందులో మొత్తం 124 సీస పద్యాలు ఉన్నాయి. శతకానికి మకుటం ప్రాణం అంటారు. కవి రాధేయ తన పద్యాలన్నీటికి మకుటంతో ప్రాణం పోశారు. ' పూజ్య అంబేద్కరా! నిన్ను పుడమిలోన/ మరిచిపోయెడి వాడింక మనుజుడౌనె?

అంబేద్కర్ పట్ల ఎంత ఆరాధనా భావం ఉన్నదోఈ మకుటం చూస్తే అర్థమవుతుంది. ఈ భూమిపైన నిన్ను మర్చిపోయేవాడు (డా.అంబేద్కర్ ను ) మనిషి ఎట్లా అవుతడని ప్రశ్నిస్తున్నాడు కవి. తరతరాలుగా విద్యను నిరాకరించిన అట్టడుగు వర్గంలో పుట్టి, తాను అక్షరాలు నేర్చుకున్న ఫలితంగా బిక్ష పెట్టిన అంబేద్కర్ మహనీయునికే నివాళిగా అర్పించడం వల్ల అక్షరం పునీతమైందని ప్రొఫెసర్ ననుమాస స్వామి ఈ పుస్తకానికి తన ముందు మాటలో రాశారు . అలాగే ప్రతి పద్యానికి ఒక శీర్షిక పెట్టడం విభిన్నంగా ఉంది. 16 పద్యంలో ఈ విధంగా ఉంది. "మనిషి మనుగడ నివ్వని మతమును వదలిపెట్టాలి."

కులపు గోడలు కట్టి కలతలు సృష్టించు /
మతము నీదని చెప్పు టితవు గాదు /
మనిషి మనుగడ కోరని మతమదేల?/
అట్టి మతమును త్యజియించు దనిన బాల.

సాటి మనిషిని మనిషిగా చూడని మతం ఎందుకని? అలాంటి మతాన్ని వదిలివేయమని బాబాసాహెబ్ చెప్పాడంటాడు. చెప్పడమే కాదు డాక్టర్ అంబేద్కర్ 1956 సంవత్సరంలో 6 లక్షల మంది అనుచరులతో హిందూ మతాన్ని వదిలేసి బౌద్ధాన్ని స్వీకరించాడు.

26వ పద్యంలో 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అనే శీర్షిక పెట్టాడు. ఆ పద్యంలో ఇలా అంటాడు.

ప్రజలహితవు గోరు బహు గ్రంథకర్తవు /జ్ఞాననిధివి వివేకి వీవు / న్యాయమూర్తివి, పేదల నాయకుడవు / మానవాకృతి గల పరమాత్మ వీవు అంటూ అంబేద్కర్ను తన మేధస్సును పేదవాళ్ళ కొరకే ఉపయోగించిన నిస్వార్థ జీవి యని కొనియాడుతూ తెలుగు సాహిత్య ప్రపంచానికి గొప్పగా పరిచయం చేశాడు. అంబేద్కర్ శతక గ్రంథం రాసేటందుకు రాధేయ గారు 27 ఉపయుక్త గ్రంథాలను అధ్యయనం చేసి రాశాడు. ఎంతో విస్తృతమైన అధ్యయనం ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. తాను ఏది రాసినా పరిశోధనాత్మకతంగా ఆధారాలతో చూపి రాశాడు.

2011 సంవత్సరంలో ' అంబేద్కర మహా బౌద్ధ యానం' సచిత్ర గేయకవితా కావ్యం వెలువరించారు. ఈ గ్రంథాన్ని మూడు విభాగాలుగా విభజించారు. ప్రథమ విభాగంలో సిద్ధార్థుని జీవనయానం, ద్వితీయ విభాగంలో బుద్ధుని బోధనలు, తృతీయ విభాగంలో బుద్ధుని గీతాలు. సిద్ధార్థుని బాల్యం మొదలు అంతిమంగా బోధనలు. ఈ సారాంశాన్ని తీసుకుని కవి పాఠకులకు అందించాడు. అంటే పరోక్షంగా డా. అంబేద్కర్ బౌద్ధ మతంలోకి ప్రయాణం ఎందుకు కొనసాగించాడో బౌద్ధ మత విశిష్టతను చెప్పాడు. గౌతమ బుద్ధుడు ప్రాచీన కాలంలోనే సర్వసమానత్వాన్ని కోరుకున్నాడు. కుల సమాజాన్ని నిరసించాడు. రాధేయగారు ఏది రాసినా అధ్యయనంతోనే రాశారు. వీరి సాహిత్య సేవలకు అంబేద్కర మహోద్యమ విప్లవ సాహిత్య రత్న పురస్కారం, గుర్రం జాషువా సాహిత్య పురస్కార గ్రహీత అందుకున్నారు.

**నేటి తరం అధ్యయనం చేయాలి..**

రాధేయ రచనలన్నింటిని నేటి తరం అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే స్ఫూర్తి పొందుతారు. అంబేద్కర్ను అత్యంత గౌరవించే వాళ్ళందరూ రాధేయ సాహిత్యాన్ని ఈనాటి రాబోయే తరాలకు అందించే ప్రయత్నం చేయాలి. వీరు మరణించిన తర్వాత వారి కుటుంబ సభ్యులు మాతృకవి రాధేయ స్మారక పురస్కారం, మాతృమూర్తి రాచమల్ల లచ్చమ్మ పురస్కారం ప్రతి సంవత్సరం బహుకరిస్తున్నారు. ఈ సందర్భంగానైనా మాతృకవి రాధేయ ( రాచమళ్ళ దేవయ్య) గారి సాహిత్యాన్ని అధ్యయనం చేసే అవకాశం కొంత మేరకైనా కలుగుతుంది. ఈ ప్రయత్నం గాక రాధేయ సాహిత్యాన్నంతా సమగ్ర సాహిత్యంగా రూపొందిస్తే ముందు తరాలకు అందించడమే గాక వీరి సాహిత్యం పై పరిశోధన చేసేటందుకు అవకాశం కల్పించినట్లు అవుతుంది. అలాగే తెలంగాణ పాఠ్య పుస్తకాల్లో కూడా వీరి సాహిత్యానికి చోటు కల్పించాలి. కవిగా, రచయితగా చిత్రకారుడిగా బహుముఖ పార్శ్వాలతో సాహితీ జగత్తుకు విశేష సేవలు అందించిన ఈ కవికి ఇప్పటికే రావలసినంత గుర్తింపు రాలేదు.

ఇప్పటికైనా అంబేద్కర్ ఆలోచన విధానం అనుసరించే, దళిత సాహిత్య స్పృహ ఉన్నవాళ్లంతా రాధేయ సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్తారని ఆశిద్దాం. ఆదివారం నల్లగొండలో

రాచమళ్ళ లచ్చుమ్మ పురస్కారాన్ని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ ఆచార్య సూర్య ధనుంజయ్ కి, మాతృకవి రాధేయ స్మారక పురస్కారం ప్రముఖ సాహితీవేత్త డా. చింతోజు మల్లికార్జున్ కి అందించనున్నారు. పురస్కార గ్రహీతలకు శుభాకాంక్షలు అందిస్తూ రాధేయ కవిత్వాన్ని మరింతగా హత్తుకుని సమాజంలో విస్తృతం చేద్దాం.



- పెరుమాళ్ళ ఆనంద్
సృజన సాహితీ అధ్యక్షులు నల్లగొండ
9985389506


---

ప్రజాకవి తాత్వికుడు తేలికైన పదాలతో అనుభవాలకు అక్షర రూపం కల్పించి, అలవోకగా ఆట వెలదులను రాసి, పండిత పామరులు మెప్పించిన కవివర్యులు యోగివేమన. లోకనీతులు సామాజిక చైతన్యంతో సమాజ మార్పుకోసం ఆరాటపడిన అచ్చమైన తెలుగు కవి. వేమన సర్వ సౌభాగ్యాలను ఆడంబరాలను త్యజించి తాను తెలుసుకున్న వేదాంత రహస్యాలను జీవిత ధర్మాలను ఉత్తమ మార్గ విధానాలను ప్రజలందరికీ తెలియజేయడానికి దేశమంతా సంచరించారు. వానకు తడవని వారు, వేమన పద్యం నోటికి రానివారు ఉండరని లోకోక్తి.

# సమాజ చైతన్య దీప్తి యోగి వేమన

**ప్రజాకవి, సంఘసంస్కర్త .. వేమన రాసిన పద్యాలు తెలుగు వారికి సుపరిచితాలు**

**తన పద్యాల ద్వారా లోక నీతి చెప్పిన మహాఘనుడు ○ నేడు ఆయన జయంతి**



సాహితీ లోకంలో 'వేమన' అనే పేరు వినని వారు ఉండరు. వానకు తడవని వారు, ఒక్క వేమన పద్యం కూడా వినని తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో!. సామాజిక చైతన్యం వేమన పద్యాల ముఖ్య లక్షణం. వేమన తన పద్యాలలో స్పృశించని అంశం లేదు. సమాజంలోని అన్ని సమస్యలపై భిన్న కోణాలలో నుంచి దర్శించి ఆదర్శన వైశిష్ట్యాన్ని ప్రదర్శించాడు. తన పద్యాలలో ఆనాటి కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరిట జరుగుతున్న దోపిడీలు, విగ్రహారాధన నిరసించడం, కుహనా గురువులు, దొంగ సన్యాసులు ఒకటేమిటి కనిపించిన ప్రతి సామాజిక సమస్యల పైన తన కలం ఝులిపించాడు. వేమన జీవితం పై ఎంతోమంది పరిశోధకులు కృషి చేసినా ఆయన చరిత్ర అస్పష్టంగానే ఉంది.

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు మొదటగా వెలుగులోకి వచ్చాయి. పండితులకు మాత్రమే కాదు పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి ప్రజల్ని మెప్పించిన కవి యోగివేమన. అలతి అలతి పదాలతో ఆయన రాసిన ఆట వెలది పద్యాలు ప్రజల నాలుకలపై నేటికీ నిలిచిపోయినవి. అనంతమైన నీతి విలువలు, సలహాలు సూచనలతో కూడిన ఆభరణాలే వేమన పద్యాలు. 1367-1478 మధ్యకాలంలో వేమన జీవించినట్లుగా తెలుస్తుంది. ఈయన జీవిత కాలం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వేమన కొండవీటి రెడ్డి రాజ్య వంశానికి చెందినవాడు. కడప జిల్లాలోని ఒక చిన్న పల్లెలోని మధ్యతరగతి కాపు కులంలో నందన నామ సంవత్సరం ఆశ్వయిజ శుద్ధ పౌర్ణమి రోజున జన్మించాడని అంటారు. వేమన అసలు పేరు చిన కోమటి వేమారెడ్డి. ఈయన యవ్వనంలో వేశ్యాలోలుడిగా జీవించాడు. కొంత కాలానికి విరక్తి చెంది తపస్సు చేసి యోగిగా మారాడు. సమాజానికి హితబోధ చేస్తూ వేలాది పద్యాలు చెప్పాడు. వేమన పద్యాలలో ప్రజల జీవితం ఉంది. అతని జీవితానికి సంబంధించి కింది పద్యాలు ముఖ్యంగా ఉదాహరిస్తారు.

నందన సంవత్సరమున; పొందుగ/
కార్తీకమందు పున్నమి నాడీ/
వింధ్యాద్రి సేతువులకును, నందున నొక వీరు / దేరుపదేరా వేమా "
ఊరుకొండ వీడు వునికి పశ్చిమ వీధి; మూగచింతపల్లె మొదటియిల్లు
ఎడ్డి రెడ్డి కులం యేమని చెప్పుదు;
విశ్వదాభిరామ వినురవేమ!

వేమన గొప్ప ప్రజాకవి. సంఘసంస్కర్త. "విశ్వదాభిరామ వినురవేమ!" అనే మకుటంతో అతడు రాసిన పద్యాలు తెలుగు వారికి సుపరిచితాలు. వేమన ఏ కులానికి చెందినవాడు అనేదానికి భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, కొండవీడును పరిపాలించిన రెడ్డి వంశస్తులకు చెందినవాడని చాలామంది అభిప్రాయం. సి పి బ్రౌన్ కృషి ద్వారా వేమన పద్యాలు1839 లో పుస్తక రూపంలో తొలిసారిగా వెలుగులోకి వచ్చాయి. నిరక్షరాస్యులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు రాసి ప్రచారం చేసి ప్రజల్ని మెప్పించాడు. హైదరాబాదులోని ట్యాంక్ బండ్ మీద ఉన్న వేమన విగ్రహం శిలాఫలకంపై ఈ విధంగా రాసి ఉంది.

"ఆట వెలదిని ఈటెగా విసిరిన దిట్ట / చాంధస భావాలకు తొలి అడ్డుకట్ట".

ఈ ఒక్క వాక్యం చాలు ప్రజా కవి యోగి వేమన గురించి తెలుసుకోవడానికి.

**వేమన పద్యాల తీరు..**

వేమన తన పద్యాలన్నీ ఆట వెలది చందంలోనే చెప్పాడు. ఎంతో లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో చక్కటి ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా చెప్పాడు. వేమన సాధారణంగా మొదటి రెండు పాదాలలో నీతిని ప్రతిపాదించి, మూడో పాదంలో దానికి తగిన సామ్యం చూపిస్తాడు. ఉదాహరణకు ... అల్పుడెప్పుడు బలుకు నాడంబరముగాను / సజ్జనుండు పలుకు చల్లగాను / కంచు మ్రోగినట్లు కనకంబు మ్రోగునా/ విశ్వదాభిరామ వినురవేమ!

కొన్ని పద్యాలలో ముందే సామ్యం చెప్పి తర్వాత నీతిని చెప్పాడు. ఉదాహరణకు ....

అనగననగా రాగ మతిశయించు నుండు / తినగ తినగ వేము తియ్య నుండు / సాధనమున పనులు సమకూరు ధరలోన / విశ్వదాభిరామ వినురవేమ!

నాలుగో పాదం "విశ్వదాభిరామ వినురవేమ!" అనే మకుటం ఈ మకుటానికి అర్థం పై కూడా రెండు వాదనలు ఉన్నాయి.

వేమన ఆలనా పాలనా చూసిన ఆయన వదిన విశ్వధను, ఆయన ఆప్తమిత్రుడు అభిరాముడిని మకుటంలో చేర్చి వారికి శాశ్వతత్వాన్ని ఇచ్చాడని ఒక వాదన ఉంటే...

విశ్వద అంటే విశ్వకారుడికి, అభిరామ అంటే ప్రియమైన వాడని.. అంటే సృష్టికర్తకు ప్రియమైన నేనూ, వినుము - అని పండితులు మకుటానికి మరో అర్థం చెప్పారు. బ్రౌన్ ఈ రెండో అర్థాన్ని తీసుకుని వేమన పద్యాలను ఇంగ్లీషులోకి అనువదించాడు.

**వేమన మానవతావాదం**

వేమన మానవుని హీన స్థితికి కారణమైన వ్యవస్థలపై తన పద్యాలతో తిరుగుబాటు బావుట ఎగురవేశాడు .

**ఉదాహరణ...**

చంపదగిన యట్టి శత్రువు తన చేత
చిక్కనేని కీడు సేయరాదు
పోసగ మేలు చేసి పొమ్మనుటే మేలు
విశ్వదాభిరామ వినురవేమ!

పై పద్యంలో మానవతా ధర్మం గురించి చక్కగా చెప్పాడు. శత్రువు సైతం తన చేతికి చిక్కినప్పుడు ఇలాంటి కీడు చేయకుండా విడిచిపెట్టాలని సూచించాడు. గొప్ప యుద్ధనీతిని ఇందులో ప్రదర్శించాడు.

**అలాగే...**

ఉర్వి వారి కెల్లా నొక్క కంచం బెట్టి
పొత్తు గుడిపి పొలము కలయజేసి
తలను చెయ్యి బెట్టి తగనమ్మ జెప్పరా
విశ్వదాభిరామ వినురవేమ! అనే పద్యంలో సర్వ మానవ సమానత్వం గురించి ప్రపంచానికి చాటాడు.

మాల వాని నుండి మరి నీట మునిగితే
కాటికేగునప్పుడు కాల్చు మాల
ప్పుడంటినంటు ఇప్పుడెందేగినో
విశ్వదాభిరామ వినురవేమ!

అను పై పద్యంలో కుల విచక్షణలోని డొల్లతనం గురించి చాలా చక్కగా చెప్పాడు.

నైతికత్వం గురించి ఇంకో పద్యంలో ఇలా చెప్పాడు.

ఇంటి యాలి విడిచి ఇలా జారకాంతల
వెంట దిరుగువాడు వెర్రి వాడు
పంట చేను విడిచి పరిగె ఏరినట్లు
విశ్వదాభిరామ వినురవేమ!

అట్లాగే వేమన మూఢనమ్మకాలను కూడా చీల్చి చెండాడాడు. ఈ క్రింది పద్యంలో..

పిండములను చేసి పితరుల తలబోసి
కాకులకును పెట్టు గాడిదెల్లారా
పియ్యి దినేడు కాకి పితరుడెట్లయ్యారా
విశ్వదాభిరామ వినురవేమ!

సంఘసంస్కరణను ప్రబోధించే సర్వ మానవ సమానత్వం, అస్పృశ్యత ఖండన, నైతిక ప్రబోధం, మూఢనమ్మకాల ఖండన, ఆర్థిక భావాలను సూచించే పై పద్యాలను బట్టి వేమనను గొప్ప మానవతావాదిగా చెప్పవచ్చును. వేమన పద్యాలను గనుక పరిశీలించినట్లయితే వేమన్న గ్రామీణ కవి. గ్రామ జీవన రీతి వేమన స్వభావానికి పూర్వ రంగమైంది. సహజ సుందరమైన పల్లెటూరి చల్లదనంలో వేమన పద్యాలు దిద్దుకున్నాడు. పల్లె సీమ వాతావరణాన్ని దాటిన వేమన పద్యం ఒక్కటి కూడా కనిపించదు. పల్లెలోని పిల్ల బాటలే గాని పట్టణాల వైపు దారి తీసే సంఘటనలు తన పద్యాలలో మచ్చుకైనా కానరావు.

అయితే స్త్రీల గురించి చెప్పవలసి వచ్చినప్పుడు వేమన సంప్రదాయ వాదిగానే ముద్దించబడ్డాడు. ఇది ఒక మచ్చగానే మిగిలింది. అందుకు ఉదాహరణలుగా ఈ క్రింది పద్యాలు చూద్దాం.

ఆలి తొలుత వంచ కధముడైతా వెనుక
వెనుక వంతు ననుట వెర్రి తనము
చెట్టు ముదరనిచ్చి చిదిమితే బోవునా
విశ్వదాభిరామ వినురవేమ.

అంటే... "భార్యను తొలిగానే అదుపులో పెట్టుకోవాలి. తర్వాత అదుపులో పెట్టుకోవచ్చులే అనుకొనుట వెర్రి తనం. చెట్టు పెద్దదైన తర్వాత సులభముగా పీకలేము " అని దీని తాత్పర్యం.

పతిని విడవరాదు పదివేలకైనను
బెట్టి జెప్ప రాదు పేద కైన
పతిని తిట్టరాదు సతిరూపవతి యైన
విశ్వదాభిరామ వినురవేమ.

ఈ పద్యంలో " భర్తను ఎప్పుడూ విడువకూడదు. పేదవాడికి దానం చేసి ఎవరికి చెప్పకూడదు. అందమైన రూపం గల భార్య భర్తని తిట్టకూడదు " అని దీని భావన.

ఈ విధంగా సరళమైన పదాలతో సమాజంలోని రుగ్మతలను తూర్పార పట్టిన మనోవైజ్ఞానికుడు మన వేమన. సమకాలీన వ్యవస్థలపై తిరుగుబాటు బావుటా ఎగరవేసిన సంఘసంస్కర్త. సమ సమాజ స్థాపన కొరకు కృషి చేసిన గొప్ప విప్లవకారుడు. మొదట బోగి గా ఉన్న వేమన తదుపరి తపస్సు చేసి యోగిగా మారాడు. సమాజానికి హిత బోధతో వేలాది పద్యాలు రాసి వాడవాడలో తిరుగుకుంటూ ప్రచారం చేస్తూ చివరకు కడప దగ్గర పామూరు కొండ గుహలో శార్వరి నామ సంవత్సరం శ్రీరామనవమి నాడు కదిరి తాలూకా లోని కటారు పల్లెలో వేమన సమాధి పొందాడు. అనేకమంది ఆయన పద్యాల పై పరిశోధన చేశారు. వేమనను గూర్చి పరిశోధించడం అంటే ఏదో ఒక ప్రత్యేక రంగంలో శిక్షణ పొందిన వ్యక్తి చేయగలిగిన కార్యం కాదు. పెక్కు రాత ప్రతులను చూచి పద్యాలు అన్నిటిని పరిశీలిస్తే వేమన సిద్ధాంతాలను నికరంగా ఏర్పరచడం కష్టం. ప్రముఖ పాత్రికేయులు నార్ల వెంకటేశ్వరరావు కేంద్ర సాహిత్య అకాడమీ వారి సహకారంతో వేమన జీవిత చరిత్రను 14 భాషల్లోకి అనువదించడానికి విశేష కృషి చేశారు. ఆంగ్ల,ఐరోపా భాషల్లోకి, అన్ని ద్రావిడ భాషలలోకి వేమన పద్యాలు అనువాదమయ్యాయి. సి. ఇ.గోవర్ వంటి ఆంగ్ల సాహితీవేత్తలు వేమన సాహిత్యానికి ముగ్ధులై ఆయనను లోకకవిగా కీర్తించారు. వేమనకు లభించిన గౌరవం మరే తెలుగు కవికి లభించలేదు. ఐక్యరాజ్యసమితి యునిస్కో విభాగం ప్రపంచ భాషా కవులలో గొప్ప వారిని ఎంపిక చేసే సందర్భంలో వేమనను ఎన్నుకొని ఆయన రచనలను పలు భాషల్లోకి అనువదింప జేశారు. వేమన జీవితంపై కూడా అనేక సినిమాలు తీశారు. యోగివేమన సీరియల్ టీవీ ఛానల్ లో ప్రసారమైంది. ఆ మహాకవి పేరిట నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కడప జిల్లాలో యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడం ముదావహం. యోగి వేమన జయంతిని ప్రతి యేట జనవరి 19న ప్రజలు ఘనంగా నిర్వహిస్తున్నారు . ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సాహిత్య అభిమానులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు వేమన జీవితం, ఆయన రాసిన పద్యాలు స్ఫూర్తిదాయకం.



- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
9441561656

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ

**కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్**



**విశ్వంభర, సంగారెడ్డి:** నియోజకవర్గం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తామంతా నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్నామని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద బడుగు బలహీన వర్గాల వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నామని పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కష్టకాలంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొంది, అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలకు కాట శ్రీనివాస్ గౌడ్ నివాసంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

## అర్హులైన వారికే తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలి

**బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం ఋషికేష్**



**విశ్వంభర, షాద్ నగర్:** నెలకి లక్ష రూపాయలు ఆదాయం, సొంత బంగ్లా, ఆర్థికంగా బలమైన వారు తెల్ల రేషన్ కార్డుకు అనర్హులు కావున నిజమైన ఆర్థికంగా వెనుకబడిన వారికి మాత్రమే తెల్లరేషన్ కార్డులు అందినప్పుడే మన దేశం మరియు సమాజం సరైన దారిలో వెళుతుంది. అనర్హులు తెల్ల రేషన్ కార్డులు పొందడం వల్ల అర్హులైన వారికి ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలు అందకపోగా ప్రభుత్వం యొక్క వ్యవస్థ పాడవుతుంది. అసలు తెల్ల రేషన్ కార్డు అర్హులు ఎవరో ప్రభుత్వాధికారులు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. కొత్తగా తెల్ల రేషన్ కార్డులు ఇస్తాము అనగానే ప్రతి ఒక్కరూ అప్లై చేసుకోవడానికి రెడీగా ఉంటారు. కానీ ఎవరైతే ఆర్థికంగా వెనుకబడి, దారిద్ర్యపు రేఖ కు దిగువన ఉన్న వారు రేషన్ కార్డుకు అర్హులు ఒక ఇంట్లో ఒక వ్యక్తి 2 లక్షల రూపాయల వార్షిక ఆదాయాన్ని మించకుండా ఉన్నవారే తెల్ల రేషన్ కార్డుకు అర్హులు. కావున కొత్త తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేసే ముందు సరైన పద్ధతిలో ఎంక్వైరీ చేసిన తర్వాతనే రేషన్ కార్డులు మంజూరు చేయాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నట్టుగా బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం ఋషికేశ్ తెలియజేశారు.

## ఘనంగా ఆంజనేయ స్వామి పల్లకీ సేవ

**కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం**



**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన బి లింగమయ్య గౌడ్ రూ. 1500 లు, లక్ష్మి కృష్ణారెడ్డి వెయ్యి రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారిని పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దేవాలయ అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పులిమామిడి శ్రీశైలం గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం గౌడ్, జి.వసంతరావు, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, మంచిరేవుల అశోక్, రఘునందన్ రెడ్డి, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మికాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకరయ్య, వీఆర్వో బచ్చన్న, యాదగిరి, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలి

**జిల్లా ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణారెడ్డి**



**విశ్వంభర, భూపాలపల్లి:** ఈ నెల 20 లోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలని భూపాలపల్లి జిల్లా ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి శివారు, భూపాలపల్లి మండలం సుభాష్ కాలనిలో జరుగుతున్న రైతు భరోసా, ఆహార భద్రతా కార్డుల విచారణ ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. తనిఖీ లో నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరేలా చేస్తున్న ఈ సర్వేలో అర్హులైన ఏ ఒక్కరు మిస్ కావొద్దని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ది చేకూర్చేందుకు వీలుగా అధికారులు క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియను ఈ నెల 20వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. పలు సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం అర్హులను గుర్తించేందుకు సర్వే బృందాలు ఇంటింటికి తిరుగుతూ వివరాలను పరిశీలిస్తున్నారని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనలో సేకరించిన వివరాలను రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు . క్షేత్రస్థాయి విచారణ ఈ నెల 20వ తేదీ వరకు పూర్తి చేయాలని, 21 నుండి 24 వరకు గ్రామసభలు నిర్వహణకు సన్నద్ధం కావాలని అన్నారు. ఎలాంటి పొరపాటుకు తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో క్షేత్రస్థాయిలో విచారణ కొనసాగుతోందని తెలిపారు. ముఖ్యంగా రైతు భరోసా పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు లబ్ది చేకూర్చేందుకు వీలుగా సాగుకు యోగ్యమైన భూములను సర్వే నెంబర్ల వారీగా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఆహార భద్రతా కార్డులకు అర్హత కలిగిన కుటుంబాలకు అందించేందుకు వీలుగా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విచారణ బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్నాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీ నాటికి ఆయా పథకాల కింద అర్హులైన వారి జాబితాలను రూపొందించి, 21 నుండి 24 వరకు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణలో నిర్వహించనున్న గ్రామ సభలలో జాబితాను చదివి వినిపించడం జరుగుతుందన్నారు. గ్రామ సభ ఆమోదం మేరకు లబ్ధిదారుల వివరాలను సంబంధిత పోర్టల్ లో నమోదు చేస్తామన్నారు. ఈ నెల 26 వ తేదీన ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు శ్రీకారం చుట్టి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చనుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాధ్, గణపురం, భూపాలపల్లి తహసీల్దార్లు సత్యనారాయణ స్వామి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**విశ్వంభర, షాద్ నగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలైన ఆహార భద్రతా కార్డు (రేషన్ కార్డ్,)లు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు లాంటి సంక్షేమ పథకాలలో అర్హులను గుర్తించి పారదర్శకంగా జాబితాలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సూచించారు. శనివారం నందిగామ మండలం అప్పారెడ్డి గూడ, వీర్లపల్లి, మామిడిపల్లి గ్రామాలలో సర్వేలలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట ఎండీఓ సుమతి, ఎంపీఓ తేజసింగ్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, జిల్లెల్ల రామ్ రెడ్డి, కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, దేపల్లె కుమారగౌడ్, ఆగీర్ రవికుమార్, పసుల బుచ్చయ్య, జాలగూడెం రాజు,సి నర్సింలు,నవీన్ కుమార్ గౌడ్, సీతారాం, మంకాల శ్రీశైలం, గడ్డం జంగయ్య, ప్రభు,ఎం. ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీలు విజయవంతం



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం సి.జి.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఓపెన్ టు ఆల్ వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో క్రీడా అభిమానులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించిన సీనియర్ పి.ఈ.టీ అమ్మగారి విష్ణువర్ధన్ రెడ్డి, వాలీబాల్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అలుక కృష్ణ యాదవ్, సీనియర్ క్రీడాకారుడు పడమటి వెంకటరెడ్డి, మెదక్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ చారిలను సి.జి.ఆర్. ట్రస్ట్ ఛైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు వ్యక్తుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యంలో మెరుగుదలకు దోహదం చేస్తాయి. ఈ పోటీల విజయవంతం కోసం కృషి చేసిన సి.జి.ఆర్ ట్రస్ట్ సభ్యులు, యువసేన సభ్యులు, క్రీడాకారులకు నా ప్రత్యేక అభినందనలు అని తెలిపారు. మరిన్ని ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉంటామని ట్రస్ట్ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కుమార్ గౌడ్ దేవేందర్ రెడ్డి, క్రీడాకారులు ఫిజిఆర్ ట్రస్ట్ సభ్యులు సి.జి.ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## రైతుబంధు లబ్దిదారుల పరిశీలనలో అధికారులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలో జరుగుతున్న రైతుబంధు లబ్దిదారుల పరిశీలనలో భాగంగా తుమ్మలగూడెం గ్రామంలో సర్వే నంబర్ 682లో ఫంక్షన్ హాల్ ఉన్న వ్యవసాయేతర భూమిని గుర్తించి సర్వే చేశారు. బోగారం గ్రామంలో సర్వే నంబర్ 110లో 11 ఎకరాల 12 గుంటల భూమి నాలా గా మార్పిడి అయిన భూమిని గుర్తించి సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి, తహసీల్దార్, మండల పంచాయతీ అధికారి, ఏపీఓ, వి.ఆర్.ఏ, భూ యజమానులు హాజరు కావడం జరిగింది.

## మహేష్ కుటుంబాన్ని పరామర్శించిన సీజీర్ ట్రస్ట్ చైర్మన్



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చేరు నియోజకవర్గం జిన్నారం మండలం మధిర గ్రామం పెద్దమ్మ గూడెం లో ఆత్మ కమిటీ డైరెక్టర్ దుబ్బక మహేష్ నాన్న దుబ్బక యాదయ్య కొన్ని రోజుల క్రితం అనారోగ్యం తో మరణించడం జరిగింది. సీజీర్ ట్రస్ట్ ఛైర్మన్ గోవర్ధన్ రెడ్డి ఈ విషయం తెలుసుకొని శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్,సింహ రెడ్డి,బోజి రెడ్డి,మంద రమేష్,శ్రీనివాస్ గౌడ్,శ్రీధర్ గౌడ్, మోహన్,భీమ్ రావు, అది రామకృష్ణ,శ్రీనివాస్ యాదవ్,అనిల్,శ్రీకాంత్,ఏలేశ్, బాలేష్,మల్లేష్, అరవింద్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

**అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో**



**విశ్వంభర, మహబూబాబాద్:** ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలుకు సంబంధించి నిర్వహిస్తున్న సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. శనివారం నెల్లికుదురు మండలంలోని నరసింహులగూడెం గ్రామంలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను స్వయంగా పరిశీలించారు. సర్వే వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేస్తూ సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## మజీద్ మామిడిపల్లిలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీ

**ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



విశ్వంభర, నందిగామ: నందిగామ మండలం మజీద్ మామిడిపల్లిలో చేకూర్తి సుదర్శన్ మరియు వాలీబాల్ అసోసియేషన్ మజీద్ మామిడిపల్లి గ్రామ యువకుల ఆధ్వర్యంలో 5 వ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది ఏళ్ల కాలంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ క్రీడలను, విద్యను నిర్వీర్యం చేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్లో క్రీడలకు, విద్యకు పెద్దపీట వేసిందన్నారు. యువతపైనే దేశ భవితవ్యం ఆధారపడి ఉందని అందరూ ఏకతాటిపై ఉంటే విజయాలు మీ సొంతమవుతాయని ధైర్యం చెప్పారు. ఏ సమస్య వచ్చిన మీ ఎమ్మెల్య శంకర్ మీ వెంటే ఉంటానని భరోసా ఇచ్చారు.

## కొత్త టీచర్స్ సదస్సు కు తరలి రావాలి: టీపీటీఎఫ్



**విశ్వంభర, నెల్లికుదురు:** మానుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నేడు టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే 2024 డీఎస్సీ నూతన ఉపాధ్యాయుల సదస్సుకు తరలి రావాలని ఆ సంఘం మండల అధ్యక్షులు యాకయ్య, జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ టీచర్స్ కు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యా రంగ సమస్యలపై కొత్త ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండటానికి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో ముఖ్య అంశాలపై ప్రముఖులు నరసింహారెడ్డి, ఎం. శ్రీనివాసులు ప్రసంగిస్తారన్నారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరామ్ ప్రవీణ్ కుమార్, సంపత్ రెడ్డి, మధుసూదన్, కరుణాకర్, ప్రవీణ్, శ్రీనివాస్, ఉమా రాణి, ఉషా రాణి తదితరులు పాల్గొన్నారు.

## నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా నివాళులు అర్పించి, రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహా పాల్గొని మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం ఇవ్వాలని, తెలుగుదేశం పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అఖండ మెజార్టీతో గెలిచి చరిత్ర సృష్టించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ డాక్టర్ నందమూరి తారక రామారావు అని అన్నారు. తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాలను ప్రజలకు దగ్గర చేసి ఎంతోమంది నాయకులను తయారు చేసి ప్రజలకు విశిష్ట సేవలు అందించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. పటేల్ పట్వారి వ్యవస్థను రద్దు చేసిన మహానుభావుడని, మహిళలకు ఆస్తిలో సమాన హక్కును ఆ రోజుల్లోనే పెట్టిన గొప్ప వ్యక్తి అని అన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భారతరత్న ప్రధానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట మండల తెలుగు యువత అధ్యక్షులు మీర్జా ఫజల్ బేగ్, టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యనిర్వహణ కార్యదర్శి నకిరేకంటి గణేష్, రామన్నపేట మండలం ఉపాధ్యక్షులు బత్తుల సత్యం, రామన్నపేట పట్టణ శాఖ అధ్యక్షులు దిండిగల రాములు, చేనేత నాయకులు గోశిక చక్రపాణి, రామన్నపేట బీసీ సెల్ మండల అధ్యక్షులు పున్న వెంకటేశం, బోగారం మాజీ సర్పంచ్ రాపోలు బలరాములు, నాయకులు కురుమ మహేందర్, సాయిని శేఖర్, గంజి వీరయ్య, గాదే జాని, నరసింహ, గాదె యాదయ్య, ఉప్పల సత్యనారాయణ, వడ్లకొండ సత్తయ్య, వడ్లకొండ నరసింహ, ఐలయ్య, దొంత యాదగిరి, సత్యనారాయణ, నరసింహ, అనంత చారి, రాములు తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, నందిగామ:** నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామంలో టీడీపీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలు జరుపుకున్నారు. తెలుగు ప్రజల ఆరాధ్యుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 29 వ వర్ధంతి సందర్భంగా నర్సప్పగూడ గ్రామంలో టీడీపీ అధ్యక్షుని ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు అని, ఆయన ఒక రాజకీయ ప్రభంజనం అన్నారు. బీసీలకు రాజకీయ చైతన్యంతో పాటు రిజర్వేషన్లకు నంది పలికిన వ్యక్తి దేశంలో ఆయనే అని కొనియాడారు. పేదల కోసం రెండు రూపాయల కిలో బియ్యం ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది అని, భూమి ఉన్నంత కాలం ఆయన ప్రజల గుండెల్లో బ్రతికే ఉంటాడని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం నందమూరి తారక రామారావుకు భారత రత్న బిరుదు ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు. ఈ విషయంలో ఆంధ్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చొరవ చూపాలని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరే భాధ్యత తీసుకొని సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ నరసింహ, బి రాములు,ఏ యాదయ్య, కే శ్రీకాంత్, మాజీ డైరెక్టర్ కొడిచెర్ల నరసింహ, గిరి, ఈశ్వర్, వెంకటేష్, పెంటయ్య, నారాయణ, వెంకటయ్య, రామకృష్ణ, నరసింహ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.









### మరణం లేని మహారాజు ఎన్టీ రామారావు

**విశ్వంభర, జూలూరుపాడు:** విశ్వ విఖ్యాత నట సర్వభౌమ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని పాప కోలు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీనాయకులు మరియు వివిధ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రొకటి రంగారావు, నిమ్మటూరి ముత్తయ్య, జిల్లా ఆర్యవైశ్య కార్యదర్శి పొలిటికల్ కమిటీ ఛైర్మన్ కొదమూరి కోటేశ్వరరావు, నిమ్మటూరి కనకయ్య, భూక్యాచందర్, యాస రోశయ్య పాల్గొన్నారు.

# అర్హులందరికి సంక్షేమ పథకాలు

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



**విశ్వంభర, గూడూరు:** అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడానికి అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి అమలుచేయనున్న 4 సంక్షేమ పథకాల క్షేత్ర స్థాయి సర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శనివారం గూడూరు మండలం నక్కబండ, దామరవంచ గ్రామ పంచాయితీలలో జరుగుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, క్రొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల విచారణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగు పథకాల అమలుకు జిల్లాలో సర్వే ప్రక్రియ విచారణా బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వివరాలను నమోదు చేయాలని అన్నారు. సర్వే నిర్వహణ ద్వారా పథకాల అమలకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. సర్వే నిర్వహణకు ప్రజల సహకారం అందించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు పథకాల లబ్ధి ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకోవడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన స్పష్టం చేశారు. రైతు భరోసాకు సాగులో ఉన్న భూముల వివరాలు నమోదుకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వేలో పాల్గొని వ్యవసాయానికి అనువుగా లేని భూములు అనగా నాలాలు, కన్వర్షన్ అయిన భూములు, రియల్ ఎస్టేట్ భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, ప్రభుత్వం ప్రాజెక్టులు కొరకు తీసుకున్న భూములు తదితర వివరాలను ఎలాంటి పొరపాటుకు తావులేకుండా పకడ్బందీగా నమోదులు చేయాలని తెలిపారు. సర్వేలో ఏమైనా సమస్యలు వస్తే కారణాలను వ్రాయాలని సూచించారు. ఈ నెల 16 నుండి 20 వరకు సర్వే, 21 నుండి 24 వరకు గ్రామసభలు నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సర్వే, గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, అధికారులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన మధుయాష్కీ గౌడ్



**విశ్వంభర, ఎల్బీనగర్:** సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఎంతోమంది పేదలు ఆర్థికంగా ఉపశమనం పొందగలుగుతున్నారని, ప్రవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న సామాన్యులకు వైద్యభారం తగ్గుతుందని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందిన ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు మధుయాష్కీ ని సంప్రదించగా.. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఎల్బీనగర్ సద్గురు నగర్ కు చెందిన కె. కైలాష్ కు రూ.60, 000 లు, వనస్థలిపురం శ్రీరామ్ నగర్ కాలనీ చెందిన శక్తి రోహన్ కు రూ. 40,500 లు, హయత్ నగర్ కు చెందిన షేక్ అశ్వక్ కు రూ.25,000 లు, వనస్థలిపురం కు చెందిన లక్ష్మమ్మ కు రూ. 60,000 ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కుట్ల నరసింహ యాదవ్, కొండోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పనామా చౌరస్తాలో ఎన్టీఆర్ వర్ధంతి



**విశ్వంభర, ఎల్బీనగర్:** తెలుగువారి ఖ్యాతిని ఖండాతరాలకు చాటి చెప్పిన మహోన్నత శక్తి నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి సందర్భంగా వనస్థలిపురం పనామా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కుమారుడు దేవిరెడ్డి ప్రీతమ్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ప్రీతమ్ రెడ్డి మాట్లాడుతూ పనామా చౌరస్తాను ఎన్.టీ.ఆర్.చౌరస్తాగా నామకరణం చేయడం జరిగిందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కోట్ల అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు. ఎన్.టీ.ఆర్. భారతదేశ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించారు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లో అధికారంలోకి రావడం జరిగింది అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ భారస పార్టీ నాయకులు,టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

**ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్కను కోరిన టీఎన్జీవో నాయకులు**




**విశ్వంభర, హైదరాబాద్:** ఉద్యోగుల పెండింగ్ సమస్యలన్నిటిని వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలను వెంటనే క్యాబినెట్ సభకు ఏర్పాటు చేసి ఉద్యోగ సంఘాల నేతలతో పూర్తిస్థాయిలో చర్చించి ఆర్థిక, ఆర్థికేతర సమస్యలన్నింటిని కూడా ప్రాధాన్యతక్రమంలో వెంటనే పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను టీఎన్జీవో కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ లు కోరారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ఒక్కటి ఒక్కటిగా మంజూరు చేస్తున్నామని, పెండింగ్ సమస్యలను ఫిబ్రవరి మొదటి వారంలో క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం ఏర్పాటు చేసుకుని పరిష్కరిస్తామని ఉద్యోగులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, నగర శాఖ అధ్యక్షులు కట్కూరి శ్రీకాంత్, కార్యదర్శి పంతులు హరికృష్ణ, తెలంగాణ నాల్గో తరగతి రాష్ట్ర అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, ఖాదర్, మార్కెటింగ్ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి ముక్రం, ఇరిగేషన్ ఫోరం రాష్ట్ర కోశాధికారి పి. శ్రీనివాస్, ఏపీ నుండి తెలంగాణకు కు కేటాయించబడ్డ తెలంగాణ ఉద్యోగులు మహేందర్, ఖాజా, వహీద్, నర్సింగ రావు, రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## పని దినాలలో షూటింగ్ కు అనుమతి ఇవ్వద్దు

**అధ్యక్షుడు భీమగాని మహేశ్వర్ గౌడ్**

**విశ్వంభర, ఎల్బీనగర్:** వి.యం.హెూం స్కూల్ లో పాఠశాల పనిదినాలలో షూటింగ్ లకు అనుమతి ఇవ్వడం వల్ల పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడుతుంది అని వి.యం.హెూం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు భీమగాని మహేశ్వర్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ సినిమా షూటింగ్ లకు వచ్చే వందలాది మంది ఆర్టిస్టులు, ప్రైవేటు సెక్యూరిటీ, బస్సులు, కార్ల వలన పాఠశాల విద్యార్థులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు అని అన్నారు. గతంలోనే సినిమా షూటింగ్ లకు అనుమతి ఇవ్వం అని చెప్పారని అయినా అనుమతి ఇవ్వడంలో అంతర్యం ఏముందో చెప్పాలని అన్నారు. దయచేసి పాఠశాల పనిదినాలలో షూటింగ్ నిలిపివేయాలని వి.యం.హెూం పూర్వ విద్యార్థుల సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. వి.యం.హెూం సెక్రటరీ కి ఎన్ని వినతి పత్రాలు ఇచ్చిన ఉపయోగం లేకుండా పోయిందని వాపోయారు. ఇదే విషయంపై బాలల హక్కుల కమిషన్ లో కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే ఆరోగ్య భద్రత: కేఎల్ఆర్



**విశ్వంభర, మహేశ్వరం/తుక్కుగూడ:** గ్రామాల్లో అనారోగ్యం, రోగాలతో బాధపడుతున్న వారిని గుర్తించి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేయాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 27మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు ఆరోగ్య భద్రత పెరిగిందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రోగులను ముందే గుర్తించి ఆస్పత్రుల్లో చేర్పితే, ముందే ఆర్థిక సహాయం ఎల్ఓసీ లెటర్ ఆఫ్ క్రెడిట్ అందిస్తామని కిచ్చెన్న సలహా ఇచ్చారు. పేద మధ్య తరగతి ప్రజల కోసం ఎన్ని కోట్లు ఖర్చు అయినా కాంగ్రెస్ ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందని సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో కేఎల్ఆర్ అన్నారు. పేదలకు వరంగా మారిన సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ సేవలు, వైద్య సౌకర్యాలను ప్రజలందరికీ తెలియజేయాలని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి కి మరోసారి కృతజ్ఞతలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతోపాటు ఆయా గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## సీపీఎం విస్తృత స్థాయి సమావేశం



**విశ్వంభర, ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో సీపీఎం విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ కార్యదర్శి ఆవుల వెంకన్న అధ్యక్షతన శనివారం నిర్వహించారు. దీనికి పార్టీ జిల్లా నాయకులు మార్తినేని పాపారావు హాజరై మాట్లాడుతూ..వికలాంగులు వృద్ధులు వితంతువులు పింఛన్లు మంచులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పథకాల అమలు కోసం నిర్వహిస్తున్న సర్వే పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కావటి నరసయ్య, సత్యం, యాకమ్మ, ఉప్పలయ్య, హరీష్ అనిల్, పి.ఉప్పలయ్య, జన్నయ, అమీర్, వెంకటయ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఆరంభం




**విశ్వంభర, హైదరాబాద్:** విఖ్యాత వాగ్గేయకారుడు శ్రీ త్యాగరాజ స్వామి 178 వ ఆరాధనోత్సవాలు త్యాగరాయ గానసభ నిర్వహణలో ఆరంభమయ్యాయి. ఉదయం గాన సభ ప్రాంగణం లో త్యాగయ్య విరచిత పంచ రత్న కీర్తనలు గోష్ఠి గానం తో వేడుక ఆరంభమైంది. ప్రముఖ వీణా వాదన నిపుణురాలు ఆనంద రాజ్యలక్ష్మి తమ వీణ వాదనం లో ఎందరో మహానుభావులు, తెర తీయగ రాదా, నిధి సుఖమా రాముని సన్నిధి చాలా సుఖమా తదితర త్యాగరాజ కీర్తనలు వినిపించారు. సాయంత్రం కళా సంగీత నాట్య వేదిక పై గాన సభ నాట్య గురువు తులసి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన వాసు శిష్య బృందం నాట్య అంశాలు ప్రదర్శనతో పాటు సంగీత గురువు సంయుక్త తన శిష్య బృందం తో శాస్త్రీయ గాన గోష్ఠి తో ఆకట్టుకున్నారు. జి ఎస్ టీ విశ్రాంత అధికారి ఎం శ్రీనివాస్ శాలువా జ్ఞాపిక తో ఆనంద రాజ్యలక్ష్మి నీ సత్కరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి పాలక వర్గ సభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ సమితికి న్యాయం చేయండి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు నాలుగు మండలాలకు కేంద్రం. పూర్వ సమితిగా కొనసాగింది అమనగల్లులో సబ్ రిజిస్ట్రార్ డివిజనల్ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలనీ స్థానిక ఎమ్మార్వోకు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమనగల్లు పట్టణము లో సబ్ రిజిస్టర్ కార్యాలయం, సట్. ట్రెజరీ కార్యాలయం, ఏసీబీ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేసినట్లయితే అన్ని మండలాల ప్రజలకు అనువుగా ఉంటుంది. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయుటకు ప్రభుత్వ భూమి కూడా వున్నది, మండల కేంద్రమైన ఆమనగల్లు పట్టణం నాలుగు మండలాలకు ముఖ్య కేంద్రముగా ఉంటుంది. ఆమనగల్లు పట్టణం కాకుండా వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయుట చర్యలు తీసుకుంటున్నారని తెలిసిన సందర్భంగా ఒక ప్రాంత మీద వివక్షతో కాకుండా సరైన నిర్ణయం తీసుకోవాలని, ఆమనగల్లు పట్టణం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయుటకు అనుకూలమని, వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసినట్లయితే ఇక్కడ తిరగలేరని, సివిల్ జడ్జి కోర్టు, మున్సిపాలిటీ పరంగా మాకు న్యాయం చేస్తూ అనుకూలంగానే ఉంటారని భావిస్తున్నావని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ ఛైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు చెక్కాల లక్ష్మణ్, చెన్నకేశవులు, బైకని యాదమ్మ శ్రీశైలంయాదవ్, కృష్ణ యాదవ్, గోరటి గీత నర్సింహ మరియు గిరి యాదవ్, వడ్డే రాజు, రవి రాథోడ్, నాగిళ్ల లక్ష్మణ్, అశోక్, అమర్, సంతోష్ పాల్గొన్నారు.

## నాణ్యమైన ఫిజియోథెరపిస్టులను సమాజానికి అందించండి

**జస్టిస్ నరసింహారెడ్డి**



**విశ్వంభర, హైదరాబాద్:** సమాజంలో ఫిజియోథెరపిస్టుల సేవలు ఇతర వైద్యులతో సమానమని వారి సేవలు కూడా చాలా ముఖ్యమైనవేనని జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి అన్నాడు. హైదరాబాద్ విద్యానగర్ లోని దుర్గాబాయి దేశ్ముఖ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ 21వ స్నాతకోత్సవ కార్యక్రమం శనివారం ఉదయం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ చాయానందిని అతిథులను ఆహ్వానించారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ నరసింహారెడ్డి ఫిజియోథెరపిస్టుల ను తయారు చేస్తున్న ఈ కళాశాల మరింత ముందుకు వెళ్లాలని, మరింత సేవా భావం తో నాణ్యమైన ఫిజియోథెరపిస్టుల ను సమాజానికి అందుబాటులోకి తీసుకురావాలని కలశాల నిర్వాహకులకు సూచించారు. ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులకు అతిథులు ప్రశంసా పత్రాన్ని జ్ఞాపికను పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాబాయి దేశ్ముఖ్ సంస్థ ప్రెసిడెంట్ ఉష, ఛైర్మన్ ఐ వీ ఆర్ కృష్ణారావు, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీ సుందరి, డైరెక్టర్ అకాడమిక్ వైయస్సార్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాగ్దేవి కాలేజ్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**విశ్వంభర, వరంగల్:** వరంగల్ బొల్లికుంట ప్రాంతంలోని జేఎన్టీయూ, కేయూ అనుబంధ ఫార్మసీ కళాశాలలు సంయుక్తంగా శనివారం కళాశాల ఆడిటోరియంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాగ్దేవి విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ సిహెచ్. దేవేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా డాక్టర్ రామకిషన్, ముఖ్యఅతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్ కే. ప్రతాపరెడ్డి తోపాటు ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్ జి. కమల్ యాదవ్, డాక్టర్ ఎం రాధా కిషన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఔషధ పరిజ్ఞానంతో పాటు,సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను, అభివృద్ధిని వినియోగించుకొని విశ్వ మానవ శ్రేయస్సు కోసం ఔషధ పరిజ్ఞానం కలిగిన విద్యార్థులు ఈ సమాజ హితానికి కృషి చేసి సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ కె. ప్రతాపరెడ్డి తెలిపారు. అనంతరం డాక్టర్ ఏ.రామ్ కిషన్ మాట్లాడుతూ రోజురోజుకు అంత చిక్కని రోగాలతో సతమతమవుతున్న మానవాళికి గత కొంత కాలం క్రితం బీభత్సం సృష్టించి విజృంభించిన కరోనా ప్రపంచ మానవాళికి ఒక గొప్ప గుణపాఠం నేర్పిందని, మానవ జీవన శైలిలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని, అంతర్జాతీయ స్థాయిలో భారత ఔషధ రంగం తన సామర్థ్యాన్ని చాటుకుందని, ప్రపంచానికే భారత్ ఔషధ రంగంలో ఒక దిక్సూచిగా ఎదిగిందని, విశ్వ మానవ శ్రేయస్సు కోసం ఔషధరంగ విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని తెలిపారు. అనంతరం డాక్టర్ సిహెచ్ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ అపారమైన ఔషధ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యంతో కళాశాల నుండి బయటకు వచ్చిన ఫార్మసీ విద్యార్థులు ఉన్నతమైన ఉద్యోగాలలో స్థిరపడడమే కాకుండా, సమాజ శ్రేయస్సుకు తమ వంతు తోడ్పాటు అందించాలని తెలిపారు. అనంతరం డాక్టర్ సిహెచ్ వాహిని దేవి మాట్లాడుతూ ఈ కళాశాల విద్యార్థులను సమాజంలో ఉన్నతమైన ఆలోచనలతో, నైతిక విలువలతో గొప్ప పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా మంచి ఉద్యోగాలు పొందే విధంగా నాణ్యమైన ఔషధ విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ వేడుక కోసం విద్యార్థులు కళాశాల ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో అందమైన పూలతో ఎంతో ఆకర్షణీయంగా అలంకరించారు. విద్యార్థుల సంగీత నృత్య ప్రదర్శనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పట్టాలు స్వీకరించిన విద్యార్థులు మాట్లాడుతూ గౌన్ వేసుకొని క్యాప్ పెట్టుకోవడం పెట్టుకోవడం చాలా థ్రిల్లింగ్ గా ఉందని, ఈ కార్యక్రమాన్ని ఒక వేడుకలా జరుపుకోవడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.

## జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ విధానం అమలు చేయాలి

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి**



**విశ్వంభర, హైదరాబాద్:** మీడియా రంగంలో పనిచేసి పదవీ విరమణ పొందిన జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ విధానం అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలు జర్నలిస్టు సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే)జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు ఎల్గోయి ప్రభాకర్ లు శనివారం బర్కత్ పురలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. మీడియా రంగంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పాత్రికేయులకు వృద్ధాప్యంలో ఎటువంటి సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి జర్నలిస్టుల కోసం పెన్షన్ స్కీం అమలు చేస్తామని గతంలో కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి స్వర్గీయ సుష్మాస్వరాజ్ హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. జర్నలిస్టులకు ఒకే విధమైన జాతీయ పెన్షన్ స్కీం అమలు చేయాలన్న డిమాండ్ దేశవ్యాప్తంగా జర్నలిస్టు సంఘాల నుంచి వస్తున్నదని అన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల రైల్వే పాస్ లు, ప్రత్యేక రక్షణ చట్టం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు వంటి పలు సమస్యలను వారు ప్రస్తావిస్తూ, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రిని కోరారు. అదే విధంగా హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ స్థలాలు ఇవ్వొద్దని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని వారు గుర్తుచేస్తూ, కోర్టు తీర్పు వల్ల జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. మంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ, జర్నలిస్టులకు పెన్షన్ స్కీం అమలు చేసే అంశాన్ని కేంద్ర సమాచార ప్రసారాల మంత్రితో చర్చించి పెన్షన్ స్కీం అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా హౌసింగ్ సొసైటీలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అంశం న్యాయ శాఖ పరిధిలో ఉన్నందున, దీనిపై కేంద్ర న్యాయశాఖ మంత్రితో మాట్లాడతానని కిషన్ రెడ్డి చెప్పారు.

## మహిళల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**విశ్వంభర, భూపాలపల్లి:** మహిళలను అన్ని రంగాలల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్(ఎన్ఏసీ) వారి సహకారంతో ప్రజ్వల్ సంఘం శాయంపేట వారి నిర్వహణలో ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళల కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. మహిళల సాధికారతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేసి, వారితో గ్రూపు ఫొటో దిగారు. లబ్ధిదారుల జాబితాను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలన చేయాలి. ప్రభుత్వం ఈ నెల 26 నుంచి నాలుగు కొత్త పథకాలు అమలు చేయనున్న నేపథ్యంలో అర్హుల జాబితాను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలన చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. పెద్దకోడెపాక గ్రామంలో నాలుగు పథకాల లబ్ధిదారుల ఎంపిక కు సంబందించి ఫీల్డ్ వెరిఫికేషన్ ను స్వయంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 26న రిపబ్లిక్ డే పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి, గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని ఫీల్డ్ విజిట్ ను పరిశీలించి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా, లబ్ధిదారుల జాబితాను రూపొందించడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలి

**పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**



**విశ్వంభర, హైదరాబాద్:** గ్రామసభ నిర్ణయాన్ని శిరసావహించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్లోని మిషన్ భగీరథ కార్యాలయంలో డీఆర్డీఓ లతో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సమీక్ష సమావేశం లో పాల్గొని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు పై జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గణతంత్ర దినోత్సవం నుంచి నాలుగు ప్రతిష్టాత్మక పథకాలను ప్రభుత్వం ప్రారంభించబోతోందని, సొంత భూమిలేని ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 12 వేల ఆర్థిక చేయుత అందించబోతున్నామని, దేశంలో ఈ రాష్ట్రంలో ఇటువంటి పథకం లేదు కూలీల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ చేస్తున్నామని, కుటుంబంలో ఉండే ఉపాధి హామీ మహిళా కూలీ బ్యాంకు ఖాతాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని జమ చేస్తామని సీతక్క తెలిపారు. మాది మహిళా పక్షపాతి ప్రభుత్వం.. అందుకే మహిళల ఖాతాల్లోకి నగదు బదిలీ చేస్తున్నాం. ఇలాంటి పథకాన్ని తీసుకురావడం పేద కుటుంబం నుంచి వచ్చిన నాకు ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీ రాజ్ శాఖ చేతుల మీదుగా కూలీలకు ఆర్థిక చేత అందించడం సంతోషంగా ఉందన్నారు. చిన్న పొరపాటు జరిగిన పేదలకు నష్టం వాటిల్లుతోందని, అందుకే జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, చారిత్రాత్మక ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను విజయవంతం చేయాలని అన్నారు. గ్రామ సభ వేదికగానే అర్హుల గుర్తింపు, లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు సీతక్క. శాంతియుత వాతావరణంలో గ్రామ సభలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, గ్రామసభ నిర్ణయమే ఫైనల్ గ్రామసభ నిర్ణయాన్ని శిరసావహించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలని, మానవీయ దృక్పథంతో, సామాజిక స్పృహతో అధికారులు వ్యవహరించాలని, సాంకేతిక కారణాలతో పేదలకు నష్టం వాటిల్ల లేకుండా చూడాలని, పేదలకు లబ్ధి చేకూర్చేలా, ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై అనవసర రాజకీయాలు తగదు కూలీలకు రూపాయి సహాయం చేయని బీఆర్ఎస్ పెద్దలు సైతం విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవ చేశారు. రైతులకు కూలీలకు పంచాయతీ పెట్టేలా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని, అర ఎకరం ఉన్న రైతు కన్నా.. ఏ భూమి లేని కూలికే అధిక లబ్ధి చేకూరుతుందని, కూలీలను అవమానపరిచేలా బీఆర్ఎస్ మాట్లాడుతోందన్నారు. రైతులకు రుణమాఫీ చేయని బీఆర్ఎస్ ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. రైతులకు రైతు భరోసా, పంట బోనస్ ద్వారా కౌలు రైతులకు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా కూలీలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమం నిరంతర ప్రక్రియ అని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీతక్క చెప్పారు. పీఆర్ అండ్ ఆర్డీ కార్యదర్శి లోకేష్ కుమార్, డైరెక్టర్ సృజన, అన్ని జిల్లాల డీఆర్ డీ వో లు మంత్రి శ్రీతక్కకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛంతో సన్మానం చేశారు.

## 31 కేజీల గంజాయి పట్టివేత



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం ఆర్టీఏ చెక్ పోస్ట్ సమీపంలో ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీల్లో ఇన్నోవా కార్ లో అక్రమ రవాణా చేస్తున్న 31 కేజీల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజా విలువ సుమారు 8 లక్షలు రూపాయలు ఉంటుందని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద 15 వేలా రూపాయల నగదు, 31 కేజీల గంజాయిని సీజ్ చేసినట్టు అధికారులు వెల్లడించారు.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేను పరిశీలించిన సీఈఓ



**విశ్వంభర, జూలూరుపాడు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగాచేపడుతున్న ఆత్మీయ భరోసాకార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ సీఈవో నాగలక్ష్మి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో జరుగుతున్నరేషన్ కార్డు సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని నిజమైన పేదవారిని గుర్తించి వారికి ఆత్మీయ భరోసా పథకం వర్తింప చేయాలని ఎంపీడీవో కరుణాకర్ రెడ్డిని ఎంపీ ఓ తులసిరామ్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి జ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండల కేంద్రంలో పలు మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ నిడమానూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ మర్ల చంద్రా రెడ్డి శనివారం త్రిపురారం మండల కేంద్రంలో ఇటీవల కాలంలో మృతి చెందిన మాజీ ఎంపీటీసీ కూతాటి సాంబయ్య భార్య లక్ష్మమ్మ, త్రిపురారం గ్రామపంచాయతీ వాటర్ పంప్ ఆపరేటర్ కొడుదుల సత్తిరెడ్డి, విశాఖ ఇండస్ట్రీస్ వర్కర్ మట్టాడి నవీన్, పోలిశెట్టి సాంబశివరావు అనారోగ్యం తో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ మార్కెట్ ఛైర్మన్ మర్ల చంద్రారెడ్డి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాగార్జున సాగర్ నియోజకవర్గ యూవజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కసిరెడ్డి నరేష్, బసిరెడ్డి జాన్ రెడ్డి, అనుముల శంకర్రెడ్డి, బండారు మాణిక్యం, గోన్నూరు కృష్ణా రెడ్డి, వలసాని ఎల్లయ్య, కోడి నాగయ్య, డాలు భాస్కర్ పాల్గొన్నారు.

## మృతురాలు కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల సాయం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో శుక్రవారం సాయంత్రం గుజ్జుల సత్యమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్ కలిసి 6000 రూపాయలు వారి కుంటుంబానికి తక్షణ సహాయం గా అందించి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్, మాజీ సర్పంచ్ రఘుపతి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సీనియర్ నాయకులు కృష్ణయ్య, జంగయ్య, జంగయ్య, ఆశన్న వెంకటాచారి, బిక్షపతి, రవి శ్రీశైలం, శ్రీను, సాయి నాథ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశంతో కదలిన విద్యుత్ శాఖ



**విశ్వంభర, మహబూబ్ నగర్:** మహబూబ్ నగర్ జిల్లా లోని మూసాపేట మండల పరిధిలోని నందిపేట గ్రామంలో దేవరకద్ర ఎమ్మెల్యే ఆదేశంతో విద్యుత్ శాఖలో కదిలిక వచ్చింది. గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫారం ప్రమాద భరితంగా ఉందని ఎన్నోసార్లు గ్రామస్తులు అభ్యర్థించిన పట్టించుకోలేదని, ఎమ్మెల్యే ఆదేశంతో కదలిక వచ్చిందని దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. ఇప్పుడు ఇదే విషయమై దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే విద్యుత్ శాఖ వారికి ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అట్టి పనులు శనివారం దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మి కాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మొదలు పెట్టడం జరిగింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## క్రీడలకు పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**– పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్**



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలంలోని మైసిగండి గ్రామంలో నిర్వహించిన మైసిగండి ప్రీమియర్ లీగ్ విజేతలకు పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ మొదటి బహుమతిని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ క్రీడలకు పెద్ద పీట వేస్తుందని, దేశంలో నే తెలంగాణ అత్యుత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దాలని, ప్రపంచం తో పోటీపడే విధంగా తెలంగాణ క్రీడాకారులకు చేయూత నిస్తున్నారని, ఫోర్త్ సిటీ లో అవుట్ డోర్, ఇండోర్ స్టేడియాలకు రూపకల్పన చేస్తుస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మొదటి విజేతలకు మైసిగండి 11 స్టార్ టీమ్ ను పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ ద్వారా 30,116 రూపాయల నగదు బహుమతి అందించగా, రెండో బహుమతి చౌహాన్ విజేతలకు మాజీ వార్డు సభ్యులు రాందాస్ నాయక్ 16,116 రూపాయల నగదు బహుమతి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హీరా సింగ్ నాయక్, మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్, తులసిరామ్ నాయక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పేదోడికి ముక్తి ఆశ్రమం భరోసా



**విశ్వంభర, మంథని:** అద్దె ఇంట్లో ఉంటూ ఆఖరి మజిలీకి అష్టకష్టాలు పడే పేదోడికి ముక్తి ఆశ్రమం భరోసా ఇస్తోంది. అద్దె ఇంట్లో ఉంటున్న కుటుంబంలో ఎవరైనా చనిపోతే అంతిమ కార్యక్రమం ఆ అద్దె ఇంట్లో నిర్వహించేందుకు ఇంటి యజమానులు అడ్డుకుంటుండటం సమాజంలో జరుగుతూనే ఉన్నాయి. ఒకరు చనిపోతే గౌరవించాల్సిన పరిస్థితులు ఉన్నా కట్టుబాట్లు, ఆచారాల పేరుతో పేదోడిని ఇబ్బందులకు గురి చేసిన సందర్భాలుఉన్నాయి. నియోజకవర్గంలో ఎంతో మంది పేదలు తమ కుటుంబసభ్యుడు చనిపోతే అద్దె ఇంట్లో ఉంటలేక చివరకు పార్థివ దేహాన్ని రోడ్డుపైనే ఉంచిన సందర్భాలు అనేక ఉన్నాయి. పేదోడి ఆఖరి మజిలీకి కుటుంబసభ్యులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పుట్ట లింగమ్మ చారిటబుల్ ఆధ్వర్యంలో మంథని పట్టణంలోని బస్ డిపో సమీపంలో ముక్తి ఆశ్రమం నిర్మించారు. అద్దె ఇంట్లో ఉంటూ ఎవరైన చనిపోతే వారి అంతిమ సంస్కారాలతో పాటు కర్మకాండ పూర్తి చేసుకునే వరకు ఈ ముక్తి ఆశ్రమంలో ఉండి చేసుకునే విధంగా సదుపాయాలు కల్పించారు. మంథని పట్టణానికి చెందిన ఉడుత శివ మంథని పట్టణంలోని 13 వ వార్డు లో ఓ ఇంట్లో కిరాయి ఉంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఉడుత శివ మరణించగా అద్దె ఇంట్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇంటి యజమాని అంగీకరించలేదు. దీంతో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ముక్తి ఆశ్రమంలో వారి అంతిమ కార్యక్రమం చేసుకుంటున్నారు. శనివారం ఆ కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. ముక్తి ఆశ్రమం మీలాంటి పేదోళ్ల కోసమే ఏర్పాటు చేశామని, పేదోడి ఆఖరి మజిలీలో ఎలాంటి ఇబ్బందులు రాకూడనే ఆలోచనతో ముక్తి ఆశ్రమ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు.

## బస్ నడుపుతూ అపస్మారక స్థితిలోకి వెళ్లిన డ్రైవర్



**విశ్వంభర, మెట్పల్లి:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి బస్ డిపో కు చెందిన ప్రైవేట్ బస్ డ్రైవర్ ఎం. సతీష్ మెట్ పల్లి నుండి ఖానాపూర్ వెళ్తుండగా మెట్ పల్లి పాత బస్టాండ్ వద్ద బస్ నిలిపి ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో అపస్మారక స్థితిలోకి వెళ్లి సీట్ లోనే పడిపోవడంతో ప్రయాణికులు గమనించి 108 ద్వారా మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే డిపో మేనేజర్ టి.దేవరాజు హుటాహుటిన ప్రభుత్వ హాస్పిటల్ కు చేరుకొని డ్రైవర్ ను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్రైవర్ మాట్లాడుతూ మెట్ పల్లి నుండి ఖానాపూర్ వెళ్తున్న క్రమంలో ఉదయం నుండి ఏమి తినకపోవడంతో కళ్ళు తిరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లి తన సీట్ లోనే పడిపోయానని డ్రైవర్ ఎం.సతీష్ అన్నారు. ప్రయాణికులు హాస్పిటల్ కు తరలించారని, ఆరోగ్యం నిలకడగానే ఉందని అన్నారు.

## తెలుగువారిని తలెత్తుకునేలా చేశారు: యాదిలాల్



**విశ్వంభర, ఆమనగల్లు:** రాజకీయాల్లోకి వచ్చిన 9నెలల్లో ప్రభంజనం సృష్టించి టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ మాజీ కార్యదర్శి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ అడ్ హక్ కమిటీ సభ్యులు యాదిలాల్ అన్నారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్ లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి కండె సత్యనారాయణతో కలిసి నివాళు లర్పించారు. ఎన్టీఆర్ అమర్ రహే, జోహార్ ఎన్టీఆర్ నినాదాలతో ఎన్టీఆర్ ఘాట్ మారుమోగింది. అనంతరం ఘాట్ వద్ద సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్టీఆర్ ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు తలెత్తుకు తిరిగేలా చేశారు. అనంతరం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని యాదిలాల్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి వారికి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మితిమీరిన వేగం ప్రాణ సంకటం

**– ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్**



**విశ్వంభర, మహబూబాబాద్:** మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురై కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని మిగిల్చుతున్నారని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో రోడ్డు నిబంధనలపై ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా వాహనదారులు కొద్దిరోజులు మాత్రమే నిబంధనలు అనుసరిస్తూ మళ్లీ యథావిధిగా మారుతున్నారని అన్నారు. ఏ విషయంలోనైనా చట్టాలు కఠినంగా అమలు చేస్తే వచ్చే ఫలితాల కన్నా ప్రజలు స్వచ్ఛందంగా చట్టం పరిధిలో నడుచుకుంటేనే ఆశించిన ఫలితాలు వస్తాయని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిఏటా దేశవ్యాప్తంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లావ్యాప్తంగా రవాణా, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అజాగ్రత్తగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురై మరణించిన వారిలో హెల్మెట్ లేకుండా, సీట్ బెల్టు లేకుండా, పరిమితికి మించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైన వారే అధికంగా ఉన్నారు. ముఖ్యంగా తాగి వాహనాలను నడిపే వారి వల్ల, ర్యాష్ డ్రైవింగ్ వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలతో భారీగా ప్రాణనష్టం జరిగే ఆస్కారం ఉంటుంది. కాబట్టి తాగి వాహనాలు, ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత రవాణా శాఖ నుంచి డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతనే వాహనాలు నడపాలి. సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉండటంతో సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదు. వాహనడ్రైవర్లు ఎక్కువ గంటలు వాహనాలను నడపడం వల్ల అలసిపోయి నిద్రలోకి జారుకొని అర్ధరాత్రి తెల్లవారుజాము వరకు రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. డ్రైవర్లు అలసిపోయే వరకు ఎక్కువ గంటలు వాహనాలను నడపకూడదు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోకూడదని ఎస్పీ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాలతో పోలీస్ అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లాలో వాహనదారులకు, ఆటోడ్రైవర్లకు, లారీ డ్రైవర్లకు, ఆర్టీసీ డ్రైవర్లతోపాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చట్టాలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు.


## పోరాడి విజయం సాధించిన విశాఖ స్టీల్ కార్మికులకు జేజేలు

**సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్**



**విశ్వంభర, హైదరాబాద్:** విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటుపరం చేయటానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలను భగ్నం చేస్తూ సంవత్సరాల తరబడి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడి విశాఖ స్టీల్ కార్మికులు విజయం సాధించారని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ అన్నాడు. ఈ స్టీల్ ప్లాంటును సొంతం చేసుకోవటానికి పథకం రచించిన ఆదానీ ఆశలు కార్మికవర్గం అడియాశలు చేసిందని, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఓడిపోయి ప్రస్తుత ప్రభుత్వం గెలిచిన తర్వాత కూడా విశాఖ స్టీల్ ప్లాంట్ అంశం డోలాయమానంలో ఉంది. ప్రస్తుత స్టీల్ కేంద్ర మంత్రి కుమార్ స్వామి 2024 చివరలో విశాఖ స్టీల్ ప్లాంట్ను సందర్శించి పోరాటం చేస్తున్న కార్మికులకు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగబోదని ప్రకటించిన తర్వాతే కార్మికులకు కొత్త ఆశలు కలగటం జరిగిందన్నాడు. మంత్రి కుమార్స్వామి ప్రకటించిన తర్వాత జరిగినటువంటి పార్లమెంట్లో గానీ, మంత్రివర్గ సమావేశంలో కానీ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్న అంశం ప్రస్తావన రాకపోవటంతో కార్మికుల్లో గందరగోళం, అయోమయం చోటుచేసుకుందని అన్నారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ను ప్రైవేటీకరణ చేయమని మంత్రివర్గంలో నిర్ణయం చేసి 11వేల కోట్లు ప్యాకేజీ ప్రకటించిన తర్వాత కార్మికుల్లో ఆనందం వెల్లువిరిసిందని ఆయన తెలిపాడు. కానీ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ తాత్కాలికమే గానీ విశాఖ స్టీల్ ప్లాంట్కు శాశ్వత పరిష్కారం కాదని కార్మికులు వ్యక్తీకరించటంలో నిజం ఉన్నదని అన్నాడు. విశాఖ స్టీల్ ప్లాంట్లో కార్మికులు కష్టపడి పనిచేస్తూ అత్యధిక ఉత్పత్తి చేస్తున్నప్పటికి కూడా లాభాలు రాకపోవటానికి ప్రధాన కారణం విశాఖ స్టీల్ ప్లాంట్కు సొంత గనులు కేంద్ర ప్రభుత్వం కేటాయించకపోవటం ఒక కారణమైతే వేల ఎకరాలు కలిగి ఉన్న స్టీల్ ప్లాంటును ఏదో రకంగా చాటుమాటు ప్రయత్నాలతో సొంతం చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్న కుటిల కార్పొరేట్ సంస్థలు మరో కారణంగా పరిస్థితులు తెలియజేస్తున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్లోని కార్మికుల సుదీర్ఘ పోరాటానికి మద్దతు తెలిపిన రాజకీయ పార్టీలను, వ్యక్తులను ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ తెలిపాడు.

## మహిళల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**విశ్వంభర, చింతపల్లి:** మహిళలు స్వయం శక్తితో ఎదిగి ఆర్థికంగా బలోపేతం కావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆ విధంగానే మహిళలకు వివిధ రంగాలలో శిక్షణ ఇవ్వటం జరుగుతుందని దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. ఎన్ఐటీహెచ్ఎం (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం మరియు హాస్పిటాలిటీ హెూటల్ మేనేజ్మెంట్) వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన మండల కేంద్రానికి చెందిన మొహమ్మద్ అక్బర్ బీ బేగానికి శనివారం ఎమ్మెల్యే బాలునాయక్ ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధి ఆర్థికంగా బలోపేతం కావడానికి తమ ప్రభుత్యం మహిళలకు ప్రోత్సహిస్తుందన్నారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో హెూటల్ మేనేజ్మెంట్ వారు కుట్టు మిషన్లు, కుట్లు అల్లికలు వంటి రంగాలలో శిక్షణ ఇప్పించడమే కాకుండా ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం అందిస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తమ ప్రభుత్వ పథకాలను సహకాలంలో మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ఎంఏ సిరాజ్ ఖాన్, మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, పీఏసీఎస్ ఛైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు జాంగిర్, ఎండి రియాజ్ పాషా, మాజీ ఉపసర్పంచ్ సలీం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముషావర్, చెట్లపల్లి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## లారీల సమ్మెకు తీన్మార్ మల్లన్న టీం మద్దతు



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి కాకతీయ లారీ అసోసియేషన్ వారి సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మె వంటావార్పు కార్యక్రమానికి తీన్మార్ మల్లన్న టీం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మరియు టీం సభ్యులు మద్దతి ఇవ్వడం జరిగింది. భూపాలపల్లి కాకతీయ లారీ గణపురం లారీ అసోసియేషన్ గత తొమ్మిది రోజులుగా రిలే నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. భూపాలపల్లి కూల్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ వారు పెంచవలసిన కిరాయిలు పెంచకుండా అసోసియేషన్ల లో ప్రధానంగా కొందరు ముఖ్య పదవులలో ఉండి మీరు ఏం చేస్తారో చేసుకోండి అనే తీరున వ్యవహరిస్తున్నారు. దీనికి నిరసనగా లారీ ఓనర్ లందరూ తొమ్మిది రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. గత 30 సంవత్సరాల నుండి భూపాలపల్లిలో వెయ్యి కుటుంబాలకు పైగా ఈ బొగ్గు లారీల మీదనే ఆధారపడి జీవనోపాధి కొనసాగిస్తున్నారు. టైర్ రేట్, డీజిల్, ఇన్సూరెన్స్, స్పేర్ పార్ట్స్ రేట్లు విపరీతంగా పెరిగిపోయినాయి కానీ లారీ కిరాయి రేట్లు ఒప్పందం ప్రకారం పెంచడం లేదు. వారి న్యాయమైన డిమాండ్లు దీనికి సంబంధించి భూపాలపల్లి సింగరేణి జీఎం మరియు స్థానిక శాసనసభ్యులు చొరవ తీసుకొని వీరి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేయాలని తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ డిమాండ్ చేశారు. లేనియెడల వీరు నిర్వహించే ప్రతి కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం పాల్గొంటుందని రవి పటేల్ లారీ ఓనర్స్ కి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం జిల్లా నాయకులు గండు కరుణాకర్, శ్యామల చంద్రశేఖర్, మడే సంతోష్ పాల్గొన్నారు.

# ఉస్మాన్ నగర్ రైతుల సమస్య పరిష్కారానికి కృషి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**విశ్వంభర, రామచంద్రపురం:** సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్ నగర్ రేడియల్ రోడ్డులో భూమిని కోల్పోతున్న రైతులకు మెరుగైన నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తున్నామని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఉస్మాన్ నగర్ వార్డు కార్యాలయంలో రైతులు, హెచ్ఎండీఏ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమ ఎదుర్కొంటున్న సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పరిహారం అందిస్తే భూమిని ఇచ్చేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ఉస్మాన్ నగర్ నుండి వట్టినాగులపల్లి వరకు నిర్మించ తలపెట్టిన రేడియల్ రోడ్డు అత్యంత కీలకమని తెలిపారు. ఉస్మాన్ నగర్ పరిధిలో కొంతమంది రైతులు భూమి ఇవ్వకపోవడం మూలంగా రోడ్డు పనులు నిలిచిపోయాయని తెలిపారు. భూమి కోల్పోతున్న ప్రతి రైతుకు ప్రభుత్వంతో చర్చించి మెరుగైన టీడీఆర్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు స్పందించిన రైతులు భూములు అందించేందుకు సమ్మతించారు. రైతులను కాపాడుకునే పూర్తి బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ రెడ్డి, స్థానిక నాయకులు చిట్టి ఉమేష్, పర్సా శ్యామ్ రావు, రైతులు పాల్గొన్నారు.



## ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి 3.95 కోట్లు



**విశ్వంభర, కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం లో రాబోయే మే లో జరిగే సరస్వతి నది పుష్కరాల దృష్ట్యా ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో 3.95 కోట్లు నిధులు కేటాయిస్తూ ఆర్టీసీ బోర్డు అనుమతులు ఇచ్చింది. కాళేశ్వరం గ్రామ ప్రజలు, స్థానిక కాంగ్రెస్ నాయకుల విజ్ఞప్తి మేరకు తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు చొరవ తీసుకొని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో మాట్లాడి ఈ నిర్మాణానికి అనుమతులు ఇప్పించారు. దీంతో గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, యువత మంత్రి శ్రీధర్ బాబుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## నూతన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్:** సాయి నగర్ సీనియర్ సిటిజన్ సేవా సమితి ప్రాంగణంలో శనివారం 2025 డైరీ, క్యాలెండర్ మరియు డిసెంబర్ త్రైమాసిక సంచిక 2024 ను ఆవిష్కరించారు. గౌరవ ముఖ్య అతిథి డి సుధాకర్ ఆలిండియా పెన్షనర్స్ ఫెడరేషన్, కే లక్ష్మయ్య ఛైర్మన్ పీజేఏసీ, దామోదర్ రెడ్డి పెన్షనర్స్ అసోసియేషన్ వెల్ఫేర్ అసోసియేషన్, ఉమా రెడ్డి మహిళా స్టేట్ ఛైర్ పర్సన్ సమక్షంలో తెలంగాణ పెన్షనర్ అసోసియేషన్ సలీంనగర్ కార్యవర్గ సభ్యులు అధ్యక్షులు భరత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చోళ ఓం ప్రకాష్, ప్రసాద్ రావు కోశాధికారి, ఎం కృష్ణమూర్తి గౌరవాధ్యక్షులు మదన్ మోహన్ రావు, అసోసియేట్ అధ్యక్షులు, ఎడిటర్. ఇంకా కార్యవర్గ సభ్యులు, ప్రాథమిక సభ్యుల సమక్షంలో ఆవిష్కరణలు చేపట్టడం జరిగింది.

## కల్లుగీత కార్మికుల హామీలు వెంటనే అమలు చేయాలి

**విశ్వంభర, రామన్నపేట:** కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు పిలుపులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో రామన్నపేట మండల కల్లుగీత కార్మిక సోదరులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కల్లుగీత కార్మిక సంఘం పిలుపునిచ్చింది. ప్రమాద నివారణకు కాటమయ్య (కంఠ మహేశ్వర) రక్షణ కవచం వృత్తి చేసే వారందరికీ వెంటనే ఇవ్వాలని, సభ్యులందరికీ ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని. ప్రమాద బాధితులకు పెండింగ్ ఎక్స్ గ్రేషియా డబ్బులు వెంటనే ఇవ్వాలని, ఎన్నికల హామీ ప్రకారం 10 లక్షలకు పెంచాలని, వృత్తిలో ప్రమాదాలు జరిగిన వారికి టాడి కార్పొరేషన్ నుండి ఇచ్చే సహాయం నిలిపి వేశారు. దీనిని కొనసాగించాలని, వృత్తి పెన్షన్ ఎన్నికల హామీ ప్రకారం 4 వేలకు పెంచాలని, నందనంలోని నీరా తాటి ఈత ఉత్పత్తుల ప్రాజెక్టును ప్రారంభించాలని, నెక్లెస్ రోడ్డు లోని నీరా కేఫ్ ని టాడీ కార్పొరేషన్ కు అప్పగించాలని, ఏజెన్సీ ఏరియాలోని సొసైటీలను పునరుద్ధరించాలిని, బెల్ట్ షాపులను నిరోధించాలని, చెట్ల పెంపకానికి సొసైటీకి ఐదు ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలని వారి డిమాండ్స్ ను తెలిపారు.

## ఖాళీ అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు 2024-25 విద్యా సంవత్సరానికి ఇంగ్లీషులో ఒక అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాహత్ ఖానం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు గాను సంబంధిత సబ్జెక్టు పీజీలో జనరల్ అండ్ బి.సి అభ్యర్థులు 55 శాతం మార్కులు మరియు ఎస్సీ ఎస్టీలు అయితే 50 శాతం మార్కులు ఉన్నవారు అర్హులని, ఎంపికలో నెట్, సెట్ పీహెచ్డీ లతో పాటు బోధనా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలవారు ఈ నెల 21 న సాయంత్రం మూడు గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇంటర్వ్యూ తేదీ దరఖాస్తులు చేసిన అభ్యర్థులకు తెలియజేస్తామని తెలిపారు.

## చంద్రు నాయక్‌ను పరామర్శించిన పెద్ది కృష్ణమూర్తి గౌడ్

**విశ్వంభర, హైద్రాబాద్:** ఇటీవల దేవరుప్పుల మండల కేంద్రంలో బైక్ ఆక్సిడెంట్ లో గాయపడిన దేవరుప్పుల మండలానికి చెందిన ధరావత్ చంద్రు హైద్రాబాద్ లోని పూర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా శనివారం పూర్ హాస్పిటల్ కు వెళ్ళి చంద్రు నాయక్ ను దేవరుప్పుల పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ పరామర్శించారు. వారి వెంట ధరావత్ రాజు, తదితరులున్నారు.



## హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**ధర్నా నిర్వహించిన నిజాం కళాశాల హాస్టల్ విద్యార్థులు**

**విశ్వంభర, హైదరాబాద్:** నిజాం కళాశాల హాస్టల్లో రెండు నెలలుగా నాణ్యమైన ఆహారం అందడం లేదని శనివారం విద్యార్థులు నిరసన గలం తో ధర్నా నిర్వహించారు. ఆహారం అందక విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఆహారంతో పాటు పరిశుభ్రమైన టాయిలెట్స్, వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నామని, తక్షణమే తమ సమస్యను పరిష్కరించి సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని, హాస్టల్ వార్డెన్ పై చర్య తీసుకోవాలని, ప్రభుత్వం చొరవ చూపి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు.



## టైటిల్ క్యాలెండరు ఆవిష్కరణ



**విశ్వంభర, నార్కెట్ పల్లి:** తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నూతన క్యాలెండర్ ను క్యాలెండర్ ఇంచార్జ్, రాష్ట్ర కార్యదర్శి రాధారపు భిక్షపతి ఆధ్వర్యంలో నకిరేకల్ నియోజకవర్గ శాసన సభ్యులు వేముల వీరేశం ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి అందజేయడం జరిగింది. అలాగే నియోజకవర్గంలో ఉన్న కుమ్మర్ల పలు సమస్యలను పరిష్కరించాలని వారికి విన్నవించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం, జిల్లా కోశాధికారి చిట్టిమళ్ళ దశరథ,నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షులు ఎలిజాల వెంకన్న, జిల్లా సలహాదారులు నిమ్మనగోటి లింగయ్య, నార్కట్పల్లి మండల శాఖ అధ్యక్షులు నిమ్మనగోటి వెంకన్న, మండల శాఖ కోశాధికారి మిడిదొడ్డి రాజు, నార్కెట్ పల్లి గ్రామశాఖ అధ్యక్షులు రాధారపు యాదగిరి, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి మాసంపల్లి సైదులు, గ్రామశాఖ ఉపాధ్యక్షులు బండారు సత్యనారాయణ, నార్కెట్పల్లి మండల నాయకులు రాధారపు గోపాల్, రాధారపు దేవయ్య, రాధారపు సైదులు, రాధారపు కృష్ణయ్య, తాడూరి చంద్రం చిట్యాల నాయకులు, బొడ్డుపల్లి వినోద్, మాసంపల్లి సురేందర్, ప్రేమ్ కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేల గొంతుకలు లక్ష డప్పులు కమిటీ ఎన్నిక



**విశ్వంభర, నాగారం:** వేల గొంతు%య%లు లక్ష డప్పులు తుంగతుర్తి నియోజకవర్గం ట్రాన్స్ జెండర్ అధ్యక్షులుగా చిప్పలపల్లి నిహారిక మాదిగను, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు చైతు లను ఎన్నుకున్నారు. బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న ఆదేశాల మేరకు తుంగతుర్తి నియోజకవర్గ వేల గొంతులు లక్ష డప్పులు కళామండలి అధ్యక్షుడు చిప్పలపల్లి మల్లేష్ మాదిగ ఆధ్వర్యంలో శనివారం నాగారం మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బహుజన యుద్ధనౌక డాక్టర్ ఏపూరి సోమన్న హాజరై మాట్లాడుతూ ఫిబ్రవరి 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ శ్రీ మందకృష్ణ మాదిగ తలపెట్టిన ఎస్సీ వర్గీకరణ సాధనకై సూర్యాపేట జిల్లా నుండి ప్రతి ఒక్క మాదిగ బిడ్డ డప్పు సంకన వేసుకొని తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల ఆక్సిడెంట్ లో మృతి చెందిన ఈటూరు గ్రామానికి చెందిన పేరాల వెంకన్న కుటుంబానికి 5 వేలు, పేరాల జ్యోతి కుటుంబానికి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో శైలేందర్, అంజయ్య, రవి, నరేష్, యాదగిరి, సోమయ్య, సైదులు, వెంకన్న, యాదగిరి, శ్రీనివాస్ ఉన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**కాంగ్రెస్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్**

**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండల్ అమీర్ పేట్ గ్రామానికి చెందిన మంగలి యాదయ్య, కమ్మరి బుచ్చి బాబుకు గతంలో అనారోగ్యం కారణాలతో వైద్య ఖర్చుల నిమ్మితం కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇమ్మడి ప్రవీణ్ పటేల్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ని సంప్రదించగా కేఎల్ఆర్ రంగారెడ్డి ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు చే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను మంగలి యాదయ్య, కమ్మరి బుచ్చిబాబుకు కేఎల్ఆర్ అందజేయడం జరిగింది. మహేశ్వరం మండలంలో 27 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి కి కేఎల్ఆర్ మహేశ్వరం నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, మహేశ్వరం మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజు గొల్లూరి, కాంగ్రెస్ నాయకులు చాకలి యాదయ్య, ఆవుల యాదయ్య, గాజుల ఆనంద్, గల్ల శ్రీకాంత్, చంద్ర మోహన్ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వాలి

- మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్ణపు సోమయ్య

**విశ్వంభర, మహబూబాబాద్:** ప్రజా పాలనలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు పెట్టుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్ణపు సోమయ్య మాట్లాడుతూ గత భీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్నా అర్హులైన పేదలకు రేషన్ కార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. కాబట్టే బీఆర్ఎస్ ను గద్దె దింపారని అన్నారు. ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక సంక్షేమ పథకాలు ఇస్తామని హామీ ఇచ్చారు. వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజాపాలనను పటిష్టాత్మకంగా తీసుకొని అందులో దరఖాస్తులు తీసుకోవడం జరిగింది. ఆ దరఖాస్తులలో ఆప్షన్ లేకున్నా ఒక తెల్ల పేపరు మీద రాసుకుని దరఖాస్తు పెట్టుకున్న రేషన్ కార్డులు ఇస్తామని అధికారులు ప్రభుత్వం చెప్పడం జరిగింది. ఒక్కొక్క కుటుంబంలో పిల్లలు పెళ్లిళు చేసుకుని వేరే కాపురం పెట్టుకొని జీవిస్తున్నారు. వీరికి రేషన్ కార్డులు లేక సంక్షేమ పథకాలు అందని ద్రాక్ష లాగా మారిందన్నారు. మహబూబాబాద్ పట్టణంలో ప్రతి వార్డులో 200 వరకు దరఖాస్తులు పెట్టుకున్నారు. కానీ ప్రతి వార్డుకు20 నుండి 30 వరకు ఎంపిక చేసినట్లు చెప్పుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలు కావాలంటే రేషన్ కార్డు కీలకం కాబట్టి వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రేషన్ కార్డులు అర్హులైన అందరికీ అందాలంటే దరఖాస్తు గడువును పొడిగించాలని కోరారు. లేని వెడల పెద్ద ఎత్తున సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్, వన్ టౌన్ కార్యదర్శి రావుల రాజు, పట్టణ కమిటీ సభ్యులు కుమ్మరి కుంట్ల నాగన్న, నక్క సైదులు, బానోతు వెంకన్న, తోట శ్రీనివాస్,ఎర్ర శ్రీనివాస్, మందుల మహేందర్, బానోత్ ప్రకాష్, తోట యాకయ్య, బానోత్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఊరడమ్మ తల్లి జాతర



**విశ్వంభర, మర్పల్లి:** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని బచ్చన్ పల్లీ గ్రామంలో శనివారం దుర్గమ్మ, ఎలమ్మ, గ్రామ దేవతల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలమ్మ ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. మహిళలు బోనం కుండలను అందంగా అలంకరించుకుని ర్యాలీగా అమ్మవారి ఆలయానికి వెళ్లి నైవేద్యాలను సమర్పించి మొక్కులను సమర్పించుకున్నరు. ఈ వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు, మహిళల పూనకాలు, యువతీ యువకుల కేరింతలు, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

## కాలువలను పూర్తి చేసి సాగు నీరు అందించాలి



**విశ్వంభర, నాగారం:** నాగారం మండల పరిధిలోని లక్ష్మాపురం ఆయకట్టు శివారులో అసంపూర్తిగా ఉన్న ఎస్సారెస్పీ పిల్ల కాలువలను పూర్తి చేసి చివరి ఆయకట్టు రైతుల వరకు ఎస్ఆర్ఎస్పీ సాగునీటిని అందించాలని కోరుతూ శనివారం మండల పరిధిలోని లక్ష్మాపురం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా అసంపూర్తిగా వదిలిన కాలువలోకి దిగి నిరసన తెలిపారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు దేశగాని నరసయ్య మాట్లాడుతూ భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు స్పందించి కాలువను పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న కాలువల వలన సాగు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు శాగంటి నరసయ్య ,మల్లయ్య, ఉప్పలయ్య, నరేష్, సత్తయ్య, సోమశేఖం పాల్గొన్నారు.

## బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ జడ్పీటీసీ



**విశ్వంభర, మూసాపేట్:** మహబూబ్ నగర్ జిల్లాలోని అడ్డాకుల మండల పరిధి కాటవరం గ్రామానికి చెందిన హరిజన్ కూరగాయల బుచ్చన్న మాతృమూర్తి హరిజన్ దాసమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామ స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మండల మాజీ జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి శనివారం మృతురాలు స్వగృహానికి వెళ్లి ఆమె కుమారుడిని, కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించి ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ ఖాజా గోరి, కాటవరం గ్రామ మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి రాజు నాయక్, కొండన్న, శ్రీశైలం, సందీప్, శ్రీనివాసులు, భీమ రాయుడు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## భవిష్యత్తు అంతా డిజిటల్ మీడియా పైనే ఆధారం

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఫిరోజ్ ఖాన్**



**విశ్వంభర, బషీర్ బాగ్:** భవిష్యత్తు అంతా డిజిటల్ మీడియా పైనే ఆధారపడి ఉంటుందని, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఫిరోజ్ ఖాన్ అన్నారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో 'ది ఎల్లో పిల్లో' ఆధ్వర్యంలో భారత్ డిజిటల్ చాంప్ వెబ్ సైట్ ను ఫిరోజ్ ఖాన్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ భారతదేశ యువతకు డిజిటల్ మార్కెటింగ్ నైపుణ్యాలతో సాధికారత కల్పించడం లక్ష్యంగా భారత్ డిజిటల్ చాంప్ పెట్టుకుందని పేర్కొన్నారు. భారత్ డిజిటల్ చాంప్ ద్వారా విద్యార్థులను శక్తివంతంగా చేయడం పైన దృష్టి సారించామని అన్నారు. ఈ కార్యక్రమంలో 'ది ఎల్లో పిల్లో' ప్రిన్సిపల్ పార్ట్నర్ అభిజిత్ కపురియ, వికాస్ లు పాల్గొని మాట్లాడారు.

# అద్దె ఇళ్లల్లో నివసించే వారికి ఉచిత విద్యుత్, నీరు: కేజ్రీవాల్



**ఢిల్లీ:** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార ఆమ్‌ఆద్మీ ఢిల్లీ ప్రజలకు వరుస సంక్షేమ పథకాలను ప్రకటిస్తోంది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తాజాగా మరో హామీని ప్రకటించారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే దేశ రాజధానిలోని అద్దె ఇళ్లల్లో నివసించే వారికి ఉచిత విద్యుత్, నీరు అందిస్తామని పేర్కొన్నారు. పూర్వాంచల్‌కు చెందిన అనేకమంది కౌలుదారులకు సైతం ఉచిత విద్యుత్, నీటి సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారు.
తాము ఉచిత పాఠశాలలు, ఆసుపత్రుల నుంచి ప్రయోజనం పొందుతున్నామని.. కానీ ఉచిత విద్యుత్, నీరు వంటి పథకాలకు దూరంగా ఉంటున్నామని అద్దె ఇళ్లల్లో నివసించేవారు పేర్కొంటున్నారని కేజ్రీవాల్ అన్నారు. అందుకే వారి సమస్యను పరిష్కరించి.. వారికి ప్రయోజనం కలిగించేలా చర్యలు తీసుకోవడానికి తమ పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. ఆప్ ఇప్పటికే వృద్ధుల కోసం సంజీవని స్కీమ్, మహిళా సమ్మాన్ యోజన కింద ప్రతి మహిళకు నెలనెలా రూ.2,100 ఆర్థికసాయం, అర్చకులకు రూ.18 వేలు గౌరవ వేతనం మొదలైన హామీలు ఇచ్చిన సంగతి తెలిసిందే.ఫిబ్రవరి5న ఢిల్లీఅసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దేశ రాజధానిలోని ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ఉచితాల వైపు దృష్టి సారించాయి. తాము అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్,ఉచిత రేషన్ కిట్లు,ఏడాదిపాటు నిరుద్యోగ యువతకు ప్రతినెలా రూ.8,500, మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థికసాయం, రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.ఉచితాలకు దూరంగా ఉండే బీజేపీ సైతం 'సంకల్ప పత్రా' పార్ట్-1 పేరుతో విడుదల చేసిన పార్టీ మేనిఫెస్టోలో.. గర్భిణులకు రూ.21వేల ఆర్థిక సాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై రూ.500కే ఎల్పీజీ సిలిండర్లు, 'మహిళా సమృద్ధి యోజన' కింద ఢిల్లీలోని మహిళలకు నెలకు రూ.2500 ఆర్థికసాయం వంటి హామీలను ప్రకటించింది.

### 'అన్‌బ్రేకబుల్' డాక్యుమెంటరీ ప్రసారాన్ని నిలిపివేసిన పోలీసులు..

నేడు ఢిల్లీలో విలేకరులతో జరిగిన సమావేశంలో 'అన్‌బ్రేకబుల్' అనే డాక్యుమెంటరీని ఆప్ ప్రదర్శించడంపై వివాదం చెలరేగింది. ఈ డాక్యుమెంటరీ ప్రదర్శించడానికి ఆప్ నేతలు తమ అనుమతి తీసుకోలేదని పేర్కొంటూ పోలీసులు ప్రసారాన్ని నిలిపివేశారు. దీనిపై కేజ్రీవాల్ స్పందిస్తూ ఎన్నికలను ఉద్దేశించి ఈ డాక్యుమెంటరీ ప్రసారం చేయలేదని.. స్క్రీనింగ్ ప్రదేశంలో ఎన్నికల జెండా, ప్రచారం వంటివేమీ నిర్వహించలేదన్నారు. బీజేపీ చేస్తున్న రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవ్యతిరేక చర్యలను బహిర్గతం చేస్తున్నామనే భయంతో ఆ పార్టీ ఈవిధమైన చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు.

# 65 లక్షల కుటుంబాలకు పైగా ఆస్తి కార్డులు.. వర్చువల్‌గా అందించిన ప్రధాని



**ఢిల్లీ:** సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్‌డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్ పథకం కింద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు ఆస్తి కార్డులను పంపిణీ చేశారు. శనివారం వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. దాదాపు 65 లక్షల మందికి పైగా కార్డులు అందించారు. ఈ పథకం కింద దేశంలోని 10 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 230 జిల్లాల్లోని లబ్ధిదారులు కార్డులు అందుకున్నారు.గ్రామీణ ప్రజలకు సాధికారికత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వామిత్వ పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. నేడు మొత్తం 50 వేల గ్రామాల్లోని లబ్ధిదారులకు ఈ పథకం కింద ప్రయోజనం చేకూరింది. ఈసందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారిని ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. "ఈ రోజు చారిత్రాత్మకమైన రోజు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ ముఖ్యమంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్షలాది మంది ఈ పథకం ప్రయోజనాలు పొందుతున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు. లబ్ధిదారులకు నా అభినందనలు" అని ప్రధాని పేర్కొన్నారు."ఐదేళ్ల క్రితం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించింది. ఇన్నేళ్లలో 1.5 కోట్ల మందికి స్వామిత్వ ఆస్తి కార్డులు పంపిణీ చేశాం. ఈ రోజు మరో 65 లక్షల కుటుంబాలు ఈ కార్డులను పొందాయి. దీంతో గ్రామాల్లోని 2.25 కోట్ల మంది తమ ఇంటికి సంబంధించిన శాశ్వత ఆస్తి కార్డులను పొందారు" అని ప్రధాని తెలిపారు. అనంతరం రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌కు చెందిన లబ్ధిదారులతో ప్రధాని మోదీ మాట్లాడారు.


# సానుకూల ధోరణిలో భారత్-అమెరికా సంబంధాలు: ఎలాన్ మస్క్



**లండన్:** భారత్, అమెరికాల మధ్య సంబంధాలు సానుకూల ధోరణిలో ఉన్నాయని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అన్నారు. స్పేస్ఎక్స్ స్టార్‌బేస్ స్థావరంలో భారత్‌కు చెందిన వ్యాపారవేత్తలతో మస్క్ సమావేశమయ్యారు. ఇందులోభాగంగా మాటాడుతూ భారత్, అమెరికాల మధ్య మెరుగైన వాణిజ్య సంబంధాలకు తన మద్దతు ఉంటుందని వ్యాఖ్యానించారు. ఇరుదేశాల మధ్య సాంకేతికత, అంతరిక్ష అన్వేషణ రంగాలలో సహకారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాల్లో ప్రపంచ దేశాల్లో భారత్ పాత్ర మెరుగవుతోందని అన్నారు. ఇండియా గ్లోబల్ ఫోరమ్ నేతృత్వంలోని భారతీయ పారిశ్రామికవేత్తలు, స్పేస్ ఎక్స్ అత్యాధునిక అంతరిక్ష పరిశోధన సౌకర్యాలను సందర్శించారు. దీనికి చెందిన స్టార్‌షిప్ ఫ్లైట్ 7 ప్రయోగాన్ని వీక్షించారు. సాంకేతికతతో నడిచే సుస్థిరమైన భవిష్యత్తును రూపొందించడంలో భారత్‌కు ప్రపంచ దేశాలుసహకారం అందిస్తున్నాయని.. అభివృద్ధి చెంది దేశాల సరసన భారత్ నిలబడే రోజు త్వరలోనే వస్తుందని ఇండియా గ్లోబల్ ఫోరమ్ వ్యవస్థాపకులు మనోజ్ లాడ్వా పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో క్రమంగా పురోగతి సాధిస్తున్న ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ఎక్స్ సంస్థ ప్రతిష్ఠాత్మక స్టార్‌షిప్ ప్రయోగాలు చేస్తుందని కొనియాడారు. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్న సమయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ సారథి మస్క్‌తో చర్చలు ఇరుదేశాల సంబంధాల విషయంలో ముఖ్యపాత్ర పోషిసాయని అన్నారు.అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా ట్రంప్ 'డోజ్' ప్రాజెక్టు రూపొందించిన విషయం తెలిసిందే. దీనికి సంయుక్త సారథులుగా టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ , భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిలను ట్రంప్ నియమించారు. తన ప్రభుత్వంలో సమర్థత పెంచేందుకు వీరు కృషి చేస్తారని తెలిపారు. ఏటా ప్రభుత్వం ఖర్చుపెడుతున్న 6.5 ట్రిలియన్ డాలర్లలో దుబారా, అవినీతిని అరికడతామన్నారు. ప్రభుత్వ శాఖల్లో వృథా ఖర్చులకు కత్తెర వేయాలని వీరిరువురిని ఆదేశించారు.

# వినీలాకాశంలో ఆవిష్కృతమవనున్న అద్భుత దృశ్యం..!

### ఈ నెల 22 నుంచి ఒకే వరుసలోకి ఆరు గ్రహాలు..!




ఢిల్లీ: ఈ నెల 22న వినీలాకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతం కాబోతున్నది. ఒకే వరుసలోకి ఆరు గ్రహాలు వచ్చి కనువిందు చేయనున్నాయి. ఆయా గ్రహాలు ఎలాంటి బైనాక్యులర్ల సహాయం లేకుండానే నేరుగా చూసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 22వ తేదీ నుంచి 31 వరకు గ్రహాలు ఒకో వరుసలోకి రాబోతున్నాయి.గ్రహాలు ఒకేవరుసలో చాలా అరుదుగా కనిపిస్తాయి. గ్రహాలు ఒకే వరుసలోకి రావడాన్ని ప్లానెటరీ అలైన్‌మెంట్‌గా ఖగోళ నిపుణులు పేర్కొంటున్నారు. శుక్రుడు, అంగారకుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలు ఒకే వరుసలోకి రానున్నాయి. చాలా అరుదుగా గ్రహాలన్నీ ఒకే వరుసలోకి వస్తుంటాయి. ఈ దృగ్విషయాన్ని ప్లానెటరీ అలైన్‌మెంట్, పరేడ్ ఆఫ్ ప్లానెట్స్‌గా పిలుస్తుంటారు.వాస్తవానికి గ్రహాలకు మధ్య భారీగానే దూరం ఉంటాయి. గ్రహాలు ఏవీ అంతరిక్షంలో వరుస క్రమంలో ఉండవు. కానీ, మనకు భూమిపై నుంచి చూసిన సమయంలో ఒకే వరుసలో దర్శనమిస్తాయి. ఈ దృశ్యాన్ని బైనాక్యులర్స్ ద్వారా చూస్తే మాత్రం మరింత స్పష్టంగా కనిపిస్తాయి. శుక్రుడు, కుజుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్‌లను చూసేందుకు ఫిబ్రవరి ప్రారంభం ఉత్తమమైన సమయంగా ఖగోళ నిపుణులు పేర్కొంటున్నారు.ఇక మార్చిలో అరుణగ్రహం, బృహస్పతి, యురేనస్, వీనస్, నెప్ట్యూన్, శని, మెర్క్యురీ గ్రహాలు ఒకేవరుసలోకి వచ్చి కనువిందు చేయనున్నాయి. దీన్ని గ్రేట్ ప్లానెటరీ అలైన్‌మెంట్‌గా పిలుస్తారు. ఈ ఖగోళవిందును టెలిస్కోప్ సహాయం లేకుండా చూడొచ్చు. కానీ, స్పష్టంగా నాలుగు గ్రహాలు మాత్రమే కనిపిస్తాయి. నెప్ట్యూన్, యురేనస్ గ్రహాలను చూసేందుకు టెలిస్కోప్ అవసరమవుతుంది.సూర్యాస్తమయం తర్వాత రాత్రి 8.30 గంటల నుంచి ఆకాశంలో ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ఆ సమయంలోనే అన్ని గ్రహాలు ఒకేవరుసలో దర్శనమిస్తాయి. రాత్రి 11.30 గంటల తర్వాత మళ్లీ కనిపించవు. కానీ, బృహస్పతి, మార్స్, యురేనస్ గ్రహాలు కనిపిస్తాయి. ఆ తర్వాత మళ్లీ కనిపించకుండా పోతాయి. ఈ నెల 22 నుంచి 31 వరకు ఆయా గ్రహాలను భూమిపై నుంచి నేరుగా చూడొచ్చు.శని, బుధుడు, నెప్ట్యూన్ సూర్యాస్తమయం సమయంలో సూర్యుడికి దగ్గరగా వెళ్తాయి. మెర్క్యురీ, శని, నెప్ట్యూన్ సూర్యుడికి చాలా దగ్గరగా వెళ్లడంతో గ్రహాలు భూమిపైకి కనిపించడం తగ్గిపోతుంది. శుక్రగ్రహం సైతం అంతగా కనిపించేందుకు ఛాన్స్ ఉండదు. బృహస్పతి, అంగారకుడు, యురేనస్ సైతం మాత్రమే కొద్దివారాల పాటు అలాగే ఉంటాయి.ఈ అరుదైన దృశ్యాన్ని అమెరికా, మెక్సికో, కెనడా, భారత్‌లో చూసేందుకు అవకాశం ఉంది. జనవరి 22 నుంచి 31 వరకు మాత్రమే స్పష్టంగా కనిపిస్తాయి. ఆయా గ్రహాలను చూసేందుకు వీలైనంత వరకు ఎక్కువగా చీకటిగా ఉండే ప్రాంతాలకు వెళ్లడం మంచిది. ఎందుకంటే లైట్ల వెలుతురులో అంత స్పష్టంగా కనిపించకపోవచ్చు. అందుబాటులో టెలిస్కోప్ ఉంటే గ్రహాలను మరింత స్పష్టంగా తిలకించేందుకు అవకాశం ఉంటుంది. మరి మీరు కూడా ఈ ఖగోళ వింతను చూడడం మరిచిపోవద్దు.

# చావు నుంచి త్రుటిలో తప్పించుకున్నాం: బంగ్లా మాజీ ప్రధాని



**ఢాకా:** అనూహ్యంగా పదవిని కోల్పోయిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతోన్న విషయం తెలిసిందే. ఈక్రమంలో షేక్ హసీనా కీలక విషయాలు వెల్లడించారు. అధికారంలో ఉన్నప్పుడు తనపై జరిగిన హత్యాయత్నాల గురించి ఆమె తెలిపారు. గతేడాది ఆగస్టులో అవామీ లీగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో దాదాపు 600 మందికి పైగా మరణించారు. దాంతో ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా తన పదవికి రాజీనామా చేశారు. ఈక్రమంలోనే తనపై హత్యాయత్నం జరిగిందని హసీనా పేర్కొన్నారు. ఆ సమయంలో తాను, తన సోదరి రెహానా 20-25 నిమిషాల వ్యవధిలో చావు నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత భారత్‌కు చేరుకున్నామన్నారు. అవామీ లీగ్ పార్టీ ఫేస్‌బుక్ ఖాతాలో ఆడియో సందేశంలో ఆమె ఈమేరకు వ్యాఖ్యానించారు. గతంలోనూ పలుమార్లు తనపై జరిగిన హత్యాయత్నాల గురించి హసీనా వెల్లడించారు. '2000 ఏడాదిలో కోటలీపర బాంబు దాడి నుంచి బయటపడ్డాను.2004 ఆగస్టులోనూప్రాణాపాయస్థితిలోంచి బయటపడ్డా. మరోసారి 2024 ఆగస్టు 5న చావు నుంచి తప్పించుకోగలిగాను. లేకపోతే ఈపాటికే ప్రాణాలు కోల్పోయి ఉండేదాన్ని' అని హసీనా పేర్కొన్నారు. 'నేను ప్రాణాలతో ఉన్నప్పటికీ.. నా దేశంలో, నా ఇంట్లో ఉండే అవకాశం లేకుండా పోయింది' అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు.
2000 ఏడాదిలో గోపాల్ గంజ్ జిల్లాలోని కోటలీపరలో ఎన్నికల ర్యాలీకి వెళ్లిన హసీనాపై ఉగ్రవాదులు దాడికి యత్నించారు. 'హర్కతుల్ జీహాద్ బంగ్లాదేశ్'కు చెందిన ఉగ్రవాదులు బాంబులు పెట్టి ఆమెను హతమార్చాలని చూశారు. పక్కా సమాచారంతో బాంబు నిర్వీర్య బృందాలు వాటిని తొలగించడంతో దాడి నుంచి హసీనా బయటపడ్డారు. 2004 ఆగస్టులో ఉగ్రవాద వ్యతిరేక ర్యాలీలో దాడి జరిగింది.ఇందులో 24 మంది మృతి చెందగా.. 500 మంది గాయపడ్డారు. ఈ దాడిలో హసీనాకు సైతం గాయాలయ్యాయి. పదహారేళ్లుగా కొనసాగుతున్న షేక్ హసీనా ప్రభుత్వం గతేడాది ఆగస్టులో జరిగిన ఉద్యమం కారణంగా పడిపోయింది. దీంతో పదవీచ్యుతురాలైన ఆమె.. స్వదేశాన్ని వీడి భారత్‌కు వచ్చి ఓ రహస్య ప్రాంతంలో నివసిస్తున్నారు. ఆ తర్వాత స్వదేశంలో ఆమెపై అనేక కేసులు నమోదయ్యాయి. అరెస్టు వారెంట్లు కూడా జారీ అయ్యాయి. ఈక్రమంలోనే హసీనాను తమకు అప్పగించాలంటూ గత డిసెంబరులో బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం భారత ప్రభుత్వానికి ఒక దౌత్య సందేశం పంపింది. అయితే, 'ఈ వ్యవహారంపై తాము వ్యాఖ్యానించాల్సిందేమీ లేదు' అని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అప్పట్లో ప్రకటించారు. ఈ క్రమంలోనే ఆమె పాస్‌పోర్టును బంగ్లా ప్రభుత్వం రద్దు చేసింది.

# నేనెక్కడికీ పోలేదు.. కుంభమేళాలోనే ఉన్నా ఐఐటీ బాబా



ప్రయాగ్‌రాజ్‌: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా లో పాల్గొనేందుకు కోట్లాది మంది తరలివస్తున్నారు. ఈక్రమంలోనే ఉన్నత చదువులు చదివి ఆధ్యాత్మికం వైపు వచ్చిన అభయ్ సింగ్ 'ఐఐటీ బాబా'గా ఇటీవల పాపులర్ అయిన విషయం తెలిసిందే. కాగా, ఆయన ఉంటున్న జూనా అఖాడాకు చెందిన ఆశ్రమం నుంచి అకస్మాత్తుగా వెళ్లిపోయినట్లు తాజాగా వార్తలు వచ్చాయి. ఆ వార్తలను ఐఐటీ బాబా ఖండించారు. అంతేకాక ఆ ఆశ్రమంపైనా పలు విమర్శలు చేశారు. ఈనేపథ్యంలో ఐఐటీ బాబా మానసిక స్థితి సరిగా లేదంటూ ఆశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఆయన డ్రగ్స్ తీసుకుంటున్నారని ఆరోపణలు చేశాయి. ఈ విషయం అందరికీ తెలియడంతో అభయ్‌సింగ్ ఆశ్రమం విడిచివెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు. అయితే, ఈ ఆరోపణలను ఐఐటీ బాబా ఖండించారు. 'ఆశ్రమం నిర్వాహకులు నన్ను రాత్రికి రాత్రి ఆశ్రమం నుంచి వెళ్లిపోమన్నారు. నేను ఫేమస్ కావడాన్ని వారు జీర్ణించుకోలేక ఇలా చేశారు. నా మానసిక స్థితి సరిగా లేదని సర్టిఫికేట్‌లు ఇవ్వడానికి వారెవరు' అంటూ ఆయన ప్రశ్నించారు. ఈసందర్భంగా ఐఐటీ బాబా గురువునంటూ జ్ఞాని సోమేశ్వర్ పూరి పేర్కొనడంపై అభయ్‌సింగ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఆయన నా గురువు కాదు. మా మధ్య ఎలాంటి గురు-శిష్యుల సంబంధం లేదని ఆయనకు ముందే చెప్పా. ఇప్పుడు నేను ఫేమస్ అయ్యానని ఆయన అలా చెప్పుకుంటున్నారు'అని పేర్కొన్నారు. అభయ్‌సింగ్ స్వస్థలం హరియాణా.ఐఐటీ-బాంబేలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ పూర్తి చేసినట్లు ఆయన చెబుతున్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లోనే ఉద్యోగం.. కొంతకాలం కార్పొరేట్ సంస్థలో పనిచేసిన ఆయన.. దాన్ని వదులుకొన్నారు. ఫొటోగ్రఫీపై మక్కువతో అటువైపు దృష్టిసారించారు. ఈ క్రమంలోనే ఆధ్యాత్మికం వైపు అడుగులు వేశారు. మహా కుంభమేళాకు వచ్చిన ఆయన.. ఓ వార్తా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు సాధారణ ప్రజలతోపాటు సాధువులు, విదేశీ పర్యటకులు పోటెత్తుతున్నారు. ఈక్రమంలోనే వారిలో భిన్న నేపథ్యం ఉన్నవారు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.

# 'అతడి మరణం కలచివేసింది': సుచిర్ బాలాజీ మృతిపై స్పందించిన ఓపెన్ ఏఐ





**ఢిల్లీ:** చాట్‌జీపీటీ మాతృ సంస్థ 'ఓపెన్ ఏఐ'లో నాలుగేళ్లు పరిశోధకుడిగా పనిచేసిన ప్రజా వేగు (విజిల్ బ్లోయర్), భారత సంతతి వ్యక్తి సుచిర్ బాలాజీ (26)ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మృతిపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు ఓపెన్ ఏఐపై సుచిర్ తల్లి పూర్ణిమారావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ తరుణంలో ఆ టెక్ సంస్థ నుంచి స్పందన వచ్చింది."సుచిర్ బాలాజీ మా బృందంలో కీలక సభ్యుడిగా కొనసాగారు. అతడి మృతి మమ్మల్ని ఎంతగానో కలచివేసింది. ఈ కేసులో అవసరమైన సహాయం చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. ఈవిషయమై మేం శాన్‌ఫ్రాన్సిస్కో పోలీస్ విభాగాన్ని కూడా సంప్రదించాం. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉన్నందున మేం ఇంతకుమించి స్పందించాలనుకోవడం లేదు" అని ఓపెన్ ఏఐ సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టు పెట్టింది. ఇదిలాఉంటే.. ఓపెన్‌ఏఐ సంస్థ తన కుమారుడిని హత్య చేసిందని పూర్ణిమారావు ఆరోపించిన సంగతి తెలిసిందే. ఆ సంస్థకు వ్యతిరేకంగా తన కుమారుడి వద్ద ఆధారాలు ఉన్నాయని, వారు ఏం చేస్తున్నారనే విషయాలు అతడికి తెలుసన్నారు. తమ రహస్యాలు ఎవరికీ తెలియకుండా ఉండాలన్న కారణంతోనే తన బిడ్డను పొట్టనపెట్టుకున్నట్లు ఆరోపించారు. "నా కుమారుడు చనిపోవడానికి ఒకరోజు ముందు పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్నాడు. ఒకవేళ తను ఆత్మహత్య చేసుకోవాలనుకుంటే ఆ వేడుకలు జరుపుకొనేవాడా?" అని ప్రశ్నించారు.
"కేవలం 14 నిమిషాల వ్యవధిలోపే తన కుమారుడి మృతిని ఆత్మహత్యగా అధికారులు తేల్చారు" అని పూర్ణిమ పేర్కొన్నారు. అధికారులు పూర్తి సమాచారం తెలియజేయట్లేదని, వాళ్లు పారదర్శకంగా వ్యవహరించట్లేదన్నారు. కాగా ఈ ఇంటర్వ్యూ పోస్టును ఎలాన్ మస్క్ ఎక్స్‌లో పోస్టు చేశారు. తీవ్రమైన ఆందోళన కలిగించేదిగా మస్క్ పేర్కొన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని తన అపార్ట్‌మెంట్‌లో గతేడాది నవంబర్ 26న బాలాజీ మృతి చెందాడు. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు దీన్ని ఆత్మహత్యగా పేర్కొన్నారు. దీంతో బాలాజీ మృతిపై అతడి తల్లి పూర్ణిమారావు న్యాయపోరాటానికి దిగారు.

# సోషల్ మీడియాలో పాకిస్థాన్ అనుకూల పోస్టు.. యూపీ యువకుడు అరెస్టు

లక్నో: సామాజిక మాధ్యమాల్లో పాకిస్థాన్ అనుకూల నినాదాలు పోస్టు చేసిన వ్యక్తిని ఉత్తరప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. యూపీలోని బరేలీలో ఉన్న నవాబ్‌గంజ్ ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి తన సోషల్ మీడియా అకౌంట్‌లో పాకిస్థాన్‌జిందాబాద్ అని రాసి పోస్టు చేశాడు. అదికాస్తా వివాదానికి దారితీసింది. తమ మనోభావాలు దెబ్బతీసేలా పోస్టు చేశాడంతూ వినియోగదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆధారాలను సేకరించిన తర్వాత ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రజల మనోభావాలను కించపరిచేలా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పాకిస్థాన్ జిదాబాద్ అంటూ స్లోగన్‌ను పోస్టు చేసినందుకు అతడిని అరెస్టు చేశామని బరేలీ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్ శర్మ తెలిపారు. ఈ ఘటనలో దర్యాప్తు కొనసాగతున్నదని వెల్లడించారు.

# ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి క్యాపిటల్ దాడి నిందితులు



**వాషింగ్టన్:** డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల్లో అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయను న్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్ క్యాపిటల్‌పై దాడి చేసిన ఆయన మద్దతుదారులు (పాల్గొననున్నారు.జనవరి 20న వాషింగ్టన్ డీసీలో జరిగే ఈ వేడుకకు హాజరయ్యేందుకు వారు కోర్టు నుంచి అనుమతి తీసుకున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.
2020లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ పరాజయం పాలయ్యారు. తర్వాత 2021 జనవరి 6న అమెరికా అధ్యక్షుడిగా బైడెన్ విజయాన్ని ధ్రువీకరించేందుకు వాషింగ్టన్ క్యాపిటల్ భవనంలో కాంగ్రెస్ సమావేశమైంది. అయితే ఆ సమావేశం జరగడానికి కొన్ని గంటల ముందు ట్రంప్ తన మద్దతుదారులను ఉద్దేశిస్తూ ప్రసంగించారు. అనంతరం ట్రంప్ మద్దతుదారులు వేలాదిగా క్యాపిటల్ భవనంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించారు. ఆ ఘటన ప్రపంచం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది.అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని, బైడెన్ విజయాన్ని ధ్రువీకరించకుండా కాంగ్రెస్‌ను ఆపేందుకే క్యాపిటల్ భవ నంపై ట్రంప్ మద్దతుదారులు దాడికి పాల్పడ్డారని వాషింగ్టన్ ఫెడరల్ కోర్టులో అభియోగాలు నమోదయ్యాయి. ఆ ఛార్జ్‌షీట్‌లో ట్రంప్ పేరు కూడా ఉంది. ఇక తాము ట్రంప్ ప్రమాణస్వీ కారోత్సవానికి హాజరయ్యేందుకు అనుమతివ్వాలంటూ సుమారు 20 మంది ముద్దాయిలు కోర్టును ఆశ్రయించగా.. వారిలో పలువురికి అనుమతి లభించిందని ఆ కథనాలు పేర్కొన్నాయి.

# సైఫ్‌పై పదేపదే దాడి చేశాడు : కరీనా కపూర్

ముంబై: సైఫ్ అలీఖాన్‌పై దాడి జరిగిన ఘటన గురించి కరీనా కపూర్ పోలీసులకు వివరించింది. ఇంట్లోకి చొరబడిన వ్యక్తి.. దూకుడుగా దాడి చేసినట్లు ఆమె చెప్పింది. అయితే ఆ దుండగుడు ఇంట్లో ఉన్న ఆభరణాలను టచ్ చేయలేదని తెలిపింది. బాంద్రా అపార్ట్‌మెంట్‌లో జరిగిన అటాక్ గురించి పోలీసులకు ఆమె తెలియజేసింది. సైఫ్‌తో ఘర్షణ జరిగిన సమయంలో ఆ వ్యక్తి చాలా దూకుడుగా వ్యవహరించినట్లు చెప్పింది. పదేపదే సైఫ్‌పై అటాక్ చేయడాన్ని చూశానని కరీనా తెలిపింది.సైఫ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకే ప్రియార్టీ ఇచ్చినట్లు పేర్కొన్నది. దాడితర్వాత దుండగుడు పారిపోయాడని, విలువైన వస్తువుల్ని ఏమీ తీసుకెళ్లలేదని కరీనా తెలిపింది. పిల్లలు తైమూర్, జెహంగిర్ ను రక్షించే ఉద్దేశంతో ఖాన్ ప్రతిదాడి చేసినట్లు ఆమె చెప్పింది. జెహంగిర్ వద్దకు దుండుగడు చేరుకోలేకపోయాడని, ఆ టైంలో ఖాన్‌పై పలుమార్లు అతను అటాక్ చేసినట్లు ఆమె తెలిపింది. దాడి తర్వాత చాలా ఆందోళనకు గురయ్యానని, అందుకే సోదరి కరిశ్మా తనను ఆమె ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిపింది.అయితే ఇంకా సైఫ్ అలీ ఖాన్‌స్టేట్మెంట్‌ను తీసుకోలేదనిపోలీసులు తెలిపారు.

## కరువురహిత రాష్ట్రంగా తయారుకావాలంటే నదుల అనుసంధానం ఏకైక మార్గం : చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి :** ఏపీ కరువురహిత రాష్ట్రంగా తయారు కావాలంటే నదుల అను సంధానం ఏకైక మార్గమమని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కడప జిల్లా మైదుకూరులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతను ఉపయోగించుకుని నదుల అనుసంధానాన్ని సాధించడమే ధ్యేయమని పేర్కొన్నారు. గోదావరి -పెన్నా , పోలవరం ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్ రైట్ కెనాల్ వరకు గోదావరి జలాలు తీసుకొచ్చి రిజర్వాయర్ నిర్మించి అక్కడినుంచి వెలుగొండ వరకు నీరు ఇస్తామని అన్నారు. అక్కడి నుంచి నల్లమల ఫారెస్టు గుండా టన్నెల్ నిర్మించి బనకచర్ల వరకు నీళ్లు వస్తాయని వెల్లడించారు.తాను కూడా రాయలసీమలోనే పుట్టానని, రాయలసీమ బిడ్డగా ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. కడపలోని కొప్పర్తిని పారిశ్రామిక కేంద్రంగా తయారు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. కడపలో స్టీల్ ప్లాంట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ప్రపంచంలో పది టూరిస్టు ప్లేస్‌లో గండికోట ఒకటని, ఈ ప్రాంతాన్ని మంచి టూరస్టు హబ్‌గా మారుస్తామని అన్నారు.తెలుగు జాతి చరిత్ర ఉన్నంతవరకు తెలుగువారి గుండెల్లో ఉండే ఏకైక వ్యక్తి , అనుక్షణం తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం తపించిన నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు.. తెలుగువారి ఆత్మగౌరవమని అన్నారు. ప్రభుత్వం అంటే పాలకులు కాదు.. సేవకులని చెప్పిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని అభివర్ణించారు. రాజకీయమంటే పెత్తందారి విధానం కాదు.. పేదల జీవితాలు మార్చేదని చేసి చూపించారని పేర్కొన్నారు. ఆడబిడ్డలకు చట్టసభల్లో రిజర్వేషన్లు వచ్చాయంటే దానికి ఎన్టీఆరే కారణమని అన్నారు.

## వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌పై ఆ ప్రచారం నమ్మొద్దు విద్యుత్ పంపిణీ సంస్థలు



**విశ్వంభర, విజయవాడ:** వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థలు స్పష్టం చేశాయి. రాష్ట్రంలో వ్యవసాయానికి 9గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎలాంటి మార్పులు లేవని తెలిపింది. సీపీడీసీఎల్ పరిధిలో వ్యవసాయానికి 7గంటలు మాత్రమే ఉచిత విద్యుత్ ఇస్తున్నారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలిపింది. వ్యవసాయానికి ఇస్తున్న 9గంటల ఉచిత విద్యుత్‌ను కుదించలేదని అధికారులు స్పష్టం చేశారు. గత రెండు రోజులుగా పొగ మంచు కారణంగా సౌర విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడడంతో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సమయం రీషెడ్యూల్ అయ్యిందన్నారు. రాష్ట్రంలో నిరంతరాయంగా వ్యవసాయానికి9గంటలపాటు విద్యుత్ సరఫరా జరుగుతోందని ఏపీ విద్యుత్‌పంపిణీ సంస్థలు వెల్లడించాయి.

## వైసీపీ వల్లే విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఆగింది మాజీ మంత్రి అమర్నాథ్



**విశ్వంభర, అమరావతి :** విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణం చేయడం వల్లే ప్రైవేటీకరణ ఆగిందని వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. విశాఖలో ఆయన మీడియాతో శనివారం మాట్లాడారు.స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు మొదటి నుంచి వైఎస్ జగన్ వ్యతిరేకమని తెలిపారు. నిన్న కేంద్రం విశాఖ స్టీల్‌కు ప్రకటించిన రూ. 11,440 కోట్ల ప్యాకేజీ కేవలంఆక్సిజన్‌లా పనిచేస్తుందని అన్నారు. కేంద్రం ఇచ్చే ప్యాకేజీ కేవలం అప్పులకే సరిపోతుందని వెల్లడించారు. స్టీల్ ప్లాంట్ అప్పులు కట్టలేని పరిస్థితిలో ఉందని తెలిపారు. ప్లాంట్‌ను కాపాడాలని ఉద్దేశ్యం ఉంటే ప్రైవేటీకరణ జరగదని ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు.స్టీల్ ప్లాంట్‌కు ట్యాక్స్ హాలీడే ఇవ్వాలని, ప్లాంట్‌ను సేయిల్‌లోవిలీనం చేయాలని, సొంతంగా గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కూటమి పాలన వచ్చిన తరువాత కార్మికులకు జీతాలు ఇవ్వలేదని,ఉద్యోగులను తొలగించారని ఆరోపించారు.గతంలోనూ ప్రభుత్వాలు స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీలు అందించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్లాంట్‌లో వీఆర్ఎస్‌ను ఎందుకు తీసుకువచ్చారని, 25 వేల మందితో నడవాల్సిన ఉండగా 10వేల మందితో నడుస్తుందని వివరించారు. ఇంకా ఉద్యోగులను తొలగిస్తే ప్లాంట్ ఎలా నడుస్తుందని ప్రశ్నించారు.

## అమిత్ షా కు ఆంధ్రాలో పర్యటించే హక్కు లేదు : వైఎస్ షర్మిల



**విశ్వంభర, అమరావతి :** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శనివారం ఏపీలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ఏర్పాట్లు చేయగా అమిత్ షా పర్యటనను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు నిరసనలు తెలుపాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్‌షర్మిల పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా ఆంధ్రలో అడుగుపెట్టే అర్హత లేదని ట్విటర్‌లో ఆరోపించారు.అమిత్ షా పర్యటనను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని వెల్లడిం చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేయాలని సూచించారు. దేశ ప్రజలకు వెంటనే అమిత్ షా బహిరంగ క్షమాపణలు చెప్పాలి. తక్షణం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాతను అవమానించడం అంటే దేశ ద్రోహంతో సమానమని అన్నారు.దేశ ద్రోహుల వ్యాఖ్యలను ఖండించకుండా, క్షమాపణలు చెప్పాలని అడగకుండా, అతిథి మర్యాదలు చేసే వాళ్ళు కూడా ఈ దేశానికి ద్రోహం చేసినట్లేనని ఏపీలో కూటమి నాయకులను విమర్శించారు. రాష్ట్రంలోని దళిత, బహుజన, ఆదివాసీ, మైనారిటీ ప్రజల మీద గౌరవం ఉంటే అమిత్ షాతో బహిరంగ క్షమాపణలకు డిమాండ్ చేయాలని కోరారు.

## నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్..

### పవన్ కల్యాణ్‌కు కాంపిటీషన్ ఇచ్చేందుకేనా?



**విశ్వంభర, అమరావతి:** ఏపీ రాజకీయాల్లో ఇప్పుడు ఓ కొత్త డిమాండ్ హాట్ టాపిక్‌గా మారింది. ఏపీ సీఎం చంద్రబాబు తనయుడు, మంత్రి నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని తెలుగు తమ్ముళ్ల నుంచి కొద్దిరోజులగా పెద్ద ఎత్తున డిమాండ్ వినిపిస్తుంది. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరుకు చెందిన టీడీపీ కార్యకర్తలు కొంతకాలంగా ఈ డిమాండ్ వినిపిస్తుండగా.. తాజాగా వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి సభలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి ఏకంగా తన కోరికను చంద్రబాబు ముందు ఉంచారు. నారా లోకేశ్‌ను ఉప ముఖ్యమంత్రి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఈ విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.నిజానికి ఏపీ కేబినెట్‌లో సీఎం చంద్రబాబు నాయుడు తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నంబర్ టూ పొజిషన్‌లో ఉన్నారు. అధికారికంగా ఎక్కడికి వెళ్లినా పవన్ కల్యాణ్‌కే ప్రాధాన్యత దక్కుతున్నది. దీంతో పవన్ కల్యాణ్ కంటే ఒక మెట్టుపైనే ఉండాలని లోకేశ్ ఆరాటపడుతున్నట్లు తెలుస్తోంది. అది కాకుండా తన తర్వాత తన కొడుకునే నంబర్ టూ పొజిషన్‌లో చూడాలని చంద్రబాబు కూడా అనుకుంటున్నట్లు సమాచారం. కానీ పవన్ కల్యాణ్ మాత్రం కూటమి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. పేరుకుకూటమిలో ఉన్నప్పటికీఇండిపెండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. తప్పు చేసింది కూటమి నేతలైనా సరే నిలదీస్తున్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని.. రాష్ట్రంలో శాంతి భద్రతలు సరిగ్గాలేవని..దీన్ని చక్కబెట్టేందుకు అవసరమైతే హోంశాఖను తానే తీసుకుం టానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇటీవల వైకుంఠ ద్వార దర్శనం టికెట్లకు సంబంధించిన క్యూలైన్లలో తొక్కిసలాట జరిగిన ఘటనలోనూ పవన్ కల్యాణ్ దూకుడుగా స్పందించారు. టీటీడీ ఈవో, చైర్మన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా పవన్ కల్యాణ్ వ్యవహరిస్తున్న తీరు చంద్రబాబు, లోకేశ్ సహా తెలుగు తమ్ముళ్లకు మింగుపడటం లేదు.

కూటమి ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ ఇప్పటికే కీలకంగా మారిపోయారు. ఇప్పుడు చంద్రబాబు తర్వాత నంబర్ టూ ఎవరంటే పవన్ కల్యాణ్ పేరే వినిపిస్తుంది. పైగా క్షేత్రస్థాయిలో కూటమి నాయకులు లోకేశ్ కంటే కూడా ఎక్కువగా పవన్ కల్యాణ్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే పవన్ కల్యాణ్ జనసేన పార్టీ కేడర్ ఓ రేంజ్‌లో బలపడిపోతుంది. ఇది లోకేశ్ రాజకీయ ఎదుగుదలతో పాటు టీడీపీపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని చంద్రబాబుతో సహా తెలుగు తమ్ముళ్లు భావిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అలా అని పవన్ కల్యాణ్‌ను హోదాను తగ్గించే పరిస్థితి లేదు. పవన్ కల్యాణ్‌పై ఎంత కోపం వచ్చినప్పటికీ పొత్తు కారణంగా వాళ్లు ఏమీ అనలేకపోతున్నారు. పైగా బీజేపీ , ప్రధాని మోడీతో చంద్రబాబు కంటే పవన్ కల్యాణ్‌కే ఎక్కువ సాన్నిహిత్యం ఉంది. దీంతో పవన్ కల్యాణ్‌ను డైరెక్ట్‌గా టచ్ చేసే పరిస్థితి లేదు. కాబట్టి పవన్ కల్యాణ్‌కు ధీటుగా లోకేశ్‌కు సమాన హోదా ఇస్తే బాగుంటుందని తెలుగు తమ్ముళ్లు భావిస్తున్నారు.నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడం వల్ల పవన్ కల్యాణ్ క్రేజ్‌కు క్షేత్రస్థాయిలో కొంచెంలో కొంచెమైనా చెక్ పెట్టవచ్చని టీడీపీ నాయకులు భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. వాస్తవానికి డిప్యూటీ సీఎం పదవి అనేది చట్టబద్ధం కాదు. ఒకరిద్దరికే పదవి ఇవ్వాలని కూడా లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ కేబినెట్‌లో ఐదుగురు మంత్రులకు డిప్యూటీ సీఎం హోదా ఇచ్చారు. అంతకుముందు చంద్రబాబు హయాంలో కూడా ఒకరికంటే ఎక్కువ మందికి ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చారు. కానీ ఇప్పుడు మాత్రం పవన్ కల్యాణ్ ఒక్కడే డిప్యూటీ సీఎం పదవిలో ఉన్నారు. కాబట్టి నారా లోకేశ్‌కు కూడా డిప్యూటీ సీఎం ఇస్తే వచ్చే నష్టమేమీ లేదు. అందుకే తెలుగు తమ్ముళ్ల నుంచి ఈ వాదనను బలంగా తీసుకొస్తున్నారు. ఇప్పటికే ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు నుంచి టీడీపీ నాయకుల నుంచి ఈ వాదన వినిపించగా.. తాజాగా వైఎస్ఆర్ జిల్లాలో కూడా టీడీపీ నేతల నుంచి ఈ వాదనను తీసుకొచ్చారని అనుకుంటున్నాయి. మరి నిజంగా పవన్ కల్యాణ్‌కు కాంపిటీషన్‌గా లోకేశ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారో లేదో చూడాలి.

## పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన పవన్



**విశ్వంభర, గుంటూరు:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. గుంటూరు జిల్లా నంబూరులో ఆయన పర్యటించారు. 'స్వచ్ఛత దివస్' కార్యక్రమంలో పాల్గొన్నారు. పారిశుద్ధ్య తరలింపు వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో మొక్కలు నాటారు. "ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించాలని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నాం. పరిశుభ్రత ప్రాధాన్యత కరోనా సమయంలో అందరికీ తెలిసి వచ్చింది. పరిసరాలను శుభ్రంగా ఉంచటం అనేది ఏ ఒక్కరి వల్లో అయ్యేది కాదు.. అందరూ బాధ్యత తీసుకోవాలి. పరిశుభ్రత మన జీవితంలో భాగం కావాలని చంద్రబాబు ఆకాంక్ష. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అనేది తేలికైన విషయం కాదు. వెంటనే అద్భుతాలు ఆశించలేం కానీ.. ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు" అని పవన్ అన్నారు.

## పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ప్రారంభం



**విశ్వంభర, పోలవరం:** పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించిన పనులను కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది. 1.396 కిలోమీటర్ల పొడవైన డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందించారు. 1.5 మీటర్ల మందంతో నది ప్రవాహ మార్గంలో భూమి లోపల దీని నిర్మాణం చేపట్టనున్నారు. పాత డయాఫ్రమ్ వాల్‌కు 6 మీటర్ల ఎగువన కొత్త నిర్మాణం చేపట్టనున్నారు. సగం నిర్మాణం పూర్తి కాగానే సమాంతరంగా దాని పైన ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణ షెడ్యూలు జారీ చేసింది. కొత్త డయాఫ్రం వాల్ కోసం రూ.990 కోట్లు ప్రభుత్వం వ్యయం చేయనుంది.

## 'మా' కు జేసీ ప్రభాకర్‌రెడ్డిపై నటి మాధవిలత ఫిర్యాదు



**హైదరాబాద్ :** సినిమా రంగంలో ఉన్న మహిళలపై అనుచితంగా మాటలాడిన టీడీపీ నాయకుడు జేసీ ప్రభాకర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సినీ నటి మాధవి లత కోరారు. ఈ మేరకు శనివారం 'మా' అసోసియేషన్ ట్రెజరర్‌శివ బాలాజీకి ఫిర్యాదును అందజేశారు.సినీరంగంలోని మహిళలపై జరుగుతున్న వ్యక్తిత్వ హననం చేస్తూ సినిమా వారిపై ఆరోపణలు చేయడం కరెక్టు కాదంటూ పేర్కొన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ఫిల్మ్ ఛాంబర్‌తో పాటు మానవహక్కుల సంఘానికి, పోలీసులకు, ఫిల్మ్ ఇండస్ట్రీకి ఫిర్యాదు చేశాను. ఎవరూ స్పందించలేదు. అందుకే 'మా' కు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. న్యాయం కోసం పోరాడుతానంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

### అసలు ఏం జరిగిందంటే ?..

డిసెంబర్ 31న రాత్రి నూతన సంవత్సరం సందర్భంగా తాడిపత్రిలో జేసీ పార్కులో మహిళలకు మాత్రమే అంటూ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనిపై మాధవి లత స్పందించింది. ఇలాంటి వేడుకలకు వెళ్లవద్దని, తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి వేళ ఏదైనా జరిగితే ఎవరు కాపాడుతారని పోస్టు చేశారు.ఈ పోస్టుపై స్పందించిన జేసీ ప్రభాకర్ రెడ్డి మాధవిలతపై తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. ఆమె వ్యభిచారి అంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. ఈ వ్యాఖ్యలపై ఆ తరువాత జేసీ ప్రభాకర్‌రెడ్డి క్షమాపణలు కోరారు. క్షమాపణలు చెప్పిన తరువాత కూడా మాధవి మరో వీడియోను షేర్ చేసింది.మహిళల మాన, ప్రాణ రక్షణ గురించి మాట్లాడినందుకు తనను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని వీడియోలో కన్నీళ్లు పెట్టుకుంది. మామూలుగా ఉందామని చాలా ప్రయత్నించా.. కానీ నా వల్ల కావడం లేదంటూ వాపోయింది. తెరమీద కనిపించే వాళ్లందరూ వ్యభిచారులేనంటు అనడం ఆయన కుసంస్కారానికి నిదర్శనమని మాధవీలత ఆరోపించారు.

## 68 ఏళ్ల బామ్మతో 64 ఏళ్ల తాత పెళ్లి.. ఏపీలో అరుదైన వివాహం



**విశ్వంభర, రాజమహేంద్రవరం:** ఆ తాతకు 64 ఏళ్లు.. బామ్మకు 68 ఏండ్లు.. వయసైపోయి వృద్ధాశ్రమానికి చేరిన వారిద్దరూ అక్కడే ఇష్టపడ్డారు. ఇద్దరి మనసులు కలవడంతో ఈ లేటు వయసులోనే పెళ్లి చేసుకుని ఒకరికొకరు తోడు నీడగా నిలవాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని ఆశ్రమ నిర్వాహకుడికి చెప్పారు. తోటి వృద్ధుల సమక్షంలో ఆ వృద్ధాశ్రమంలోనే దండలు మార్చుకుని ఒక్కటయ్యారు. ఏపీలోని రాజమహేంద్రవరంలో ఈ అరుదైన వివాహం జరిగింది. రాజమహేంద్రవరంలోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో నారాయణపురానికి చెందిన మడగల మూర్తి (64) రెండేళ్లుగా తలదాచుకుంటున్నాడు. కొంతకాలం క్రితం మూర్తి తీవ్ర పక్షవాతానికి గురయ్యాడు. ఎవరో ఒకరు సాయం చేస్తే తప్ప కదల్లేని పరిస్థితి ఉండేది. అలాంటి సమయంలో అదే ఆశ్రమంలో ఉంటున్న వైఎస్ఆర్ జిల్లా పెనగలూరు మండలం కమ్మలకుంటకు చెందిన గజ్జల రాములమ్మ (68) అతనికి అండగా నిలబడింది. రాత్రి పగలు తేడా లేకుండా అన్నీ తానై మూర్తికి సపర్యలు చేసింది. రాములమ్మ సహకారంతో మూర్తి తొందరగానే కోలుకున్నాడు.ఆరోగ్యం కుదుటపడిన తర్వాత మూర్తి బుర్రను ఒక ఆలోచన తొలిమేసింది. వయసులో ఉన్నప్పటికంటే కూడా వయసుపైబడిన ఈ వయసులోనే ఒక తోడు అవసరమని అనిపించింది. జంటగా ఉంటే కష్టకాలంలో ఒకరికొకరు తోడుగా నిలబడవచ్చని భావించాడు. తనను కంటికి రెప్పలా కాపాడిన రాములమ్మను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయాన్ని రాములమ్మతో చర్చించగా.. ఆమె కూడా ఒప్పుకుంది. దీంతో తన నిర్ణయాన్ని ఆశ్రమ నిర్వాహకుడు గుబ్బల రాంబాబుకు చెప్పడంతో అతని నిర్ణయంతో ఏకీభవించాడు. ఆ వృద్ధ జంటకు శుక్రవారం ఆశ్రమంలోనే పెళ్లి చేశాడు.

## ఎన్టీఆర్‌కు భారతరత్న వస్తుందని ఆశిస్తున్నాం: లోకేశ్



**విశ్వంభర, హైదరాబాద్:** ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ , నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించారు. నాయకుడిగా, సీఎంగా ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. నాడు ఎన్టీఆర్ ప్రభంజనం సృష్టించి తెదేపాను అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. అనేక సంస్కరణలు తెచ్చారని చెప్పారు. తెదేపాలో కోటి మంది సభ్యత్వాలు తీసుకోవడం గర్వకారణమన్నారు. తెలుగు జాతి ఎక్కడ ఉన్నా అగ్రస్థానంలోకి ఎదగాలని లోకేశ్ ఆకాంక్షించారు."ఎన్టీఆర్ రాజకీయాల్లో మహానాయకుడిగా రాణించారు. ఎన్టీఆర్ అనేది ఒక పేరు కాదు.. ప్రభంజనం. రెండు రూపాయలకు కిలో బియ్యం, మహిళలకు ఆస్తుల్లో సమాన వాటా తదితర సంస్కరణలు తీసుకొచ్చారు. ఆయకు తప్పనిసరిగా భారతరత్న వస్తుందని ఆశిస్తున్నాం. తెలుగు ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తాం. విశాఖ ఉక్కును కాపాడుకుంటున్నాం. తెలంగాణలో పార్టీ పునర్నిర్మాణంపై చర్చిస్తున్నాం. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం. తెలంగాణలో 1.60 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. తెదేపాపై తెలంగాణ ప్రజలకు ప్రేమ, ఆశ ఉంది" అని నారా లోకేశ్ తెలిపారు.

## ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ప్రజాసేవకు అందరికంటే ముందుంటాం: నారా భువనేశ్వరి



విశ్వంభర, హైదరాబాద్: ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నటుడు ఎన్టీఆర్ అని నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ఆమె నివాళి అర్పించి మాట్లాడారు. రాజకీయ రంగంలో ఆయన చెరగని ముద్ర వేశారన్నారు. ఎన్టీఆర్ ప్రజలకు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివన్నారు. ఆయన సేవలను ముందుకు తీసుకెళ్లేందుకు ఎన్టీఆర్ ట్రస్టును ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. దీని ద్వారా పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. "ఎన్టీఆర్ సిద్ధాంతాలను ట్రస్టు పాటిస్తోంది. ఆయన వర్ధంతికి ఏటా లెజెండరీ బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహిస్తున్నాం. మీరు ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు.. మరొకరి జీవితంలో సంతోషాన్ని ఇస్తుంది. నాటి నుంచి నేటి వరకు ట్రస్టుకు 8.70 లక్షల మంది రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు, ప్రభుత్వ ఆసుపత్రులకు రక్తాన్ని అందించాం. చర్లపల్లి ఎన్టీఆర్ ట్రస్టు స్కూల్‌లో ఉచిత విద్య, వసతి, భోజనం కల్పిస్తున్నాం. మెరిట్ స్టూడెంట్లకు స్కాలర్‌షిప్స్ ఇస్తున్నాం. ట్రస్టు ద్వారా ప్రజాసేవకు అందరికంటే ముందుంటాం. తుపాన్లు, కొవిడ్ సమయాల్లో అనేక సేవలు అందించాం" అని నారా భువనేశ్వరి తెలిపారు.

## ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై లోకేశ్ అసంతృప్తి.. సొంత నిధులతో మరమ్మతులకు ఆదేశం

విశ్వంభర, హైదరాబాద్: నగరంలోని ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై ఏపీ మంత్రి నారా లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సొంత నిధులతో మరమ్మతులు చేపట్టాలని తన సిబ్బందిని ఆదేశించారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించేందుకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌కు లోకేశ్ వెళ్లారు. ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులూడిపోవడం, గార్డెన్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని గమనించారు.అవసరమైన అనుమతులు తీసుకొని వీలైనంత తొందరగా ఘాట్ మరమ్మతులు సొంత నిధులతో పూర్తి చేయాలని లోకేశ్ నిర్ణయించారు. వెంటనే పనులు ప్రారంభించాలని తన సిబ్బందిని ఆదేశించారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్ఎండీఏ తీరు పట్ల ఎన్టీఆర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలను ఎన్టీఆర్ ట్రస్ట్‌కు అప్పగించాలని పలుమార్లు గత తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని లోకేశ్ తెలిపారు.




# కోచ్‌గా కెప్టెన్ నిర్ణయాలపై నమ్మకం ఉంచుతాడు

## గంభీర్‌తో మనస్పర్ధలపై రోహిత్

**ముంబయి:** ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును ప్రకటించిన సమయంలో కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ సెలక్టర్ పలు విషయాలపై స్పందించారు. స్క్వాడ్‌లోకి కొందరికి అవకాశం దక్కకపోవడానికి కారణాలను వెల్లడించారు. దేశవాళీలో నాణ్యమైన క్రికెట్ ఆడినప్పటికీ కరుణ్ నాయర్‌కు అవకాశం ఇవ్వలేకపోయామని.. శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్సీని సమర్థంగా నిర్వర్తించగలడనే నమ్మకం ఉందని వెల్లడించారు. కోచ్‌తో తనకు మనస్పర్ధలు వచ్చినట్లు ఇటీవల సోషల్ మీడియాలో సాగుతోన్న ప్రచారాన్ని రోహిత్ తోసిపుచ్చాడు. గంభీర్‌తో తన సంబంధంపై వివరణ ఇచ్చాడు. సీనియర్ ఆటగాళ్లు దేశవాళీలో ఆడే అంశంపైనా స్పందించాడు.

''గత ఆరేడేళ్లుగా జాతీయ జట్టుకు ఆడే ప్లేయర్లకు దేశవాళీలో పాల్గొనేంత సమయం లేదు. ఏడాది పొడవునా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతున్నప్పుడు.. కచ్చితంగా బ్రేక్ కావాలి. ఇలాంటప్పుడు డొమెస్టిక్ క్రికెట్ ఆడటం చాలా కష్టం. ఆ మ్యాచ్‌లు ఆడకుండా కావాలని తప్పించుకోవడానికి ఎవరూ ప్రయత్నించరు. ఈసారి నేను ముంబయి జట్టుకు ఆడుతున్నా. జమ్ముకశ్మీర్‌తో మ్యాచ్ ఆడేందుకు రెడీ అవుతున్నా. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన జట్టులో సిరాజ్‌ను కాకుండా అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం ఇచ్చాం. బుమ్రా ఫిట్‌నెస్ ఎలా ఉందనేది ఇంకా తెలియని పరిస్థితి. అతడు అందుబాటులో ఉన్నా లేకున్నా అర్ష్‌దీప్ జట్టులో ఉంటే వికెట్‌కు రెండువైపులా బౌలింగ్ చేయగలడు. సీనియర్ పేసర్ షమీ ఎలానూ ఉన్నాడు. ఇటీవల సిరాజ్ ప్రభావవంతంగా బౌలింగ్ చేయడంలో ఇబ్బంది పడుతున్నాడు. ఈసారి మేం కేవలం ముగ్గురు పేసర్లను మాత్రమే తీసుకున్నాం. ఆల్‌రౌండర్లు ఎక్కువగా ఉన్నారు. గౌతమ్ గంభీర్‌తో పొసగడం లేదని అంతా అనుకుంటున్నారు. మైదానంలో దిగాక కెప్టెన్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానిని గౌరవించే కోచ్ గంభీర్. మా మధ్య అలాంటి నమ్మకం ఉంది'' అని వెల్లడించాడు.

### బుమ్రా కనీసం ఐదు వారాలు..: అగార్కర్

''ఆస్ట్రేలియా పర్యటన తర్వాత కనీసం ఐదు వారాల విరామం కావాలని బుమ్రా అడిగాడు. ఇంగ్లండ్‌తో తొలి రెండు వన్డేలకు అందుబాటులో ఉండడు. ఒకవేళ మూడో మ్యాచ్‌కు సిద్ధమైతే ఆడతాడు. లేకపోతే నేరుగా ఛాంపియన్స్ ట్రోఫీ బరిలో దిగుతాడు. ఫిబ్రవరి మొదటి వారంలో బుమ్రా ఫిట్‌నెస్‌పై అప్‌డేట్ రానుంది. ఇక దేశవాళీలో బాగా ఆడిన కరుణ్ నాయర్‌కు అవకాశం కల్పించలేకపోయాం. శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్సీ అప్పగించాం. గతంలో శ్రీలంకతో సిరీస్‌లో గిల్ సారథ్యం వహించాడు. డ్రెస్సింగ్ రూమ్ నుంచి చాలా ఫీడ్‌బ్యాక్ తీసుకున్నాం. తప్పకుండా అతడు సక్సెస్ అవుతాడని భావిస్తున్నాం. ప్రతి క్రికెటర్‌ను దేశవాళీలో ఆడాలని చెప్పడం వెనుక చాలా కారణాలు ఉంటాయి. వారికి సమయం అందుబాటులో ఉన్నప్పుడు తప్పకుండా ఆడతారు. బీసీసీఐ ఆదేశాల్లోనూ ఇదే అంశం ఉంది'' అని బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు.



# ఛాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు వచ్చేసింది

### వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్

**ముంబయి:** ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభం కానుంది. ఎనిమిది దేశాలు తలపడే ఈ టోర్నీ కోసం బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 15 మందితో కూడిన టీమ్‌ను వెల్లడించారు. ఏమైనా మార్పులు చేసుకోవడానికి ఫిబ్రవరి 13 వరకు అవకాశం ఉంది. అంతకుముందు వాంఖడే మైదానంలోనే దాదాపు రెండున్నరగంటలకుపైగా బీసీసీఐ సమావేశం జరిగింది. దీనికి ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ హాజరు కాలేదు. శుక్రవారమే తన నివేదికను సమర్పించినట్లు వార్తలు వస్తున్నాయి. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కూ ఇదే జట్టు కొనసాగుతుందని బీసీసీఐ వెల్లడించింది. ఫిబ్రవరి 6 నుంచి 12 మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ Aలో భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లు ఉన్నాయి. బంగ్లాదేశ్‌తో ఫిబ్రవరి 20న, పాక్‌తో ఫిబ్రవరి 23న, న్యూజిలాండ్‌తో మార్చి 2న టీమ్‌ఇండియా దుబాయ్ వేదికగా తలపడనుంది. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఈ ఐసీసీ టోర్నీ జరగబోతోంది. దాయాది దేశం పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. భారత్ ఆడే మ్యాచ్‌లు యూఏఈలోనూ జరగనున్నాయి. చివరిసారిగా టీమ్‌ఇండియా 2013లో ధోనీ నాయకత్వంలో విజేతగా నిలిచింది.

**జట్టు ఇదే..**

రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, హార్దిక్ పాండ్య, కుల్‌దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, షమీ, అర్ష్‌దీప్ సింగ్

# రోహిత్ - విరాట్.. బోత్ ఆర్ నాట్ సేమ్

## భారత మాజీ క్రికెటర్




**ముంబయి:** రోహిత్ శర్మ నాయకత్వంలోనే వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు భారత్ వెళ్లింది. గత టీ20 ప్రపంచ కప్‌ను టీమ్‌ఇండియా సొంతం చేసుకుంది. కానీ, వరుసగా న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లను కోల్పోవడంతో అతడిపై తీవ్రస్థాయిలో విమర్శలు రేగాయి. కెప్టెన్‌గానే కాకుండా.. వ్యక్తిగతంగానూ దారుణంగా విఫలం కావడం అభిమానులను నిరాశకు గురిచేసింది. మరోవైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఆసీస్‌పై మంచి రికార్డు ఉన్న అతడు.. ఇటీవల ముగిసిన బోర్డర్ -గావస్కర్ ట్రోఫీలో మాత్రం తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. వీరిద్దరి టెస్టు భవిష్యత్తు సందిగ్ధంలో పడింది. ఈక్రమంలో భారత మాజీ క్రికెటర్ దీప్‌దాస్ గుప్తా స్పందిస్తూ.. రోహిత్‌కు రాబోయే ఐదు నెలలు అత్యంత కీలకమని వ్యాఖ్యానించాడు. రోహిత్‌తో విరాట్‌ను పోల్చడం సరైంది కాదని వ్యాఖ్యానించాడు.

''ఎప్పుడూ ఒక తరానికి చెందిన ఇద్దరు క్రికెటర్లను పోల్చకూడదు. రోహిత్, విరాట్‌ను కలిపి విశ్లేషించకూడదు. గతతరం దిగ్గజ క్రికెటర్లు సచిన్, రాహుల్ ద్రవిడ్ విభిన్నమైన ప్లేయర్లు. అందుకే, ప్రతి ఆటగాడిని వ్యక్తిగతంగానే విశ్లేషించాలి. రోహిత్‌కు వచ్చే ఐదు నెలలు అత్యంత కీలకం. పరిమిత ఓవర్ల క్రికెట్ ఎక్కువగా ఆడతాడు. ఐపీఎల్ కూడా ఉంది. దేశవాళీలోనూ ఆడితే మాత్రం ఫామ్‌ను అందుకోవచ్చు. ఫిట్‌నెస్‌తోపాటు ఛాంపియన్స్ ట్రోఫీలో నిలకడైన ప్రదర్శనే కీలక అంశాలుగా మారతాయి. అప్పుడే టెస్టు సిరీస్‌కు అతడిని ఎంపిక చేయాలా? వద్దా? అని సెలక్టర్లు ఓ నిర్ణయానికొస్తారు. విరాట్ కోహ్లీ బలహీనతతో ఇబ్బందిపడుతున్నాడు. దానిని అధిగమిస్తే అతడికి తిరుగుండదు. ఫిట్‌నెస్ విషయంలో కోహ్లీ అందరికంటే మెరుగ్గా ఉంటాడని తెలిసిందే'' అని దీప్‌దాస్ గుప్తా వెల్లడించాడు.

### సచిన్‌లా రోహిత్‌దే తుది నిర్ణయం: మంజ్రేకర్

''భారత క్రికెట్‌లో రిటైర్మెంట్‌పై సదరు ప్లేయరే తుది నిర్ణయం తీసుకుంటాడు. సచిన్ తెందూల్కర్ కూడా తన భవిష్యత్తును నిర్ణయించుకున్నాడు. ఇప్పుడు రోహిత్ కూడా తీసుకుంటాడు. ఎందుకంటే రిటైర్మెంట్ వ్యక్తిగత నిర్ణయం. ఆటగాడిగా ఎంతమేరకు ఆడగలమనేది బయట వ్యక్తులు నిర్ణయించలేరు. ఫామ్‌తో ఇబ్బంది పడుతూనే ఉంటే మాత్రం సెలక్టర్లే నిర్ణయిస్తారు'' అని భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు.

### మళ్లీ విజేతగా.. డిఫెండింగ్

## ఛాంపియన్‌కే ఎక్కువ అవకాశం

**సునీల్ గావస్కర్**



**ముంబయి:** ఫిబ్రవరి 19 నుంచి ఎనిమిది దేశాలు తలపడే ఛాంపియన్స్ ట్రోఫీ మొదలుకానుంది. చివరిసారిగా 2017లో ఈ టోర్నీ జరిగింది. ఇప్పుడు పాకిస్థాన్ ఆతిథ్యంలో మళ్లీ సిద్ధమైంది. అయితే, భారత్ ఆడే మ్యాచులు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. తాజాగా టీమ్‌ఇండియా తన స్క్వాడ్‌ను ప్రకటించింది. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ (Sunil Gavaskar) విజేతగా ఎవరు నిలుస్తారనేదానిపై విశ్లేషించాడు. తీవ్ర పోటీ ఉన్నప్పటికీ.. డిఫెండింగ్ ఛాంపియన్‌గా నిలిచిన పాక్‌కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్యానించాడు. ''ఛాంపియన్స్ ట్రోఫీలో ఫేవరెట్లు అనే ట్యాగ్‌లైన్‌ను హోమ్ టీమ్‌కే ఇవ్వాలి. వారి దేశంలో పాక్‌ను ఓడించడం తేలికైన విషయం కాదు. స్వదేశంలో జరిగిన గత వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌కు భారత్ వెళ్లిన సంగతి గుర్తు పెట్టుకోవాలి. తుది పోరులో ఓడినప్పటికీ.. వరుసగా మ్యాచ్‌లను గెలుచుకుంటూ వచ్చింది. ఇప్పుడు కూడా పాక్‌కు అలాంటి అవకాశమే ఉంది. స్వదేశంలో ఆ జట్టును ఓడించడం కష్టసాధ్యమే. అందుకే, దాయాది దేశాన్ని ఫేవరెట్‌గా భావిస్తున్నా'' అని గావస్కర్ వెల్లడించాడు.

# పాత చట్టానికే 'హైడ్రా' అని పేరు పెట్టింది

**విశ్వంభర, హైదరాబాద్:**

కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఏడు నెలలుగా జీహెచ్ఎంసీ పరిధిలోని వీధిలైట్ల నిర్వహణకు నిధుల కొరత ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను అప్పుల రాష్ట్రంగా చేస్తే.. అదే విధానాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోందని విమర్శించారు. చెరువుల కబ్జాను అరికట్టే చట్టం గతంలో కూడా ఉందని.. పాత చట్టానికే కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా అని పేరు పెట్టిందన్నారు. మెట్రో రెండో దశకు కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తుందని.. అది తమ బాధ్యత అని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఒక్క బీజేపీకి మాత్రమే ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.బీజేపీ హైదరాబాద్ నగర కార్యాలయంలో జరిగిన సంవిధాన్ గౌరవ్ అభియాన్ బీజేపీ వర్క్‌షాప్ కార్యక్రమం అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగం విషయంలో కాంగ్రెస్ పార్టీ తీరు చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా ఉంది. భారత రాజ్యాంగాన్ని అనేక రకాలుగా అవమానించి తమ రాజకీయ అవసరాలకు అనుకూలంగా మార్పులు చేసుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీది. తన ప్రధాని పదవిని రక్షించుకోవడం కోసం నిస్సిగ్గుగా రాజ్యాంగాన్ని ఉల్లంఘించి ఏ రకంగా ఎమర్జెన్సీని విధించి, ఎలాంటి నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీ ఇందిర గాంధీ తీసుకున్నారో దేశ ప్రజలందరికీ తెలుసు. ప్రధానమంత్రి పదవిని కాపాడుకోవడం కోసం ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి ఈ దేశంలో పత్రిక స్వేచ్ఛను హరించివేయడమే కాకుండా లక్షలాదిమందిని జైల్లో పెట్టి వేలాది సంస్థలను నిషేధించి అధికార దుర్వినియోగానికి పాల్పడిన నీచ సంస్కృతి కాంగ్రెస్ పార్టీది. ఈ సత్యాలన్నీ మన కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అనేకసార్లు మహిళలు హక్కుల విషయంలో కావచ్చు లేక మైనార్టీల హక్కులను కలరాసింది. అధికార దాహంతో అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించింది, ప్రజల తీర్పును కాలరాసి ఎన్టీ రామారావు ప్రభుత్వాన్ని ఏ రకంగా గద్దెదించే ప్రయత్నం చేసింది. అనేక సందర్భాల్లో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగని అపహాస్యం చేస్తూ అవహేళనకు గురి చేసింది, రాజ్యాంగా అమలును నిర్వీర్యం చేసింది. అటువంటి కాంగ్రెస్ పార్టీ ఈరోజు రాజ్యాంగం గురించి మాట్లాడుతు దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు భారతీయ జనతా పార్టీని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటు. బీజేపీ, నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉన్నటువంటి కేంద్ర ప్రభుత్వానికి డాక్టర్ బాబా అంబేద్కర్ అన్నా భారత రాజ్యాంగం అన్నా అత్యంత విశ్వాసం గౌరవం ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే భారత రాజ్యాంగాన్ని తన నుదుటితో నమస్కరించి పార్లమెంట్లో అడుగుపెట్టిన చరిత్ర మోడీది బీజేపీ పార్టీకి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి అంబేద్కర్ పై గౌరవం ఉంది వారు రచించిన రాజ్యాంగం పై విశ్వాసం ఉంది. కాబట్టే రాజ్యాంగం ఈ దేశంలో అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజు నుంచి వచ్చే సంవత్సరం పాటు భారత రాజ్యాంగం యొక్క గౌరవ ఉత్సవాలను భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో నిర్వహించబోతున్నాం. అది భారత రాజ్యాంగం పట్ల అంబేద్కర్ పట్ల భారతీయ జనతా పార్టీకి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఉన్న గౌరవం కమిట్మెంట్ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ ప్రజల అవసరాల కోసం దేశం కోసం కొన్ని సందర్భాల్లో రాజ్యాంగంలో కొన్ని సవరణలు చేసామే తప్ప అధికారం కోసమో రాజకీయ అవసరాల కోసమో రాజ్యాంగాన్ని మార్చే సంస్కృతి మాది కాదు అది కాంగ్రెస్ పార్టీది ప్రధాని పదవిని రక్షించుకోవడం ఇందిరాగాంధీ కుర్చీ రచించుకోవడం కోసం దేశ ప్రజల తీర్పుల్ని సైతం అపహస్యం చేస్తూ ప్రభుత్వాలు రద్దు చేస్తూ రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసినటువంటి చీకటి చరిత్ర కాంగ్రెస్ పార్టీది రాజ్యాంగ విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరించిన విధానాలు రాజ్యాంగం పట్ల కాంగ్రెస్ పార్టీ వైఖరిని దేశ ప్రజలకు వివరిస్తాం ప్రజల్లోకి ఈ సందర్భంగా తీసుకెళ్తాం భారత రాజ్యాంగ గౌరవ ప్రచార కార్యక్రమాలు ఒక సంవత్సరం పాటు ఇంటింటికి తీసుకెళ్తాం. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన తీరును సైతం ప్రజలకు వివరిస్తాం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా డాక్టర్ ఎన్ గౌతమ్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బడ్జెట్ సమావేశాల్లో కొత్త ఆదాయపు పన్ను బిల్లు


ఢిల్లీ కేంద్ర ప్రభుత్వం త్వరలో కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని తీసుకురానుంది. మరికొన్ని రోజుల్లో ప్రారంభం కాబోయే బడ్జెట్ సమావేశాల్లోనే దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. రెండో విడత సమావేశాల్లో ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టనున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐటీ చట్టాన్ని మరింత సులభతరం చేస్తూ, నిబంధనలు అందరికీ అర్థమయ్యేలా ఈ కొత్త చట్టాన్ని తెస్తున్నారు. ''పార్లమెంట్ బడ్జెట్ సెషన్‌లో కొత్త ఆదాయపు పన్నుకు సంబంధించి బిల్లును ప్రవేశపెడతాం. ఇది పూర్తిగా కొత్త చట్టం. ప్రస్తుత ఉన్న చట్టానికి సవరణ కాదు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ముసాయిదాను న్యాయ మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోంది. బడ్జెట్ రెండో విడత సమావేశంలో దీన్ని ప్రవేశపెట్టనున్నారు'' అని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రెండు విడతల్లో నిర్వహించనున్నారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత, మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి. ఈ నెల 31న పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో ఆదాయపు పన్ను బిల్లు చర్చకు రానుంది. ఆదాయపు పన్ను చట్టం, 1961 అనేది ఆరు దశాబ్దాల క్రితం నాటిది. ప్రత్యక్ష పన్నులు, కార్పొరేట్ పన్ను, సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ పన్ను, గిఫ్ట్ అండ్ వెల్త్ ట్యాక్స్ ఇలా అన్నీ కలిపి 298 సెక్షన్లు, 23 అధ్యాయాలు ఉన్నాయి. ఈ చట్టాన్ని సంక్షిప్తంగా, స్పష్టంగా, సులభంగా అర్థం చేసుకొనేలా మార్చాలని కేంద్రం భావిస్తోంది. ఇందుకోసం సీబీడీటీ అంతర్గతంగా ఓ కమిటీ ఏర్పాటు చేసింది. వివిధ అంశాలపై ప్రజాభిప్రాయాలు, సలహాలను ఆహ్వానించింది. అలా ఆదాయపు పన్ను శాఖకు 6,500 సూచనలు అందాయి. వీటిని పరిగణలోకి తీసుకొచ్చి కొత్త బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. పరిమాణ పరంగా 60 శాతం తక్కువ పేజీల్లో ఈ చట్టాన్ని తీసుకొస్తున్నారు. దీంతో పన్ను చెల్లింపుదారులు ఎటువంటి కష్టం లేకుండా సులువుగా నిబంధనల్ని అర్థం చేసుకొనేందుకు వీలుకానుంది.




# టెల్కోలకు గుడ్‌న్యూస్.. రూ.లక్ష కోట్ల ఊరటకు కేంద్రం యోచన!

**ముంబయి:** టెలికాం కంపెనీలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ఏజీఆర్ (స్థూల సర్దుబాటు ఆదాయం) బకాయిల్లో పెద్ద మొత్తంలో మాఫీ చేయాలని చూస్తోంది. తద్వారా టెలికాం కంపెనీలకు దాదాపు రూ.లక్ష కోట్ల మేర ఊరట లభించే అవకాశం ఉందని తెలుస్తోంది. గతంలో దక్కించుకున్న స్పెక్ట్రమ్‌కు గానూ బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించాలన్న నిబంధనను ఇటీవల తొలగించిన ప్రభుత్వం.. మరోవిడత ఊరటకు సిద్ధమైనట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. తాజా నిర్ణయంతో ముఖ్యంగా వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ వంటి సంస్థలకు మేలు చేకూరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏజీఆర్ బకాయిలపై 2019లో టెలికాం కంపెనీలకు సుప్రీంకోర్టు బిగ్ షాకిచ్చిన సంగతి తెలిసిందే. ఏజీఆర్ విషయంలో ప్రభుత్వ నిర్వచనాన్ని సుప్రీంకోర్టు సమర్థిస్తూ తీర్పు వెలువరించడంతో ఆయా కంపెనీలపై దాదాపు రూ.1.47 లక్షల కోట్ల మేర భారం పడింది. ఇందులో దాదాపు 75 శాతం మేర వడ్డీ, పెనాల్టీ, పెనాల్టీ మీద వడ్డీనే కావడం గమనార్హం. వొడాఫోన్ ఐడియానే అత్యధికంగా చెల్లించాల్సిఉండగా.. ఎయిర్‌టెల్, టాటా టెలీ సర్వీసెస్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. 2025 మార్చి నాటికి వొడాఫోన్ ఐడియా బకాయిలు రూ.80వేల కోట్లకు, ఎయిర్‌టెల్ బకాయిలు రూ.42వేల కోట్లకు పెరిగే అవకాశం ఉందని టెలికాం వర్గాలు చెబుతున్నాయి. టెలికాం కంపెనీల ప్రతినిధులతో టెలికాం విభాగం పలుమార్లు సమావేశమైంది. ఈసందర్భంగా ఆర్థికంగా తాము ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు ఆయా కంపెనీలు ప్రభుత్వం దృష్టికితెచ్చాయి. ఈనేపథ్యంలో వడ్డీపై 50శాతం, పెనాల్టీలు, పెనాల్టీలపై విధించిన వడ్డీని 100 శాతం మేర మాఫీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ప్రతిపాదన యథాతథంగా కార్యరూపం దాల్చితే దాదాపు రూ.లక్ష కోట్ల మేర టెలికాం కంపెనీలకు ఊరట లభించనుంది. ముఖ్యంగా అప్పుల ఊబిలో కూరుకుపోయిన వొడాఫోన్ ఐడియాకు భారీ ఊరట లభించనుంది. ఈ నిర్ణయం వల్ల ఆ కంపెనీ బకాయిలు దాదాపు రూ.52 వేల కోట్ల మేర తగ్గనున్నాయి. ఎయిర్‌టెల్‌కు రూ.38వేల కోట్లు, టాటా టెలీ సర్వీసెస్‌కు రూ.14వేల కోట్ల మేర ఊరట లభించనుంది. ఈ నిర్ణయం వల్ల టెలికాం రంగంలో గుత్తాధిపత్యానికి తెరపడి.. అన్ని కంపెనీలకు సమానావకాశాలు లభిస్తాయని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.






# లాస్ ఏంజెలెస్‌లో కార్చిచ్చు.. వాయిదా పడిన అవార్డుల వేడుక

అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో దావానంలా వ్యాపించిన కార్చిచ్చు వల్ల మరోసారి క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల వేడుక వాయిదా పడింది. లాస్ ఏంజెలెస్‌లో మంటలు ఇంకా అదుపులోకి రానందున ఈ అవార్డుల వేడుకను వాయిదా వేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది.సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ క్రిటిక్స్ ఛాయిస్ అవార్డులను జనవరి 12న నిర్వహించాలని భావించారు. కానీ అప్పటికే లాస్ ఏంజెలెస్‌లో మంటలు చెలరేగడంతో అవి జనవరి 26కు వాయిదా వేశారు. ఆ కార్చిచ్చు ఇప్పటికీ అదుపులోకి రాకపోవడంతో ఫిబ్రవరి 7కు దాన్ని మరోసారి రీ షెడ్యూల్ చేశారు. శాంటా మోనికాలోని బార్కర్ హ్యాంగర్‌లో ఈ ఈవెంట్ నిర్వహించనున్నట్లు సంస్థ పేర్కొంది. ఇక ఈ ఏడాది జరగనున్న క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల్లో సమంత-వరుణ్ ధావన్ నటించిన వెబ్ సిరీస్ 'సిటాడెల్ : హనీ బన్నీ' పోటీ పడనుంది. ఉత్తమ విదేశీ భాష సిరీస్‌ల నామినేషన్‌లో ఇది చోటు దక్కించుకుంది. అత్యంత ప్రేక్షకాదరణ పొందిన ఈ సిరీస్ అవార్డును సొంతం చేసుకుంటుందో, లేదో తెలియాలంటే ఫిబ్రవరి 7వరకు ఆగాల్సిందే. మరోవైపు లాస్ ఏంజెలెస్‌లోని కార్చిచ్చు కారణంగా ఆస్కార్ నామినేషన్ల ప్రక్రియ రెండుసార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. జనవరి 17న ప్రకటించాల్సిన ఆస్కార్ నామినేషన్లను మొదట జనవరి 19కు వాయిదా వేశారు. తాజాగా ఈ నామినేషన్లను జనవరి 23న ప్రకటించనున్నట్లు తెలిపారు. ఇక ఈ ఏడాది ఆస్కార్ రద్దు అయ్యే అవకాశం ఉందంటూ వస్తోన్న వార్తలపై అకాడమీ సభ్యులు స్పందించారు. అలాంటి నిర్ణయం ఏదీ తీసుకోలేదన్నారు. ఆస్కార్ వేడుకల్లో మార్పు ఉండదని స్పష్టంచేశారు. ఒకవేళ అలాంటిది ఉంటే ఫిల్మ్ అకాడమీనే స్వయంగా ప్రకటిస్తుందన్నారు. 1000 మంది ఈ వేడుకల వల్ల ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. 96 ఏళ్ల చరిత్రలో ఇప్పటివరకు ఎప్పుడూ ఈ ఈవెంట్‌ను క్యాన్సిల్ చేయలేదన్నారు. కొవిడ్ సమయంలోనూ వాయిదా మాత్రమే వేసినట్లు గుర్తుచేశారు.

# 'పద్మావత్' ఆఫర్ నాకే వచ్చింది.. అందుకే తిరస్కరించా

**కంగనా రనౌత్**

నటి కంగనా రనౌత్ , దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుందని బాలీవుడ్ మొత్తం తెలుసు. గత కొన్నేళ్లుగా అనేక వేదికలపై ఒకరి పేరును మరొకరు ప్రస్తావించకుండానే విమర్శలు చేసుకున్నారు. తాజాగా కంగనా రనౌత్ మరోసారి తన మాటలకు పదును పెట్టారు. సంజయ్ ఇచ్చిన ఎన్నో ఆఫర్లను తాను వద్దని చెప్పానని తాజాగా చెప్పుకొచ్చారు. ముఖ్యంగా 'పద్మావత్'లో టైటిల్ రోల్ ఆఫర్ చేసినా తిరస్కరించానని అన్నారు. ఆ తర్వాత అందులో దీపిక పదుకొణె నటించి మంచి పేరు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'ఎమర్జన్సీ' ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా హిందీ సినిమా దర్శకులు మహిళలను వెండితెరపై చూపించే విషయంలో తాను ఎంతో నిరుత్సాహంగా ఉన్నట్లు తెలిపారు.

''ఒక నటిగా నేను అత్యున్నత స్థాయికి చేరాలనుకున్నా. ఫేక్ ఐల్యాష్, బొటాక్స్ (వృద్ధాప్య ఛాయలు కనిపించకుండా తీసుకునే చికిత్స) నాకవి సరిపడవు. నేను వాటి సాయంతో అందంగా కనిపించాలనుకునే హీరోయిన్‌ను కాదు. ఈ ఆలోచనాధోరణి క్రమంగా నాలో పెరుగుతూ వచ్చింది. 'తను వెడ్స్ మను', 'క్వీన్' తర్వాత నిరుత్సాహ భావన నాలో మరింత పెరిగిపోయింది. ఇండస్ట్రీలో ఉన్న టాప్-5 దర్శకులు.. వాళ్ల సినిమాల్లో హీరోయిన్ పాత్రలను చూపించే తీరు మీరు చూడండి. గట్టిగా ఐదారు నిమిషాలు కూడా అవకాశమివ్వరు. ఖాన్ త్రయం సినిమాలతో సహా, పెద్ద సినిమాల నుంచి నాకు ఆఫర్లు వచ్చాయి. కానీ, అందులో నేను కనిపించేది 10-15 నిమిషాలే. పైగా తక్కువ చేసి చూపిస్తారు. ఒక మహిళను సదుద్దేశంతో చూపించాలన్న ఆలోచన కూడా ఉండదు'' అని కంగనా అసహనం వ్యక్తం చేశారు. సంజయ్ లీలా భన్సాలీ పేరు ప్రస్తావించకుండా ''మీకు మరొక ఉదాహరణ చెబుతా. వేశ్యల కథ, పాత్రలో ఆ దర్శకుడు మల్టీవర్స్ తీశాడు. మహిళలు చేసే పాత్రలు ఇంతేనా? ఇంకా చాలా చేయగలరు కదా! సెక్స్ వర్కర్లను కించపరచడం నా ఉద్దేశం కాదు. అలా అయితే, నేను 'రజ్జో'లో నటించేదాన్నే కాదు. నాకు 'పద్మావత్'లోనూ అవకాశం వచ్చింది. 'నాకు కూడా పూర్తి స్క్రిప్ట్ ఇస్తే బాగుంటుంది' అని అడిగాను. 'నేను ఎవరికీ స్క్రిప్ట్‌లు ఇవ్వను' అని ఆయన అన్నారు. 'అప్పుడు హీరోయిన్ పాత్ర ఏంటి' అనడిగితే, 'అద్దం ముందు తయారవుతున్న హీరోయిన్‌ను చూసి, హీరో మైమరిచిపోతాడు' అని లైన్ చెప్పారు. నాకు సినిమా చూసినప్పుడు ఏమనిపించిందంటే, అందులో హీరోయిన్ సినిమా మొత్తం అద్దం ముందే కూర్చొని రెడీ అయినట్లే అనిపించింది. ఆయన చెప్పింది నిజమేననిపించింది. ఇతరులను ఆకర్షించడానికి వీళ్ల పేర్లను పదే పదే తీసుకురావాలని నేను అనుకోవడం లేదు. ఒక్కటే అడగదలుచుకున్నా, హీరోయిన్ల విషయంలో ఇలా ఆలోచిస్తుంటే, నేను ఏ దర్శకుడితో పనిచేయాలి'' అని కంగనా ప్రశ్నించారు.



# న్యాయం దక్కే వరకు నా పోరాటం ఆగదు

**మంచు మనోజ్**



**హైదరాబాద్:** కుటుంబ వివాదాలతో నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబం గత కొంతకాలంగా వార్తల్లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను నటుడు మంచు మనోజ్ కలిశారు. ఇటీవల చోటు చేసుకున్న పలు విషయాల గురించి అదనపు కలెక్టర్‌తో చర్చించారు.తన ఆస్తుల్లో ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని కోరుతూ మోహన్‌బాబు కొన్ని రోజుల క్రితం జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించారు. జల్‌పల్లిలోని తన నివాసాన్ని కొందరు ఆక్రమించుకున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను కొంతకాలంగా తిరుపతిలోనే ఉంటున్నానని తెలిపారు. అనంతరం ఆ నివాసంలో ఉంటున్న మనోజ్‌కు కలెక్టర్ నోటీసులు పంపించారు. ఈ క్రమంలోనే వివరణ ఇచ్చేందుకు మనోజ్ తాజాగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిశారు.

**మాకు ఆస్తి తగాదాలు ఏమీ లేవు: మంచు మనోజ్**

రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసిన అనంతరం మంచు మనోజ్ మీడియాతో మాట్లాడారు. ''మాకు ఆస్తి తగాదాలు లేవు. మా విద్యాసంస్థల విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. విద్యార్థుల కోసమే నేను పోరాడుతున్నా. మా నాన్నను అడ్డం పెట్టుకొని మా అన్న ఆడుతున్న నాటకం. విద్యార్థులు, నా కుటుంబం, బంధువుల కోసమే నా పోరాటం. న్యాయం దక్కే వరకు నా పోరాటం ఆగదు'' అని మనోజ్ తెలిపారు.

# తమన్ వ్యాఖ్యలపై చిరంజీవి పోస్ట్..

హైదరాబాద్: 'డాకు మహారాజ్' సక్సెస్ ప్రెస్‌మీట్‌లో సంగీత దర్శకుడు తమన్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ నెగిటివిటీ సినిమాపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. దీనిని ఉద్దేశించి తాజాగా అగ్ర కథానాయకుడు చిరంజీవి స్పందించారు. ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

''డియర్ తమన్.. నిన్న నువ్వు మాట్లాడిన మాటలు హృదయాల్ని తాకేలా ఉన్నాయి. ఎప్పుడూ సరదాగా మాట్లాడుతూ ఉండే నీలో ఇంత ఆవేదన ఉండటం ఒకింత ఆశ్చర్యంగా అనిపించింది. కానీ, మనసు ఎంత కలత చెందితే నువ్వింతగా స్పందించావో అని అనిపించింది. విషయం సినిమా అయినా, క్రికెట్ అయినా, లేదా మరో సామాజిక సమస్య అయినా సోషల్ మీడియా వాడుతున్న ప్రతిఒక్కరూ తమ మాటల తాలూకు ప్రభావం ఆ వ్యక్తుల మీద ఎలా ఉంటుందనేది ఆలోచించాలి. ఎవరో అన్నట్టు మాటలు ఉచితమే, కానీ, ఆ మాటలు మరొకరిలో స్ఫూర్తి నింపుతాయి. అలాగే ఇంకొకరిని నాశనం చేస్తాయి. కాబట్టి దేనిని ఎంచుకుంటావనేది నీపైనే ఆధారపడి ఉంటుంది. మనం పాజిటివ్‌గా ఉంటే ఆ ఎనర్జీ మన జీవితాలను కూడా పాజిటివ్‌గా ముందుకు నడిపిస్తుంది'' అని చిరంజీవి రాసుకొచ్చారు.

ఈ పోస్ట్‌పై తమన్ స్పందించారు. ''డియర్ అన్నయ్యా... మీ మాటలు నాకు కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన..! అన్న భగవద్గీత శ్లోకాన్ని గుర్తు చేశాయి. ఎంత కాదనుకున్నా మనుషులం కదా. ఒక్కోసారి ఆవేదన గుండె తలుపులు దాటి వచ్చేస్తూ ఉంటుంది. పేగు తెంచుకొని పుట్టిన బిడ్డని కళ్ళు తెరిచే లోపలే చిదిమేస్తుంటే వచ్చిన బాధ అది. నన్ను అర్థం చేసుకొని స్పందించిన మీ మాటలు నాకు జీవితాంతం గుర్తు ఉంటాయి'' అని పేర్కొన్నారు.

తమన్ ఏమన్నారంటే...:

''సక్సెస్ చాలా గొప్పది. ఎంత డబ్బు ఖర్చు పెట్టినా దొరకదు. జీవితంలో ముందుకుసాగడానికి కావాల్సిన ఎనర్జీని అది అందిస్తుంది. సక్సెస్ లేకపోతే తక్కువగా చూస్తుంటారు. మేమంతా కష్టపడేది విజయం కోసమే.



ఇప్పుడున్న రోజుల్లో ఒక నిర్మాత సక్సెస్ అందుకోవడం, తన సక్సెస్‌ను ఓపెన్‌గా మాట్లాడటం ఎంతో కష్టంగా మారింది. నెగెటివ్ ట్రోల్స్, నెగెటివ్ ట్యాగ్స్ సినిమాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఒక నిర్మాత ఎంతో కష్టపడి డబ్బులు కూడబెట్టుకొని, ఫైనాన్స్ తెచ్చుకొని ఒక సినిమాలో పెడుతుంటాడు. మీరు క్రియేట్ చేసే నెగెటివ్ ట్రెండ్స్ వల్ల ఒక నిర్మాత ఎంత కుమిలిపోతున్నాడో మీకు తెలియదు. ఇది ఎంతో దారుణమైన విషయం. నిర్మాతలు మనకు దేవుళ్లతో సమానం. వాళ్లను జాగ్రత్తగా చూసుకోవాలి. హీరోలు, సంగీత దర్శకులు, టెక్నీషియన్స్‌తోపాటు ఫ్యాన్స్‌పైన కూడా ఆ బాధ్యత ఉంది. ప్రపంచం మొత్తం తెలుగు సినిమాను గర్వంగా చూస్తుంది. తెలుగు సినిమా ప్రకాశిస్తోంది. అన్ని ఇండస్ట్రీల వారు తెలుగులో సినిమా చేయాలని చూస్తున్నారు. మనమే మన సినిమాని చంపేస్తుంటే ఎలా. ఎంతో బాధగా ఉంది. ఒక విజయం గురించి మనం ఓపెన్‌గా చెప్పలేకపోతున్నాం. ఇది దురదృష్టకరం. వ్యక్తిగతంగా మీరు తిట్టుకోండి. అంతేకానీ సినిమాని మాత్రం చంపేయకండి. అది ఏమాత్రం కరెక్ట్ కాదు'' అని తమన్ తెలిపారు.

# సికింద్రాబాద్ గణపతి ఆలయంలో రానా పూజలు



**రెజిమెంటల్ బజార్ :** సికింద్రాబాద్ గణపతి ఆలయాన్ని సినీ హీరో రానా సందర్శించి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించారు. ఇక 'బలగం' హీరో ప్రియదర్శి నటిస్తున్న సినిమాను రానా క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఆ కార్యక్రమానికి యాంకర్ సుమతో పాటు పలువురు దర్శక, నిర్మాతలు హాజరయ్యారు. ఏషియన్స్ ఫిల్మ్స్ ఆధ్వర్యంలో ఈ చిత్రం రానుంది. ఆలయానికి వచ్చిన రానాను చూసేందుకు స్థానికులు, భక్తులు పెద్దఎత్తున వచ్చారు. ఈసందర్భంగా ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

# సూర్య నో చెప్పడం నన్ను బాధించింది: గౌతమ్ మేనన్



విక్రమ్ హీరోగా గౌతమ్ మేనన్ తెరకెక్కించిన చిత్రం 'ధృవ నక్షత్రం' . దాదాపు ఏడేళ్ల క్రితమే సిద్ధమైన ఈ సినిమా అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న గౌతమ్ మేనన్ సినిమా విశేషాలు పంచుకున్నారు. దీనిని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తానని అన్నారు. విక్రమ్ కంటే ముందు వేరే హీరోలకు ఈ కథ చెప్పానని తెలిపారు.''ధృవ నక్షత్రం కథను తొలుత వేరే హీరోలకు చెప్పాను. అనివార్య కారణాల వల్ల వారు దానిని రిజెక్ట్ చేశారు. వారి అభిప్రాయాన్ని అర్థం చేసుకున్నా. అందువల్ల వాళ్లు రిజెక్ట్ చేసినందుకు నేనేమీ బాధపడలేదు. కానీ ఈ కథకు సూర్య నో చెప్పడాన్ని తట్టుకోలేకపోయా. అది నన్నెంతో బాధించింది'' అని తెలిపారు. ''ధృవ నక్షత్రం' విడుదల కోసం ఎంతో ప్రయత్నిస్తున్నా. తప్పకుండా దానిని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం. ఎన్నో ఏళ్ల క్రితం దీనిని తెరకెక్కించినప్పటికీ ప్రేక్షకులు ఏమాత్రం బోర్ ఫీల్ కారు. దీనిని పాత కథ అనుకోరు. నేటితరం ప్రేక్షకులకు తప్పకుండా ఇది నచ్చుతుందని నమ్ముతున్నా. ఇటీవల విడుదలై విజయాన్ని అందుకున్న 'మద గజ రాజ' సుమారు 12 ఏళ్ల క్రితం తెరకెక్కించారు. ఆ సినిమా ఇటీవల విడుదలై సక్సెస్ అందుకోవడం నాకు ఆనందాన్ని ఇచ్చింది. ఆ సినిమా మాదిరిగానే మా సినిమా కూడా ప్రేక్షకులను అలరిస్తుందని నమ్ముతున్నా'' అని గౌతమ్ మేనన్ చెప్పారు.స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమే 'ధ్రువ నక్షత్రం' . ఏడేళ్ల క్రితమే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆర్థిక సమస్యల కారణంగా విడుదల కాలేదు. దీనిపై ఇప్పటికే పలుమార్లు గౌతమ్ వాసుదేవ్ మేనన్ అసహనం వ్యక్తంచేశారు. ఇది వాయిదా పడడం బాధను మిగుల్చుతుందని అన్నారు . 'ఇది చాలా హృదయవిదారకంగా ఉంది. చిత్రం వాయిదా విషయంలో ఎన్నో రోజులుగా మనశ్శాంతి లేదు. నా కుటుంబం ఆందోళన చెందుతోంది. నాకు ఎటైనా వెళ్లిపోవాలనిపిస్తోంది. కానీ, పెట్టుబడిదారులకు సమాధానం చెప్పాలని ఉంటున్నా' అని ఓ సందర్భంలో తెలిపారు.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS తెలుగు దినపత్రిక విశ్వంభర
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com